www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
ప్రకాశం
శనివారం 5, ఆగస్టు 2017


గిద్దలూరులో అనుచరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

షాక్ ఇచ్చిన 'అన్నా'



- టీడీపీకి రాజీనామా ప్రకటనతో అనుచరుల్లో అయోమయం
- తోడుగా ఒక్కరు కూడా రాజీనామా చేయని వైనం
- రాంబాబు వర్గీయులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంతనాలు
- విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన జనార్దన్
- దామచర్ల ఫోన్ ఎత్తని రాంబాబు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు అన్నా రాంబాబు టీడీపీకి రాజీనామా ప్రకటన ఆ పార్టీతోపాటు, ఆయన అనుచరులను షాక్‌కు గురి చేసింది. వైసీపీ నాయకులు కూడా అన్నా ఆంతర్యం ఏమిటన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. గిద్దలూరులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీకి గుడ్‌బై చెప్తున్నట్లు రాంబాబు ప్రకటించినప్పటికీ మద్దతుగా ఆయన వెంట ఉన్న వారిలో ఎవరూ రాజీనామాలు ప్రకటించకపోవడం చర్చనీయాంశమైంది. రాంబాబు నిర్ణయం జిల్లాలో రాజకీయాన్ని మాత్రం వేడెక్కించింది. ప్రత్యేకించి టీడీపీలో ఆధిపత్య పోరు నెలకొని ఉన్న చోట్ల అలజడి మొదలైంది. ఏడాది క్రితం గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి

మిగతా 15వ పేజీలో



కలుజువ్వలపాడులో జాతీయ రహదారిపై జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల, టీడీపీ నేతలు (ఇన్‌సెట్‌లో) కొండపిలో దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి, ఇతర నేతలు

జగన్‌పై టీడీపీ నేతల ఫైర్

- సీఎంపై వ్యాఖ్యలకు నిరసనగా జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు
- పలు చోట్ల దిష్టిబొమ్మల దహనాలు
- సంస్కారం లేని ప్రతిపక్ష నేతన్న మంత్రి శిద్దా

15లో

ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిరసన ప్రదర్శనలు, జగన్ దిష్టిబొమ్మల దహనాలు చేశారు. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చివేయాలని మాట్లాడటం ద్వారా జగన్ తన ఫ్యాక్షన్ స్వభావాన్ని మరోసారి బయటపెట్టుకున్నారన్నారు. అలాంటి వ్యక్తికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. జగన్‌పై మంత్రి శిద్దా రాఘవరావు మండి పడ్డారు. ఆయన సంస్కారం లేని ప్రతిపక్ష నేత అని ధ్వజమెత్తారు.


డెయిరీలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తున్న చైర్మన్ చల్లా శ్రీనివాసరావు

- ఉద్యోగులకు డెయిరీ చైర్మన్ చల్లా హామీ
- ఆందోళన తాత్కాలికంగా వాయిదా
- సంస్థ మనుగడను ప్రశ్నించిన ఉద్యోగ ప్రతినిధులు
- తాజా పరిస్థితిపై పాలక మండలి చర్చ

16లో

వారంలో బకాయిల చెల్లింపు

వైభవంగా వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా మహిళలు శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే ప్రధాన ఆలయాల వద్ద బారులు తీరారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వ్రతాలు చేశారు. నిండు ముత్తయిదువులుగా సుఖశాంతులతో జీవించేలా చూడాలని ప్రార్థించారు. : వివరాలు లోపలి పేజీల్లో..



మంచం పట్టిన పాటిమీదపాలెం

- విజృంభించిన విష జ్వరాలు
- వంద మందికి పైగా పీడితులు
- పలువురికి డెంగ్యూ లక్షణాలు

7లో

కోడి కూత మూగబోయింది



చికెన్, గుడ్లు ధరలు పతనం

శ్రావణమాసం దెబ్బతోపాటు అధిక ఉత్పత్తీ కారణమే

కేజి కోడి హోల్‌సేల్ ధర రూ.55

చికెన్ స్కిన్‌లెస్ కేజి రూ.120

ధర తగ్గడంతో లబోదిబోమంటున్న నిర్వాహకులు

కోళ్ల పరిశ్రమ కుదేలైంది. ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో తెప్పరిల్లుకోలేకపోతోంది. రెండు నెలల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధరలు శ్రావణమాసం రావడంతో వారం రోజుల నుంచి రోజురోజుకూ ధరల పతనం ప్రారంభమైంది. ధర బాగున్నప్పుడు ఎంతో ఆశతో కోళ్ల పెంపకం చేపట్టిన రైతుల్లో ఇప్పుడు తీవ్ర ఆందోళన మొదలైంది. ధరలు ఇలానే ఉంటే ఖర్చులూ రావని వాపోతున్నారు.

బల్లికురవ : వేసవి అనంతరం రెండు నెలలు ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు కోడి పిల్లలు పెంపకాన్ని అమాంతం పెంచారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుమారు పది లక్షల కోళ్లను పెంచుతున్నట్లు అంచనా. ఒక్క బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, మల్లాయపాలెం, వల్లాపల్లి, కొప్పెరపాడు, చెన్నుపల్లి గ్రామాల్లోనే లక్ష బాయిలర్ కోళ్లు ఉన్నాయి. గతేడాది సీజన్‌లో ధర ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది కొందరు ఫారాలను అద్దెకు తీసుకొని పెంచారు. జూన్ 15వ తేదీ వరకు కోడి(లైవ్) కిలో 110 రూపాయలు అమ్మింది. స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.220 వరకు వరకు రిటైల్‌గా అమ్మారు. దీంతో రైతులు కోడి పిల్లల పెంపకాన్ని పెంచేశారు. ధర పతనంతో ఈ నెలలో చికెన్ కేజి



రూ.120కు చేరగా లైవ్ కోడి రూ.60కు పడిపోయింది. దీంతో కోళ్ల ఫారాలు చేపట్టిన రైతులకు తీవ్ర నష్టాలు రానున్నాయి.

ప్రస్తుతం కిలో కోడి ధర రూ.57

ప్రస్తుతం రైతు వారి పరిస్థితిని గమనిస్తే కిలో కోడి ధర రూ.57 ఉంది. రైతులకు రూ.55 గిట్టుబాటు అవుతుంది. గత నెలలో రెండు కిలోల కోడికి రూ.220 వచ్చింది. సాధారణంగా బాయిలర్ కోడి రూ.150 పలికితే నష్టం రాదు. కాని ఇప్పుడు ధర బాగా తగ్గడంతో ఒక్కో కోడికి రూ.40 నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ఒక్క కోడి పిల్లను ఆరువారాలు పెంచితే రెడు కేజీల కోడి తయారవుతుంది. దీనికి మూడున్నర కేజీల మేత వేయాలి. కిలో మేత ధర రూ.28 అంటే ఆరు వారాల్లో ఒక కోడి పిల్లను పెంచడానికి రూ.98 ఖర్చవుతుంది. పిల్ల ధర ప్రస్తుతం రూ.32 ఉంది. చికెన్ ధరలు పడిపోవడంతో భారీగా నష్టం వాటిల్లుతోందని పలువురు లబోదిబోమంటున్నారు.

గుడ్డు ధర కూడా పతనం

బాయిలర్ కోళ్ల ధరలతో పాటు గుడ్డు ధర కూడా పతనమైంది. గత నెలలో రూ.4 ఉన్న రైతు వారి గుడ్డు ధర ఇప్పుడు రూ.3కు పడిపోయింది. ఒక గుడ్డు రూ.3.25 ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ధర తగ్గడంతో తీవ్రంగా వేధిస్తోంది. చికెన్ ధరలు తగ్గినా బహిరంగ మార్కెట్‌లో కొందరు వ్యాపారులు కేజి రూ.150కు రిటైల్‌గా అమ్మి ప్రజలను దోచుకుంటున్నారు.

తీవ్రంగా నష్టపోనున్నాం



దర్శి హనుమంతరావు, పౌల్ట్రీ రైతు, నక్కబొక్కలపాడు

బాయిలర్ కోడి ధరల పతనం కావడంతో తీవ్రంగా నష్టపోనున్నాం. 10 వేల కోళ్ల ఫారంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రోజురోజుకూ తగ్గుతున్న ధరలు ఆందోళనకు గురిచేస్తోంది.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



పుచ్చకాయల హనుమంతరావు, పౌల్ట్రీ రైతు, గుంటుపల్లి

శ్రావణమాసం ప్రభావం కోళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. గత నెలలో రెండు వందల రూపాయలు రిటైల్‌లో అమ్మిన కేజి చికెన్ ఈ నెలలో వంద రూపాయలకు చేరింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తీవ్ర నష్టాలు తప్పవు.

కోళ్లఫారాలు నిర్వహించలేం



ఏల్చూరి తిరుపతిరావు, పౌల్ట్రీ రైతు, కొత్తపాలెం


ధరలు ఇదే మాదిరిగా ఉంటే కోళ్లఫారాలు నిర్వహించలేం. అద్దెకు తీసుకొని ఫారాలలో కోడి పిల్లలు వేశాం. ధర కుంగదీస్తోంది. గతేడాది వచ్చిన లాభం ఈ ఏడాది నష్టం రూపేణా పోయింది. మేత, కోడిపిల్ల కొనుగోలులోకి పెట్టిన పెట్టుబడి కూడా రాదు.

స్పెషల్ బ్రాంచి ప్రక్షాళన

- ఎస్బీలో పనిచేసే యువకానిస్టేబుళ్లకు నిన్నటితో ముగిసిన దరఖాస్తు గడువు

- అవినీతిరహిత చర్యలకు ఎస్పీ కృషి

పోలీస్ వ్యవస్థలో స్పెషల్ బ్రాంచి అంటే గుఢచారి విభాగం.. ఈ వ్యవస్థ యావత్తు పోలీస్ యంత్రాంగానికి చెవులు, కళ్లు లాంటిది. ఈ విభాగంలో పనిచేసే పోలీసులు ఎంత సమర్ధంగా పనిచేస్తే పోలీసు యంత్రాంగానికి అంత ప్రతిష్ఠ పెరుగుతుంది. కానీ జిల్లాలో స్పెషల్ బ్రాంచి పోలీసుల పనితీరుపై ఎస్పీ సత్యఏసుబాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఒకమారు హెచ్చరికలు జారీ చేసినా ఆ విభాగంలో పనిచేసే వారి తీరు ఏమాత్రం మారలేదని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వ్యవస్థ సమూలంగా మార్పు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.



ఒంగోలు క్రైం : పోలీసుశాఖకు కీలకమైన స్పెషల్ బ్రాంచ్‌ని ప్రక్షాళన చేసేందుకు జిల్లా ఎస్పీ సత్య ఏసుబాబు శ్రీకారం చుట్టారు. ఎస్పీకి అత్యంత ముఖ్యమైన ఈ విభాగం పారదర్శకంగా ఉండాలని ఆయన బాధ్యతలు తీసుకున్న తొలి రోజుల్లోనే నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచే స్పెషల్ బ్రాంచ్ పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ విభాగంలో మొత్తం 22 మంది హెడ్‌కానిస్టేబుళ్లు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. వీరంతా జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీకి చేరవేయాల్సి ఉంటుంది. అంతేకాదు పోలీస్ పని తీరు, ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆందోళన కార్యక్రమాలను ముందుగానే పసిగట్టాలి. శాంతిభద్రతలకు భగం వాటిల్లకుండా ఉండే విధంగా క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎస్పీకి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలి. దీంతో పాటు అత్యంత రహస్యమైన విచారణలు సైతం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చేపడతారు. ఇంకా పాస్‌పోర్టుల పరిశీలన చేయాల్సి ఉంది. ప్రస్తుతం మిగతా పనులన్నీ వదిలివేసి కేవలం పాస్‌పోర్టు పరిశీలనలకే కొందరు పరిమితమయ్యారు. అంతేకాకుండా అత్యంత ముఖ్యమైన, రహస్యమైన సమాచారాన్ని సైతం ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజాప్రతినిధులకు చేరవేయడం, కొంతమంది స్టేషన్ హౌస్‌ఆఫీసర్లు, ఇంకా ఆ పై స్థాయి అధికారులకు తెలియజేస్తూ స్పెషల్‌బ్రాంచ్ పనితీరును నీరుగారుస్తున్నారన్న విమర్శలు పుంఖానుపుంఖాలుగా ఉన్నాయి. పూర్తికాలం కేటాయించిన స్థానాల్లో నివాసం ఉండకుండా ఎక్కువ మంది ఒంగోలులోనే కాపురాలు ఉంటూ అందిన సమాచారం మాత్రమే అధికారులకు తెలియజేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో పాలనపరమైన ఇబ్బందులతో పాటు అనేక పర్యాయాలు శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన ఘటనలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో జరిగే సంఘటనలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన వీరు అసలు ఆ ఊసే లేకుండా వ్యవహరిస్తున్నారనే పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వేమవరంలో జరిగిన జంటహత్యలు విషయంలో స్పెషల్‌బ్రాంచ్ సరిగ్గా పనిచేయలేదని అప్పట్లో గుంటూరు రేంజ్ ఐజీ ఎన్.సంజయ్ స్పష్టం చేశారు. అనంతరం జరిగిన పరిమాణాలలో జిల్లా ఎస్పీగా సత్యఏసుబాబు బాధ్యతలు చెపట్టారు. వెంటనే స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ కొంతమంది మారలేదు. ఇలా వరుస ఘటనలో విసుగుచెందిన ఎస్పీ సత్యఏసుబాబు స్పెషల్‌బ్రాంచ్‌ని సమూలంగా మార్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో పనిచేస్తున్న ఉత్సాహవంతుల నుంచి అంగీకారం కోరారు. శుక్రవారం సాయంత్రం వరకు తమ అంగీకారాన్ని తెలియజేయాలని సూచించారు. అదే సమయంలో గతంలో పనిచేసిన పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు తిరిగి స్పెషల్ బ్రాంచ్‌లోకి వచ్చేందుకు అంగీకారం తెలియజేశారు. వారిని పక్కన పెట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.


ఇంటెలిజెన్స్ క్లియరెన్స్ ఉండాలి

ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న వారిపై ఎలాంటి ఇంటిలిజెన్స్ నివేదికలు తెప్పించుకోకుండానే ప్రజాప్రతినిధులు సిఫార్సులు, అధికారుల అండదండలు ఉన్న వారికే అవకాశం ఇచ్చారు. ఈ వ్యవస్థను సమూలంగా మార్పు చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్న జిల్లా ఎస్పీ చివరకు ఏం చేస్తారనేది చూడాల్సి ఉంది. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసే హెడ్‌కానిస్టేబుళ్లు అవినీతి ఆరోపణలు, ఎలాంటి కేసులు లేకుండా ఉండాలి. ఇంటిలిజెన్స్ నివేదిక వచ్చిన తరువాతనే స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేయించాలి.

తహసీల్దార్‌పై యాసిడ్ దాడి కథ కంచికేనా!

● దాడి జరిగి నేటికి ఏడాది ● ముందుకు సాగని దర్యాప్తు ● నిందితులను గుర్తించని పోలీసులు ● దర్యాప్తు తీరుపై తహసీల్దార్ పెదవి విరుపు

పీసీపల్లి : గత ఏడాది ఆగస్టు 5వ తేదిన ఉదయం 10 గంటల సమయంలో విధులు నిర్వహించేందుకు తహసీల్దార్ మౌలాసాహెబ్, సిబ్బందిపై యాసిడ్ దాడి జరిగింది. విధులకు వచ్చిన తహసీల్దార్ ఫ్యాన్ స్విచాన్ చేయగానే ఫ్యాన్ రెక్కలపై నుంచి యాసిడ్ ధారలు వారిపై పడ్డాయి. దీంతో తహసీల్దార్‌తో పాటు కంప్యూటర్ అపరేటర్ నరేష్‌కు గాయాలయ్యాయి. అప్పట్లో కేసు సంచలనం సృష్టించింది. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఒంగోలు నుంచి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ తెప్పించి నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు వేలిముద్రలు, కొన్ని ఆధారాలు సేకరించారు. ఇది జరిగి ఏడాది గడిచినా నేటికీ నిందితుడులను పోలీసులు గుర్తించలేకపోయారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎన్నో కీలకమైన కేసులను గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసు యంత్రాంగం యాసిడ్ దాడి కేసుకు సంబంధించి ఆగంతకులను గుర్తించలేకపోవటంతో వారి పనితీరుపట్ల విమర్శలు వినవస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి కార్యాలయంలో పనిచేస్తున్నవారు. అప్పట్లో భూవివాదాలకు సంబంధించిన వారి నుంచి పోలీసులు వేలిముద్రలు సేకరించి, వారిని స్టేషన్‌కు పిలిపించి విచారణ కూడా చేశారు.



ఫ్యాన్‌పై అమర్చివున్న యాసిడ్ మూతలు (ఫైల్‌ఫోటో)





గాయపడ్డ కంప్యూటర్ అపరేటర్, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం (ఫైల్‌ఫోటోలు)

పలువురిపై అనుమానం..

ఈ కేసుకు సంబంధించి పోలీసుతోపాటు రెవెన్యూ సిబ్బంది పలువురిపై అనుమానాలను వ్యక్తం చేశారు. తహసీల్దార్ అనుమానిత వ్యక్తిపై ఇచ్చిన సమాచారంతో నిందితులను గుర్తించడం రెండు, మూడురోజులు మించి సమయం అవసరం లేదు. నిందితులు ఎవరనేది పోలీసులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్నారన్న ఆరోపణలున్నాయి. దీన్ని బట్టి మిగతా కేసుల్లో కూడా పోలీసుల పనితీరు ఇలానే ఉంటుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దర్యాప్తుపై తహసీల్దార్ పెదవి విరుపు

ఏడాదికి క్రితం యాసిడ్ దాడి జరిగిన కేసులో పురోగతిపై తహసీల్దార్‌ను గురువారం వివరణ కోరగా ఆ విషయం ఇప్పుడు చర్చించడం అనవసరమన్నారు. తాను అనుమానం వ్యక్తం చేసిన వ్యక్తిని తీసుకువచ్చి పూర్తిస్థాయిలో విచారణ చేస్తే నిందితులు బయట పడేవారని చెప్పారు. పోలీసులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయలేదో తెలియడం లేదన్నారు. త్వరలో కలెక్టర్, ఎస్పీని కలిసి ఈ కేసు విషయంలో దర్యాప్తు ఆలస్యంపై ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య

అర్ధవీడు(బేస్తవారపేట): అర్ధవీడు మండలంలోని అర్ధవీడు రహమత్ నగర్‌కు చెందిన ముసాపురం అరవింత్(22) రెండేళ్ళ క్రితమే ఆర్మీలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్నాడు. తల్లిదండ్రులు రాజు, లక్ష్మీదేవిలు ఆనందంతో ఉన్నారు. వారికి ముగ్గురు మగ సంతానం ఉండగా చివరి వాడైన అరవింద్‌కు ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరుతాయని అనుకున్నారు. అరవింద్ 10రోజుల క్రితం సెలవుపై ఇంటికి వచ్చాడు, తనకు వివాహనం చేయాలని తల్లిదండ్రులతో పట్టుబట్టాడు. అన్నయ్యలకు వివాహం చేసిన తరువాత మరో ఎడాదిలో నీకు వివాహం చేస్తామని చెప్పగా మనస్తాపం చెందాడు. శుక్రవారం ఉదయం తన ఇంటిలో ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతిచెందిన అరవింద్



మృతిచెందిన శివారెడ్డి

పాముకాటుతో రైతు మృతి

సంతమాగులూరు: ఏల్చూరు గ్రామానికి చెందిన బలపనూరి శివారెడ్డి(47) శుక్రవారం తన పొలంలో వేసిన పత్తి, మినుము పైర్లను చూసేందుకు ఇద్దరు రైతులుతో కలసి ఉదయం పొలం వెళ్ళారు. చేనులో గట్టుపై నడిచే సమయంలో పాముపై శివారెడ్డి కాలు వేయటంలో కాటు వేసింది. దీంతో పక్కనే వున్న వారు చూసి ఏల్చూరు నుండి నర్సరావుపేట ఆసుపత్రికి తరలించేలోగా శివారెడ్డి మృతిచెందాడు. మృతుడికి భార్య ,ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు రైటర్ భుజింగరావు తెలిపారు.

ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల వద్ద లక్షలు స్వాహా

దొనకొండ : మండలంలోని వెంకటాపురం గ్రామంకు చెందిన వ్యక్తి నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామంటూ వారిలో ఆశలు కల్గించి వారి నుండి లక్షల రూపాయలు స్వాహా చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్సై కె.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చేరెడ్డి వెంకటసుబ్బయ్య రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానంటూ అదే గ్రామానికి చెందిన తోటా వీరాంజనేయులు వద్ద రూ.7లక్షలు, తిరుమల దేవస్థానంలో గుండుకొట్టే ఉద్యోగం ఇప్పిస్తానంటూ అన్నవరపు కోటయ్య వద్ద రూ.6.50లక్షలు ఏడాది క్రితం తీసుకున్నాడు. బాధితులు ఎప్పుడు ప్రశ్నించినా సరైనా సమాదానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతూ ఏడాదిగా ఇబ్బందులు పెడుతున్నాడు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏగ్రామంలోనైనా ఎవరైనా ఇటువంటి మోసాలకు గురైతే వెంటనే 9440627116 నెంబర్‌కు పోన్ చేసి తెలిపితే విచారించి తగిన న్యాయం చేయటం జరుగుతుందని ఎస్సై వివరించారు.

బస్సు, లారీ ఢీ - ప్రయాణికులకు గాయాలు





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కనిగిరి టౌన్ : 565 జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గాయాలైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీ వద్ద జరిగింది. మార్టూరు నుండి టైల్స్ లోడ్‌తో కనిగిరి మీదుగా బెంగుళూరు వెళ్తున్న టర్బోలారీని ఒంగోలు నుండి పెళ్ళి బృందంతో వెలిగండ్ల మండలం కంకణంపాడు గ్రామానికి వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీకొంది. దీంతో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జుఅయింది. అందులో 19 మందికి స్వల్పగాయాలు, ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి.ప్రయాణికులు హాహాకారాలు చేశారు. ఎస్ఐ ఉప్పు శ్రీనివాసులు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను 108లో స్థానిక ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. 9 మందిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉండగా కనిగిరి ఎస్ఐ ఉప్పు శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

చిన్నారి మృతిచెందిన చోటే ఈ ప్రమాదం....

ఇటీవల జరిగిన కారు ప్రమాదంలో చిన్నారి మృతిచెందిన ఘటన స్థలం వద్దే ఈ ప్రమాదం జరగటంతో ప్రజలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. కారు ప్రమాదం అనంతరం ఎన్‌హెచ్ 565 రహదారి చివర నిర్మాణం కాకపోవటంతో ఆ ప్రాంతంలో గతుకుల మయమై ప్రమాదాలు చోటుచేకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు బారికేట్లు ఏర్పాటు చేశారు. గతుకుల మయంగా ఉన్న ఈ ప్రాంతం వద్దే భారీకేట్లు పెట్టడంతో అక్కడికి వచ్చేంతవరకు వాహన చోదకులకు అర్థం కావటం లేదు.

ఎమ్మెల్యే కదిరి పరామర్శ....

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కదిరి బాబూరావు స్థానిక ప్రభుత్వ వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. క్షతగాత్రులకు ఫోన్‌లో పరామర్శించి వారికి పూర్తిగా అండగా ఉంటానని భయాందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

గొలుసు దుకాణంలో మద్యం బాటిళ్ళు పట్టివేత

మొగళ్ళూరు(కనిగిరి) : మండలంలోని మొగళ్ళూరు గ్రామంలో శుక్రవారం పోలీసులు మద్యం గొలుసు దుకాణంపై దాడి చేసి 18 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. మొగళ్ళూరుకు చెందిన దాదిబోయిన బాలకృష్ణ గొలుసు దుకాణాన్ని నిర్వహిస్తుండగా వెలిగండ్ల ఎస్ఐ చౌడయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపు నిర్వాహకుడు బాలకృష్ణను అరెస్టు చేశామని కోర్టులో హాజరు పరుచనున్నట్లు చెప్పారు. మండలంలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొలుసు దుకాణాలు సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



మద్యం బాటిళ్ళు, నిందితుడుతో ఎస్ఐ చౌడయ్య

ఆంధ్రజ్యోతి
4
గిద్దలూరు
ప్రకాశం • శనివారం
5 ఆగస్టు 2017
గిద్దలూరు । కొమరోలు । రాచర్ల । కంభం । బేస్తవారపేట । అర్ధవీడు

ప్రభుత్వ గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలి

కొమరోలు: ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్‌టీఆర్ గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీపీ కామూరి అమూల్య కోరారు. మండలంలోని సూరవారిపల్లె గ్రామంలో ఎన్‌టీఆర్ గృహనిర్మాణ అర్హులను ప్రకటించడానికి శుక్రవారం గ్రామసభను ఏర్పాటుచేశారు. సమావేశానికి సూరవారిపల్లె గ్రామసర్పంచ్ బోయిళ్ళ సుమిత్ర అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో నరసయ్య, ఏఈ లబ్ధిదారుల జాబితాలోని 141 మంది పేర్లను చదివి వినిపించారు.

రేపు పూజల వేలంపాట

గిద్దలూరు: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజల వేలం పాటలు ఆదివారం ఉదయం 10 గంటలకు అమ్మవారిశాలలో సర్వసభ్య సమావేశంతో పాటూ నిర్వహించడం జరుగుతుందని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మునగనూరి సుబ్బారావు, కార్యదర్శి తుమ్మల పెంట సత్యానారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొనాలని వారు కోరారు.

నీటి పథకానికి మోటారు అందజేత

గిద్దలూరు: మండలంలోని వెల్లుపల్లి గ్రామంలో ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే మంచినీటి పథకానికి టెక్స్‌మో కంపెనీ ప్రతినిధులు రూ.65 వేల విలువైన మోటార్‌ను, విడిబాగాలను అందచేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో టెక్స్‌మో విజయవాడ మేనేజర్ ఉస్మాన్‌షరీఫ్, స్థానిక డీలర్ పరుచూరి నాగేశ్వరరావు, సర్పంచ్ పేరం హరనాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

రాచర్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.అరుణాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులంతా సమావేశంలో పాల్గొనాలని ఆమె కోరారు.

పేదలందరికీ పక్కా గృహాలు

రాచర్ల: గృహాలు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ కె.ఎలిజబెత్‌రాణి అన్నారు. గురువారం మండలంలోని చోళ్ళవీడులో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. చోళ్ళవీడు పంచాయితీకి 314 ఎన్‌టీఆర్ గృహాలు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు స్థలాలు చూపించినట్లయితే వెంటనే ఎటువంటి జాప్యం లేకుండా పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. హౌసింగ్ ఏఈ షేక్ ఖదీర్‌భాషా మాట్లాడుతూ గృహాలు నిర్మించుకున్న వారికి వెంటనే బిల్లులు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల మధు, పంచాయతీ సెక్రటరీ అహల్యారాణి, వీఆర్వో వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాక్సిన్

అర్ధవీడు(బేస్తవారపేట): అర్ధవీడు మండలం అయ్యవారిపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాధుల నివారణకు సంబంధించిన వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వైద్యాధికారి లక్ష్మీ వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బాలరంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- గౌతమ్‌నంద
శ్రీనివాస	- వాసుకి
వెంకటేశ్వర	- ఫిదా
నటరాజ్	- డిజె

జగన్ దిష్టిబొమ్మ దహనం


జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు: చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పు లేదు అని నంద్యాల బహిరంగసభలో పేర్కొన్న జగన్ వాఖ్యలకు నిరసనగా స్దానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రెవిన్యూ కార్యాలయం ఎదుట ఒంగోలు-నంద్యాల రోడ్డుపై జగన్ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రతిపక్ష నేత జగన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే నంద్యాల ప్రజలతో పాటూ రాష్ట్ర ప్రజలు ఎన్నికలలో ఓటు ద్వారా గుణపాఠం చెప్పి శంకరగిరి మాన్యాలకు పంపుతారని పలువురు టీడీపీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడైన క్రిష్ణకిషోర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బండారు వెంకటసుబ్బమ్మ, ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ మస్తాన్, కార్యదర్శి కమతం శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు బండి వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, పలువురు కౌన్సిలర్లతో పాటు టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, బండారు గు ర్రెడ్డి, వెంకటేశ్వర్లు, వలి, శిరిగిరి లింగయ్య, పాలుగుళ్ల శ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, అల్తాఫ్,పెద్దబాష తదితరులు పాల్గొన్నారు.

'కొమరోలు'కు 60 పశుగ్రాస క్షేత్రాలు మంజూరు

కొమరోలు: మండలంలో 60 పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు వెలుగు డెయిరీ ఏపీవో పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొమరోలులోని వెలుగు కార్యాలయానికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి పశుగ్రాస ఏర్పాటుకు స్థలసేకరణ చేశారు. ఈ సందర్భంగా చం ద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీకి 5 చొప్పున పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 5150 పశుగ్రాస క్షేత్రాలను 5150 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 550 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలను నెలకొల్పామన్నారు. కొమరోలు మండలంలోని 17 మంది రైతుల నుండి 25 ఎకరాలను ఈ క్షేత్రాల కొరకు గుర్తించారన్నారు. ఈక్షేత్రాలను నెలకొల్పడం ద్వారా పశువులకు దాణా కొరత తీరుతుందని, గడ్డి పెంపకం పుష్కలంగా దొరుకుతుందన్నారు. గడ్డి కొనుగోలు, రవాణా వ్యయం ఖర్చులు తగ్గుముఖం పడతాయన్నారను. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఈ క్షేత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీరామ్, సీసీ రంగనాయకులు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

బేస్తవారపేటలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

ఎంపీపీ ఓసూరారెడ్డి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారపేట: బేస్తవారపేటలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన మండలం పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ చెరువు, ఖాజీపురం గ్రామాల్లో లైన్లు తెగిపడిన పట్టించుకునే వారు లేదన్నారు. దీంతో వారం లోపు ప్రజాప్రతినిధులు సమావేశమై కంభం సబ్ స్టేషన్ కార్యాలయాన్ని మట్టుడించి ధర్నాకు సిద్ధంకావాలని మండల సభ్యులకు సూచించారు. పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు స్థానికంగా లేకపోవడంతో పండ్లతోటల పెంపకంపై రైతులు అవగాహన కోల్పోతున్నారని అన్నారు. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలలో బోర్లకు పుష్కలంగా నీరు వస్తున్నా ట్యాంకర్లు పెట్టి నీరు తోలుతున్నారని వాటిని గుర్తించి వెంటనే రద్దుచేయాలని ఎంపీపీ కోరారు. వ్యవసాయాశాఖ అధికారులు రైతులకు సహకరించడంలేదని ఆయన ధ్వజమెత్తారు. వ్యవసాయాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోగా రైతులకు సరైన అవగాహన సదస్సులు నిర్వహించడంలేదన్నారు. వ్యవసాయాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానంచేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశం లో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, తహసీల్దార్ ఎం.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

బేస్తవారపేట: ఉపాధి కూలీలు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఏపీవో బెల్లంకొండ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నాడిక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలు చేసిన పనిని బట్టి కొలతల లెక్కింపు ద్వారా కూలి ఇవ్వబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులు మంజూరు

కొమరోలు: మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడామైదానాల అభివృద్ధికి రూ.18 లక్షల నిధులు మంజూరయ్యాయి. మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడామైదానం అభివృద్ధి పనులకు స్థానిక ఎంపీపీ కామూరి అమూల్య భూమి పూజను నిర్వహించారు.

ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. అందులోభాగంగా క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

అల్లినగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.4.81 లక్షలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.4.60 లక్షలు, రాజుపాలెం ఉన్నత పాఠశాలకు రూ.4.60 లక్షల చొప్పున క్రీడామైదానాల అభివృద్ధికి ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు ఏపీవో షారూన్‌పుష్పారాణి తెలిపారు.

ఈ కార్యక్రమంలో అల్లినగరం గ్రామ సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం, మనోజ్ చారిటబుల్ ట్రస్టు వైస్‌ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నక్కల గండి కాల్వలో పూడిక తీత తొలగింపు

కంభం: కంభం చెరువు నుంచి పంటపొలాలకు నీరందించే నక్కల గండి కాల్వలో దట్టంగా పెరిగిన చిల్లచెట్ల తొలగింపు పనులు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. సుమారు 1.5 కిలోమీటర్లు పొడవు ఉండే నక్కల గండి కాల్వలో పెరిగిన చిల్లచెట్లు, పూడికతీత పనులకు రూ.1.50 లక్షల నిధులు నీరు-చెట్టు కింద మంజూరయ్యాయని ఇరిగేషన్ డీఈ నాగార్జునబాబు తెలిపారు. ఈ నిధులతో గత రెండు రోజులుగా కాల్వలో పేరుకుపోయిన పూడిక, చిల్లచెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు.

చిల్లచెట్ల తొలగింపు

కంభం: కంభం రైల్వేస్టేషన్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దట్టంగా అల్లుకున్న చిల్లచెట్లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. విద్యుత్‌శాఖాధికారులు శుక్రవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దట్టంగా పెరిగిన చిల్లచెట్లను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెచుట్టూ కంచెలాగా వేశారు. దీంతో తరచూ విద్యుత్ అంతరాయానికి చెక్‌పడినట్లయింది.

వైభవంగా వరలక్ష్మి వ్రతాలు


సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

గిద్దలూరు: పట్టణంలోని అమ్మవారిశాలలో రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా అత్యంత వైభవంగా సామూహిక వరలక్ష్మి వత్రం జరిగింది. దేవస్ధాన కమిటీ అధ్యక్షుడు మునగనూరి సుబ్బారావు దంపతులు వ్రతం వద్ద ప్రత్యేక పూజలు ని ర్వహించగా ఆర్య వైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సామూహికంగా వ్రతం చేశారు. దేవస్థాన కమిటీ ప్రతినిదులు పాల్గొన్నారు.

కొమరోలు: వరలక్ష్మి వ్రతం పురష్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఇంటా వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు నిర్వహించి అందరికీ తాంబూలాలను పంచిపెట్టారు. సాయంత్రం గృహాల్లో వరలక్ష్మి వ్రతాన్ని పండుగలా నిర్వహించారు.

కంభం: కంభం పట్టణలోని పలుదేవాలయాల్లో వరలక్ష్మి వ్రత పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీ దేవాలయం, శివాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయాల్లో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రతి తెలుగు వారి వాకిళ్ళు తోరణాలతో కళకళలాడాయి. పూజా మందిరాలలో వరలక్ష్మి అమ్మవారి చిత్రపటం ఎదురుగా కలశం ఉంచి పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఇరుగు పొరుగు ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి వారి ఆశీర్వాదం పొందారు.


శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవి మూలవిరాట్

అంగనవాడీ కేంద్రాల పాలప్యాకెట్లు దుర్వాసన

● ఆందోళన చెందుతున్న గర్భిణులు, బాలింతలు
● తిప్పిపంపుతామన్న సీడీపీవో

అద్దంకి: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అన్న అమృత హస్తం పథకాన్ని కొత్తగా అమలులోకి తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా ప్రతిరోజు అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు 100 ఎంఎల్, గర్భిణులకు, బాలింతలకు 200 ఎంఎల్ పాలను అందజేస్తున్నారు. అయితే ఈ పాలను సరఫరా చేసేందుకు ఓ ఏజెన్సీకి కాంట్రాక్టు అప్పగించారు. పాలు వేడి చేసి ప్యాకింగ్ చేసిన ప్యాకెట్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తారు. ఈ పాలను ప్రతి రోజు కేంద్రంలో గోరు వెచ్చగా కాచి అందజేస్తున్నారు. అయితే పలు అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా అయిన పాల ప్యాకెట్లు దుర్వాసన వస్తుండటంతో కార్యకర్తలతో పాటు గర్భిణులు, బాలింతలు ఆందోళన చెందుతున్నారు. దుర్వాసన వచ్చే పాలను తాగితే అస్వస్థతకు గురయ్యే ప్రమాదముందని వాపోతున్నారు. కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తమ్మవరం, కొరిశపాడు, దైవాలరావూరులతో పాటు అద్దంకి పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాల ప్యాకెట్లు దుర్వాసన వస్తున్నట్లు సీడీపీవోకు ఫిర్యాదులు అందాయి. 15 రోజులు పాటు నిల్వ ఉండాల్సి ఉండగా కొద్ది రోజులకే దుర్వాసన రావడం ఏమిటని అంగన్‌వాడీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏజెన్సీకి తిప్పి పంపేందుకు చర్యలు

పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పాల ప్యాకెట్లు దుర్వాసన వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సీడీపీవో మల్లేశ్వరి తెలిపారు. ఆ ప్యాకెట్లను వేరు చేసి సమాచారం అందిస్తే పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులకు తిప్పి పంపడం జరుగుతుందన్నారు. ప్యాకెట్లను తీసుకునే సమయంలోనే అంగన్ వాడీ కార్యకర్తలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పలు అంగన్ వాడీ కేంద్రాల్లో బోగస్ ఎన్‌రోల్ ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ కార్డు నెంబరు, ఫోన్ నెంబర్లను సేకరించాలని ఆదేశాలు వచ్చాయని, ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు వివరాలు అందజేయాలన్నారు.



అద్దంకి పట్టణం నంబూరివారిపాలెం అంగన్‌వాడీ ప్రీస్కూల్‌లో దుర్వాసన వస్తున్న పాల ప్యాకెట్లు, చూపిస్తున్న కార్యకర్తలు

టీటీడీ కల్యాణమండపాలు ప్రారంభం

పంగులూరు: పంగులూరులో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో రోజుకు రూ.3వేలుఅద్దె చెల్లించి వేడుకలు జరుపుకోవచ్చని సూపరింటెండెట్ ఇంజనీరు సుధాకర్ శుక్రవారం తెలిపారు. కళ్యాణ మండపాన్ని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు సందర్శించారు. నాణ్యతా ప్రమాణాలతో కళ్యాణ మండపంనిర్మాణాన్ని శోభాయమనాంగా తీర్చిదిద్దిన నిర్వాహకులను సుధాకర్ అభినందించారు.

18న స్వామి వారి కళ్యాణం

ఈ నెల 18 వ తేదీన పంగులూరులో నిర్మితమైన టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించడం జరుగుతుందని ఎస్ఈ సుధాకర్ తెలిపారు. స్వామివారి కళ్యాణం అనంతరం సెప్టెంబర్ 1వ తేది నుంచి మండపంలో వివాహ వేడుకలు జరుపుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు నాగేశ్వరరావు, శ్రీకాంతరెడ్డి, లక్ష్మయ్య, నిర్వాహకులు పాచిన పూర్ణచంద్రరావు, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పమిడిపాడులో..

మేదరమెట్ల: పమిడిపాడులో నిర్మాణం పూర్తి చేసుకున్న టీటీడీ కళ్యాణ మండపాన్ని మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలోని సాయిబాబా దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో రాఘవరావు, ఎంపీపీ రావి ప్రభావతి, జాగర్లమూడి వెంకటసుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన టీటీడీ కళ్యాణ మండపాన్ని రాఘవరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. భైసాని వెంకటేశ్వరరావు, ఒక ఎకరా స్థలాన్ని కళ్యాణ మండపానికి దానంగా ఇచ్చారు. గ్రామస్తులు టీటీడీకి చెల్లించాల్సిన వాట ధనాన్ని గ్రామస్తులు చెల్లించారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కళ్యాణ మండపంవనిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేయించారు. నిర్మాణం పూర్తయిన సంవత్సరం తరువాత ఎట్టకేలకు మండపం ప్రారంభించడం విశేషం. జాగర్లమూడి జయకృష్ణ, నాతాని హనుమంతరావు, కృపానాగేశ్వరరా వు, బెల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పమిడిపాడులో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రాఘవరావు

సీఎం సహాయ నిధి నుంచి
18 మందికి రూ.44.53 లక్షల మంజూరు

● ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి: అద్దంకి నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన 18 మందికి వైద్య చికిత్సల నిమిత్తం రూ.44,55,600 ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి శుక్రవారం మంజూరైనట్లు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శంకవరప్పాడుకు చెందిన గోగుల నందినికి రూ.3,34,700, పరిటాలవారిపాలెంకు చెందిన పుట్టా సుబ్బారావుకు రూ.1,98,600, కొరిటాల సుబ్బారావుకు రూ.3,47,220, పరిటాల వెంకయ్యకు రూ.2,08,610, గుంటూరు చిన్నవీరయ్యకు రూ.1,73,600, తాతనబోయిన కోటయ్యకు రూ.3,47,220, కొరిటాల లక్ష్మీనారాయణకు 1,98,610, మామిళ్లపల్లికి చెందిన కాకాని నాగేంద్రంకు రూ.2,97,200, ఏల్చూరుకు చెందిన యడవల్లి వెంకటలక్ష్మికి రూ.2,97,600, తానికొండ పద్మావతికి రూ.3,17,220, పెంట్యాల అరుణకు రూ.50 వేలు, కుందుర్రుకు చెందిన వల్లెపు వెంకటరత్నంకు రూ.2,97,230, పి.గుడిపాడుకు చెందిన తాడి ఆంజనేయులుకు రూ.3,17,220, చిన్నమల్లవరం గ్రామానికి చెందిన ఉల్లగంటి మస్తాన్‌వలికి రూ.43,510, కొమ్మాలపాడుకు చెందిన వైదన మస్తాన్‌వలికి రూ.3,47,220, కూకట్లపల్లికి చెందిన ఇప్పల రమాదేవికి రూ.43,510, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన గొట్టిముక్కల కోదండపానికి రూ.3,17,220, ద్రోణాదులకు చెందిన ఎం. వీరరాఘవమ్మకు రూ.3,17,220 చెక్కులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం

శింగరకొండపాలెం(అద్దంకిరూరల్): గ్రామాల్లో ఉపాధి కూలీల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు గ్రామాల్లోనే ఆధార్ అనుసంధానం చేస్తున్నట్లు ఏపీవో కోటేశ్వరి తెలిపారు. శుక్రవారం శింగరకొండపాలెంలో ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోనే దాదాపు 150 మంది ఉపాధి కూలీలు తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానంకాక ఇబ్బందిపడుతున్నారని, అటువంటి వారికోసమే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధి కూలీలు ఆధార్ లింకేజి కోసం ఇకనుంచి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో టీఏ జానీబేగం, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రాజేష్, కోటేశరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టత తెలుసుకోవాలి

బల్లికురవ: గర్భవతులు, బాలింతలు తల్లిపాల విశిష్టతను తప్పనిసరిగా తెలుసుకోవాలని సర్పంచ్ మురళీధరరావు కోరారు. శుక్రవారం కె.రాజుపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, దీంతో వారిలో అనారోగ్య సమస్యలు రావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, కార్యకర్త నిర్మల, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆరుగురికి జైలుశిక్ష, జరిమానా

అద్దంకి : మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిని శుక్రవారం అద్దంకి కోర్టులో పోలీసులు హాజరుపరచారు. జడ్జి ఒక్కొక్కరికి మూడురోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు.

శివాలయం భూములకు కౌలు వేలం

● అధికారులు లేకుండా వేలం నిర్వహించడంపై అభ్యంతరం

అద్దంకి: అద్దంకి పట్టణంలోని పాత శివాలయానికి చెందిన 3 ఎకరాల భూమి విప్పర్లవారిపాలెం సమీపంలో ఉండగా శుక్రవారం కౌలు వేలం నిర్వహించారు. గతంలో మూడు ఎకరాలకు రూ.6 వేలు మాత్రమే కౌలు ఉండగా ప్రస్తుతం బొనిగల సంజీవరావు రూ.35 వేలకు పాడారు. అయితే దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి సమక్షంలో కౌలు వేలం పాట నిర్వహించాల్సి ఉండగా సిబ్బంది సత్యన్నారాయణ, శివలు మాత్రమే హాజరయ్యారు. భూమి కౌలు వేలం పాట నిర్వహించడం పట్ల పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.



కౌలువేలం నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

వైసీపీ బలోపేతానికి గ్రామ కమిటీల నియామకం

● పార్టీ ఇన్‌చార్జి బాచిన చెంచు గరటయ్య

బల్లికురవ: అన్ని గ్రామాల్లో వైసీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అద్దంకి నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి బాచిన చెంచు గరటయ్య తెలిపారు. శుక్రవారం బల్లికురవలో వైసీపీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలు అమలు జరగాలంటే ప్రజలందరు మద్దతు ఇవ్వాలని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందడంలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ నేతలు చింతల పేరయ్య, చల్లగుండ్ల శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వరలక్ష్మీ అవతారంలో రాజరాజేశ్వరి అమ్మవారు, కోలాటం ఆడుతున్న భక్తులు

వరాలు ఇవ్వవమ్మా వరలక్ష్మి..

చీరాలరూరల్ : వరలక్ష్మీ వ్రతం ఆచరణలో భక్తులు పరవసించారు. శుక్రవారం చీరాల పట్టణ, మండల పరిధిలో వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని మహిళలు, భక్తులు ప్రత్యేకపూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వారి వారి ఇళ్ళల్లో వరలక్ష్మీ వ్రతమాచరించి సాయంత్రం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలు ప్రత్యేకఅలంకరణలతో ఆకర్షించాయి. యాదవపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారికి చేసిన అలంకరణ ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తులు భజనాకాలక్షేపాలతో పాటు, కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొనగా మరికొన్ని ఆలయాల్లో పూర్ణకుంభాలు, కలశాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

ప్రతి శనివారం గ్రీవెన్స్ నిర్వహించాలి : తహసీల్దార్

సంతమాగులూరు: సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి శనివారం వీఆర్వోలు అందరూ వారికి కేటాయించిన విధంగా తప్పనిసరిగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలని తహసీల్దార్ టీఎల్.కాంతారావు శుక్రవారం ఆదేశించారు. వీఆర్వోలందరూ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. గ్రామంలో పరిష్కారం కాని సమస్యలు మండలకార్యాలయానికి తీసుకురావాలని సూచించారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- ఒకటిన్నర దశాబ్దం తరువాత కొత్త పోస్టులు
- ఒక్కసారి భర్తీకే అనుమతి
- భవిష్యత్తులో పోస్టుల భర్తీలేదు

ఒంగోలు విద్య: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకటిన్నర దశాబ్దంగా ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. 2002 తరువాత ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్క పోస్టుకూడా భర్తీకాలేదు. ఎయిడెడ్ పాఠశాల్లో పోస్టులు భర్తీపై ఒకటిన్న దశాబ్దకాలంగా కొనసాగుతున్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. ఎయిడెడ్ పాఠశాలల్లో అన్ ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లోకి అబ్జార్బ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులభర్తీకి ఆయా పాఠశాలల యాజమాన్యాలు కసరత్తు ప్రారంభించాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీపోస్టులు భర్తీకి అన్ ఎయిడెడ్ పోస్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేసేందుకు కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు.

మార్గదర్శకాలివి

- ఎయిడెడ్ పాఠశాలల్లో సంబంధిత విద్యాశాఖాధికారి ద్వారా పోస్టులు మంజూరై ఉండాలి. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి నిబంధనల ప్రకారం అవసరమైతేనే పోస్టులు భర్తీ చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో 1:30, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1:35, హైస్కూళ్లలో 1:40 వంతున ఉండాలి. 2016 డిసెంబరు 31 నాటి ఆధార్ సీడెడ్ విద్యార్థుల సంఖ్యను బట్టి ఈపోస్టులు భర్తీ చేయలని ఆంక్ష విధించారు.
- 2002 సెప్టెంబరు 23 నాటికి అప్రూవుడ్ అన్ఎయిడెడ్ పోస్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎయిడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేసేందుకు అనుమతిచ్చారు.
- అన్ఎయిడెడ్ పోస్టు అప్రూవల్ నాటికే అభ్యర్థులు పోస్టుకు నిర్ణయించబడిన విద్యార్హతలు కలిగి ఉండాలి. ఆతరువాత అర్హతలు పొందిన అవి పరిగణనలోకి రావు. ప్రభుత్వ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏ విద్యార్హతలు ఉన్నాయో, ఎయిడ్ పోస్టుల్లోకి అబ్జార్బ్ అయ్యే ఉపాధ్యాయులకు కూడా అవే విద్యార్హతలు ఉండాలి.
- ఒక పోస్టుకు ఒకరికంటే ఎక్కువ మంది అభ్యర్థులున్నపుడు అన్ని అర్హతలు కలిగిన వారిలో సీనియర్ టీచర్‌ను ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేయాలి.
- పీడర్ కేటగిరి కలిగిన ప్రమోషన్ పోస్టులు అయితే 2:1 నిష్పత్తిలో పోస్టులు భర్తీ చేయాలి. అంటే రెండు పోస్టులు ప్రమోషన్ ద్వారా ఒక పోస్టు అబ్జాప్షన్/రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలి. ఒకే పోస్టు ఉంటే ఆ పోస్టును రెండుసార్లు పదోన్నతి ద్వారా ఒక సారి, అబ్జాప్షన్/రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలి.
- ఉపాధ్యాయుల అబ్జాప్షన్‌కు ముందు పాఠశాల రికార్డులన్నింటిని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి.
- 2002 సెప్టెంబరు 23 నుంచి 2017 జూన్ 30 వరకు అన్ఎయిడెడ్ పోస్టులో కంటిన్యూగా పనిచేస్తున్నవారికే ఈ నిబంధనలు వర్తిస్థాయని వారినే ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేయాలని ఆ ఉత్తర్వులో స్పష్ట చేశారు.
- అన్ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని ఎయిడ్ పోస్టుల్లోకి అబ్జార్బ్ చేసేందుకు ఈ అనుమతి ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది. భవిష్యత్తులో పోస్టులు భర్తీ చేసేందుకు ఈ నిబంధనలు అనుమతించబడవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోస్టులు భర్తీ ప్రక్రియను ఈనెల 5 నాటికి పూర్తి చేయాలి.
- పాఠశాల విద్యాశాఖ, ఆర్‌జేడీ, డీఈవోలు ఈ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శంగా నిర్వహించాలి.
- ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ అయిన ఉపాధ్యాయులకు వారు ఎయిడెడ్ పోస్టులో నియమించబడిన తేది నుంచి ప్రభుత్వ టీచర్ల వలే రెగ్యులర్ టైమ్ స్కేల్ ప్రకారం జీతాలు చెల్లించాలి.
- ఎయిడెడ్ పోస్టులోకి అన్ ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి అబ్జాప్షన్‌కు ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించని విద్యాసంస్థలు, యాజమాన్యాలపై అంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.
- షెడ్యూలు ప్రకారం ఈ ప్రక్రియ మొత్తం పూర్తిచేసి ఈనెల 20లోపు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలి.
- ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అబ్జాప్షన్, ప్రమోషన్, సెలక్షన్ అయిన తరువాత 15 రోజులలోపు సంబంధిత డాక్యుమెంట్లను పాఠశాల విద్య కమిషనర్ పరిశీలనకు సమర్పించాలి.
- ఈ మొత్తం ప్రక్రియ పరిశీలనకు ఆర్ఎంఎస్ఏ అదనపు డైరెక్టర్ (ఎండీఎం) జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) రాష్ట్ర స్థాయి పరిశీలకులుగా ఉంటారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

- పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- డీఆర్వో ప్రభాకర్ రెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ప్రభాకర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూపు-3 పరీక్షలను ఆది, సోమవారం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో శుక్రవారం ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై అధికారులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆది, సోమవారాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు గ్రూపు-3 ప్రధాన పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇందుకోసం 6న 8పరీక్షా కేంద్రాల్లో 1911 మంది, 7న నాలుగు కేంద్రాల్లో 934 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలను నిర్వహకులు సిద్ధం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం ఏడున్నర గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్షా హాలులోకి ఉదయం 8 నుంచి 8.45గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని డీఆర్వో తెలిపారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత అభ్యర్థులు వస్తే పరీక్షకు అనుమతి ఇవ్వడం జరగదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు వేస్తారని, వారి వెంట హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డు, లేదా ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లను అనుమతించడం జరగదని ఆయన పేర్కొన్నారు. మూడు ప్రాంతాలకు ఏపీపీఎస్సీ అధికారులను బాధ్యులుగా నియమించడం జరిగిందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారికి ఫోన్ చేసి సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఒంగోలు విభాగపు అధికారి బి. దేవేంద్రనాధ్ 8498098281, చీరాలకు సహాయవిభాగపు అధికారి అశోక్ 8498098367, మార్కాపురంకు సహాయ అధికారిగా ఎం.నాగరాజు 9542620557 నెంబర్లను సంప్రదించాలని డిఆర్వో కోరారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు, ఆర్టీసి మేనేజర్ కేవీ రావు, విద్యుత్ శాఖ ఏడీఈ గురుప్రసాద్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శివకుమార్, తహసీల్దార్లు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ పంజా

రోజురోజుకీ పెరుగుతున్న కేసులు

ఒంగోలు నగరం: జిల్లాపై డెంగ్యూ పంజా విసురుతోంది. ఈ రెండు మూడు రోజుల్లోనే జిల్లాలోని చీమకుర్తి మండలం బండ్లమూడి, పాటిమీద పాలెం, ఇంకొల్లు మండలం దుద్దుకూరు, శింగరాయకొండ, సీఎస్ పురం మండలాల్లో పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇలా ప్రతి రోజూ జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఈ కేసులు నమోదు కావటం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లాలో గత జనవరి నుంచి జూలై వరకు 125 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రిమ్స్ వైద్యశాలలో కూడా డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు ఉన్నారు. ఇంకా కొంతమంది రోగులు గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్ళి చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం అందుతోంది. దీంతో ఆశాఖ అప్రమత్తమయింది. జ్వర పీడితులకు సత్వరమే డెంగ్యూ పరీక్షలు నిర్వహించటం, ఈ వ్యాధి నిర్ధారణ జరిగితే ఆప్రాంతంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు వైద్యఆరోగ్య శాఖ సిద్ధమయింది. ఈమేరకు ప్రయివేట్ వైద్యశాలలకు కూడా తగిన ఆదేశాలు జారీ చేశారు. డెంగ్యూ రోగుల వివరాలు వైద్యఆరోగ్యశాఖకు తెలియజేయాలని కోరారు.

భాషా పండితుల పదోన్నతులపై పీటముడి

- రోస్టర్ పాయింట్లపై లోపించిన స్పష్టత
- జాబితాపై భారీగా అభ్యంతరాలు

ఒంగోలు విద్య: జిల్లాలో భాషా పండితుల పదోన్నతులపై పీటముడి పడింది. ఈనెల 5 లోపు హైస్కూళ్లలో స్కూల అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ అయిన భాషా పండితుల పోస్టులను పదోన్నతల ద్వారా భర్తీ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతుల ప్రక్రియ ముగియగానే మిగిలిన భాషా పండితులందరి బదిలీలకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. గురువారం అర్ధరాత్రికి సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కాగా శుక్రవారం భాషా పదోన్నతులకు సంబంధించి కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే భాషా పండితుల పదోన్నతుల సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. ఆ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. దీంతో ఆజాబితాపై సుమారు 50కి పైగా అబ్యంతరాలు వచ్చాయి. ప్రధానంగా ప్రాథమిక జాబితాపై రోస్టర్ పాయింట్లపై అభ్యంతరాలు అధికంగా వచ్చాయి.

రోస్టర్ పాయింట్లపై తికమక

జిల్లాలో భాషా పండితుల పదోన్నతుల ప్రాథమిక సీనియారిటీ జాబితాపై గందరగోళం నెలకొంది. గ్రేడ్-2 తెలుగు భాషా పండితులు 65, హిందీలో 31 , ఉర్దూలో2, సంస్కృతంలో1 జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పదోన్నతులు లభించనున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏడుగురు భాషా పండితులకు పదోన్నతులు లభించనున్నాయి. జిల్లా పరిషత్ పదోన్నతలు సీనియారిటీ జాబితాలో రోస్టర్ పాయింట్లపై ఉపాధ్యాయులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ రోస్టర్ పాయింట్ల తక్కువ మార్కులు వచ్చిన మహిళా ఉపాధ్యాయులను జాబితాలో ముందువరసలో పెట్టిఎక్కువ మార్కులు వచ్చినవారిని జాబితాలో చివరన పెట్టడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం ఆవుతున్నాయి. ఎక్కువ మార్కులు వచ్చినవారికి నష్టం వచ్చిందని వాపోతున్నారు. హిందీలో 2009లో ఉద్యోంగంలో చేరిన వారికంటే 2011లో ఉద్యోగంలో చేరిన వారిపేరు జాబితాలో ముందుడంతో ఉపాధ్యాయులు విస్తుపోతున్నారు. ఈ తేడాలు సరి చేయాలని నష్టపోతున్న ఉపాధ్యాయులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. భాషా పండితుల్లో కొందరు అన్‌ట్రైన్డ్ వారు ఉండడంతో వారి విషయంలో ఏచర్యలు తీసుకోవాలో అంతు బట్టటంలేదు. ఈ అంశాలన్నింటిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను వివరణ కోరనున్నారు. కమిషనర్ నుంచి వివరణ రాగానే పదోన్నతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వరకు భాషా పండితుల పదోన్నతలు ప్రక్రియ ముందుకుసాగే అవకాశంలేదని చెబుతున్నారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు విద్య: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) వివిధ ట్రేడుల్లో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్, ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఐటీఐలో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.10 చెల్లించి దరఖాస్తు పారాలను పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 15 సాయంత్రం ఐదుగంటలలోపు విద్యార్థులు తాము చేరదలచుకున్న ఐటీఐలో సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈనెల 17న, ప్రైవేటు ఐటిఐల్లో ప్రవేశాలకు ఈనెల 18న కౌన్సెలింగ్ జరుగుతుంది.

ప్రభుత్వ బాలుర ఐటీఐలో..

ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో 2017-18 విద్యాసంవత్సరానికి రెండో దశ అడ్మిషన్లలో ప్రవేశం పొందేందుకు ఈనెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ ఎంవీ. నాగేశ్వరరావు తెలిపారు. వెల్డర్ ట్రేడ్‌లో ప్రవేశాలకు 8వ తరగతి పాసైనవారు, ఇతర ట్రేడ్‌లలో ప్రవేశాలకు పదో తరగతి పాసైనవారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు. కళాశాల కార్యాలయంలో పదిరూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తు పారాలకు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు జతపరచి ఈనెల 15లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని నాగేశ్వరరావు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ఓరియంటల్ స్కూలులో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అధ్యక్షుడు డాక్టర్ కె.శివాజి, కార్యదర్శి పి.సుధాకర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8నుంచి 11 ఏళ్ళు, 11నుంచి 14 ఏళ్ళ మధ్యతో పాటు మరో ఐదు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వచ్చేనెల 1నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9030965970 నెంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- ఒకటిన్నర దశాబ్దం తరువాత కొత్త పోస్టులు
- ఒక్కసారి భర్తీకే అనుమతి
- భవిష్యత్తులో పోస్టుల భర్తీలేదు

ఒంగోలు విద్య: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకటిన్నర దశాబ్దంగా ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. 2002 తరువాత ఎయిడెడ్ పాఠశాలల్లో ఒక్క పోస్టుకూడా భర్తీకాలేదు. ఎయిడెడ్ పాఠశాల్లో పోస్టులు భర్తీపై ఒకటిన్న దశాబ్దకాలంగా కొనసాగుతున్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. ఎయిడెడ్ పాఠశాలల్లో అన్ ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లోకి అబ్జార్బ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులుభర్తీకి ఆయా పాఠశాలల యాజమాన్యాలు కసరత్తు ప్రారంభించాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీపోస్టులు భర్తీకి అన్ ఎయిడెడ్ పోస్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేసేందుకు కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు.

మార్గదర్శకాలివి

- ఎయిడెడ్ పాఠశాలల్లో సంబంధిత విద్యాశాఖాధికారి ద్వారా పోస్టులు మంజూరై ఉండాలి. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి నిబంధనల ప్రకారం అవసరమైతేనే పోస్టులు భర్తీ చేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో 1:30, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1:35, హైస్కూళ్ళలో 1:40 వంతున ఉండాలి. 2016 డిసెంబరు 31 నాటి ఆధార్ సీడెడ్ విద్యార్థుల సంఖ్యను బట్టి ఈపోస్టులు భర్తీ చేయలని ఆంక్ష విధించారు.
- 2002 సెప్టెంబరు 23 నాటికి అప్రూవుడ్ అన్ఎయిడెడ్ పోస్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎయిడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేసేందుకు అనుమతిచ్చారు.
- అన్ఎయిడెడ్ పోస్టు అప్రూవల్ నాటికే అభ్యర్థులు పోస్టుకు నిర్ణయించబడిన విద్యార్హతలు కలిగి ఉండాలి. ఆతరువాత అర్హతలు పొందిన అవి పరిగణనలోకి రావు. ప్రభుత్వ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏ విద్యార్హతులు ఉన్నాయో, ఎయిడ్ పోస్టుల్లోకి అబ్జార్బ్ అయ్యే ఉపాధ్యాయులకు కూడా అవే విద్యార్హతలు ఉండాలి.
- ఒక పోస్టుకు ఒకరికంటే ఎక్కువ మంది అభ్యర్థులున్నపుడు అన్ని అర్హతలు కలిగిన వారిలో సీనియర్ టీచర్ను ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేయాలి.
- పీడర్ కేటగిరి కలిగిన ప్రమోషన్ పోస్టులు అయితే 2:1 నిష్పత్తిలో పోస్టులు భర్తీ చేయాలి. అంటే రెండు పోస్టులు ప్రమోషన్ ద్వారా ఒక పోస్టు అబ్జాప్షన్/రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలి. ఒకే పోస్టు ఉంటే ఆ పోస్టును రెండుసార్లు పదోన్నతి ద్వారా ఒక సారి, అబ్జాప్షన్/రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలి.
- ఉపాధ్యాయుల అబ్జాప్షన్కు ముందు పాఠశాల రికార్డులన్నింటిని సంబంధిత అధికారులు క్షణ్ణంగా పరిశీలించాలి.
- 2002 సెప్టెంబరు 23 నుంచి 2017 జూన్ 30 వరకు అన్ఎయిడెడ్ పోస్టులో కంటిన్యూగా పనిచేస్తున్నవారికే ఈ నిబంధనలు వర్తిస్థాయని వారినే ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ చేయాలని ఆ ఉత్తర్వులో స్పష్ట చేశారు.
- అన్ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని ఎయిడ్ పోస్టుల్లోకి అబ్జార్బ్ చేసేందుకు ఈ అనుమతి ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది. భవిష్యత్తులో పోస్టులు భర్తీ చేసేందుకు ఈ నిబంధనలు అనుమతించబడవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోస్టులు భర్తీ ప్రక్రియను ఈనెల 5 నాటికి పూర్తి చేయాలి.
- పాఠశాల విద్యాశాఖ, ఆర్జేడీ, డీఈవోలు ఈ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శంగా నిర్వహించాలి.
- ఎయిడెడ్ పోస్టులోకి అబ్జార్బ్ అయిన ఉపాధ్యాయులకు వారు ఎయిడెడ్ పోస్టులో నియమించబడిన తేది నుంచి ప్రభుత్వ టీచర్ల వలే రెగ్యులర్ టైమ్ స్కేల్ ప్రకారం జీతాలు చెల్లించాలి.
- ఎయిడెడ్ పోస్టులోకి అన్ ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి అబ్జాప్షన్కు ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించని విద్యాసంస్థలు, యాజమాన్యాలపై ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.
- షెడ్యూలు ప్రకారం ఈ ప్రక్రియ మొత్తం పూర్తిచేసి ఈనెల 20లోపు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలి.
- ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అబ్జాప్షన్, ప్రమోషన్, సెలక్షన్ అయిన తరువాత 15 రోజులలోపు సంబంధిత డాక్యుమెంట్లను పాఠశాల విద్య కమిషనర్ పరిశీలనకు సమర్పించాలి.
- ఈ మొత్తం ప్రక్రియ పరిశీలనకు ఆర్ఎంఎస్ఏ అదనపు డైరెక్టర్ (ఎండీఎం) జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) రాష్ట్ర స్థాయి పరిశీలకులుగా ఉంటారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

- పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- డీఆర్వో ప్రభాకర్ రెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ప్రభాకర్రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూపు-3 పరీక్షలను ఆది, సోమవారం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని డీఆర్వో ఛాంబర్లో శుక్రవారం ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై అధికారులు, స ంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆది, సోమవారాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులకు గ్రూపు-3 ప్రధాన పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇందుకోసం 6న 8పరీక్షా కేంద్రాల్లో 1911 మంది, 7న నాలుగు కేంద్రాల్లో 934 మంది అభ్యర్థులు ఆన్లైన్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలను నిర్వహకులు సిద్ధం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం ఏడున్నర గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్షా హాలులోకి ఉదయం 8 నుంచి 8.45గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని డీఆర్వో తెలిపారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత అభ్యర్థులు వస్తే పరీక్షకు అనుమతి ఇవ్వడం జరగదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు వేస్తారని, వారి వెంట హాల్ టిక్కెట్తో పాటు ఆధార్ కార్డు, లేదా ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ఫోన్లను అనుమతించడం జరగదని ఆయన పేర్కొన్నారు. మూడు ప్రాంతాలకు ఏపీపీఎస్సీ అధికారులను బాధ్యులుగా నియమించడం జరిగిందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారికి ఫోన్ చేసి సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఒంగోలు విభాగపు అధికారి బి. దేవేంద్రనాథ్ 8498098281, చీరాలకు సహాయవిభాగపు అధికారి అశోక్ 8498098367, మార్కాపురంకు సహాయ అధికారిగా ఎం.నాగరాజు 9542620557 నెంబర్లను సంప్రదించాలని డిఆర్వో కోరారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు, ఆర్టీసి మేనేజర్ కేవీ రావు, విద్యుత్ శాఖ ఏడీఈ గురుప్రసాద్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శివకుమార్, తహసీల్దార్లు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ పంజా

రోజురోజుకీ పెరుగుతున్న కేసులు

ఒంగోలు నగరం: జిల్లాపై డెంగ్యూ పంజా విసురుతోంది. ఈ రెండు మూడు రోజుల్లోనే జిల్లాలోని చీమకుర్తి మండలం బండ్లమూడి, పాటిమీద పాలెం, ఇంకొల్లు మండలం దుద్దుకూరు, శింగరాయకొండ, సీఎస్ పురం మండలాల్లో పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇలా ప్రతి రోజూ జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఈ కేసులు నమోదు కావటం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లాలో గత జనవరి నుంచి జూలై వరకు 125 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రిమ్స్ వైద్యశాలలో కూడా డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు ఉన్నారు. ఇంకా కొంతమంది రోగులు గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్ళి చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం అందుతోంది. దీంతో ఆశాఖ అప్రమత్తమయింది. జ్వర పీడితులకు సత్వరమే డెంగ్యూ పరీక్షలు నిర్వహించటం, ఈ వ్యాధి నిర్ధారణ జరిగితే ఆప్రాంతంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు వైద్యఆరోగ్య శాఖ సిద్ధమయింది. ఈమేరకు ప్రయివేట్ వైద్యశాలలకు కూడా తగిన ఆదేశాలు జారీ చేశారు. డెంగ్యూ రోగుల వివరాలు వైద్యఆరోగ్యశాఖకు తెలియజేయాలని కోరారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు విద్య: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) వివిధ ట్రేడుల్లో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్, ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఐటీఐలో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.10 చెల్లించి దరఖాస్తు ఫారాలను పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 15 సాయంత్రం ఐదుగంటలలోపు విద్యార్థులు తాము చేరదలచుకున్న ఐటీఐలో సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈనెల 17న, ప్రైవేటు ఐటిఐల్లో ప్రవేశాలకు ఈనెల 18న కౌన్సెలింగ్ జరుగుతుంది.

ప్రభుత్వ బాలుర ఐటీఐలో..

ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో 2017-18 విద్యాసంవత్సరానికి రెండో దశ అడ్మిషన్లలో ప్రవేశం పొందేందుకు ఈనెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ ఎంవీ. నాగేశ్వరరావు తెలిపారు. వెల్డర్ ట్రేడ్లో ప్రవేశాలకు 8వ తరగతి పాసైనవారు, ఇతర ట్రేడ్లలో ప్రవేశాలకు పదో తరగతి పాసైనవారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు. కళాశాల కార్యాలయంలో పదిరూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలకు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు జతపరచి ఈనెల 15లోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని నాగేశ్వరరావు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ఓరియంటల్ స్కూలులో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అధ్యక్షుడు డాక్టర్ కె.శివాజి, కార్యదర్శి పి.సుధాకర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8నుంచి 11 ఏళ్ళు, 11నుంచి 14 ఏళ్ళ మధ్యతో పాటు మరో ఐదు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వచ్చేనెల 1నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9030965970 నెంబర్ను సంప్రదించాలని వారు కోరారు.

భాషా పండితుల పదోన్నతులపై పీటముడి

- రోస్టర్ పాయింట్లపై లోపించిన స్పష్టత
- జాబితాపై భారీగా అభ్యంతరాలు

ఒంగోలు విద్య: జిల్లాలో భాషా పండితుల పదోన్నతులపై పీటముడి పడింది. ఈనెల 5 లోపు హైస్కూళ్ళలో స్కూల అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ అయిన భాషా పండితుల పోస్టులను పదోన్నతల ద్వారా భర్తీ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతుల ప్రక్రియ ముగియగానే మిగిలిన భాషా పండితులందరి బదిలీలకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. గురువారం అర్ధరాత్రికి సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కాగా శుక్రవారం భాషా పదోన్నతులకు సంబంధించి కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే భాషా పండితుల పదోన్నతుల సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్సైట్లో ఉంచారు. ఆ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. దీంతో ఆజాబితాపై సుమారు 50కి పైగా అబ్యంతరాలు వచ్చాయి. ప్రధానంగా ప్రాథమిక జాబితాపై రోస్టర్ పాయింట్లపై అభ్యంతరాలు అధికంగా వచ్చాయి.

రోస్టర్ పాయింట్లపై తికమక

జిల్లాలో భాషా పండితుల పదోన్నతుల ప్రాథమిక సీనియారిటీ జాబితాపై గందరగోళం నెలకొంది. గ్రేడ్-2 తెలుగు భాషా పండితులు 65, హిందీలో 31 , ఉర్దూలో2, సంస్కృతంలో1 జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో పదోన్నతులు లభించనున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏడుగురు భాషా పండితులకు పదోన్నతులు లభించనున్నాయి. జిల్లా పరిషత్ పదోన్నతలు సీనియారిటీ జాబితాలో రోస్టర్ పాయింట్లపై ఉపాధ్యాయులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ రోస్టర్ పాయింట్ల తక్కువ మార్కులు వచ్చిన మహిళా ఉపాధ్యాయులను జాబితాలో ముందువరసలో పెట్టిఎక్కువ మార్కులు వచ్చినవారిని జాబితాలో చివరన పెట్టడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం ఆవుతున్నాయి. ఎక్కువ మార్కులు వచ్చినవారికి నష్టం వచ్చిందని వాపోతున్నారు. హిందీలో 2009లో ఉద్యోంగంలో చేరిన వారికంటే 2011లో ఉద్యోగంలో చేరిన వారిపేరు జాబితాలో ముందుడంతో ఉపాధ్యాయులు విస్తుపోతున్నారు. ఈ తేడాలు సరి చేయాలని నష్టపోతున్న ఉపాధ్యాయులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. భాషా పండితుల్లో కొందరు అన్ట్రైన్డ్ వారు ఉండడంతో వారి విషయంలో ఏచర్యలు తీసుకోవాలో అంతు బట్టటంలేదు. ఈ అంశాలన్నింటిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ను వివరణ కోరనున్నారు. కమిషనర్ నుంచి వివరణ రాగానే పదోన్నతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వరకు భాషా పండితుల పదోన్నతలు ప్రక్రియ ముందుకుసాగే అవకాశంలేదని చెబుతున్నారు.

ఢిల్లీ వెళ్ళిన కలెక్టర్

నేడు స్వచ్ఛభారత్ సమావేశంలో పాల్గొననున్న వినయ్‌చంద్

ఒంగోలు కలెక్టరేట్: ఢిల్లీలో శనివారం జరగనున్న స్వచ్ఛ భారత్ సమావేశంలో జిల్లా కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ పాల్గొననున్నారు. అందుకోసం శుక్రవారం రాత్రి ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్నది.

ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో ఐదు జిల్లాలను ఓడీఎఫ్‌గా ప్రకటించాలని నిర్దేశించింది. దీంతో మన రాష్ట్రంలో ఎంపికచేసిన జిల్లాల కలెక్టర్లు ఢిల్లీలో జరిగే స్వచ్ఛ భారత్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళారు. అందులో మన జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ కూడా ఉండటంతో ఢిల్లీకి వెళ్ళారు.

రేపు జూడో జట్ల ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక అంజయ్య రోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూలు ఆవరణలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ జూడో బాల,బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రవి, ఎస్‌కే ఖాజామస్తాన్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు పదేళ్ళు నుంచి 15 ఏళ్ళలోపు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19నుంచి మూడు రోజుల పాటు కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్ల పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9948877412, 9247278650 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

ఆర్డీవో శ్రీనివాసరావు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఒంగోలు ఆర్డీవో కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులతో జరిగిన ఇసుక ధరల మానటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరిపి రవాణా చేస్తే సంబంధిత నిర్వహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకుఅనుగుణంగా ప్రజలకు ఇసుక రవాణా చేసే విధంగా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనధికారికంగా ఇసుక తవ్వకం చేసి అక్రమంగా రవాణా చేసే వాహనాలపై రెండు లక్ష వరకు జరిమానా విధించడంతో పాటు రెండేళ్ళు కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఇసుక రీచ్‌లలో తవ్విన అనంతరం దానిని ట్రాక్టర్లలో లోడింగ్ చేసేందుకు ఒక ట్రాక్టర్‌కు రూ300 ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఇసుక రవాణాకు ఐదు కిలోమీటర్ల లోపు ట్రాక్టరుకు రూ.400, ఐదు నుంచి పది కిలో మీటర్ల వరకు రూ.600 వసూలు చేయాల్సి ఉందన్నారు. పది కిలోమీటర్లు మించితే రూ600లతో పాటు కిలోమీటరుకు అదనంగా రూ.35 వసూలు చేయాలని అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. గృహ నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ఇసుక ఎంత అవసరం అవుతుందో సంబంధిత అధికారులకు వివరాలు అందజేసి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఒంగోలు, చీరాల డీఎస్పీలు జి. శ్రీనివాసరావు, ప్రేమ్‌కాజల్, తహసీల్దార్లు, మైన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం: చీరాల్లోని ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులో పనిచేసేందుకు ల్యాబ్ టెక్నిషయిన్ కోర్సు పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాని జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మావతి ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ, ఎంఎల్‌టి, బిఎస్సీ, ఎంఎల్‌టి అర్హత కలిగి ఉండటంతో పాటు బ్లడ్ బ్యాంకులో రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి. వేతనం నెలకు రూ. 10,350 అందజేస్తామన్నారు. ఈ నెల 15లోగా దరఖాస్తుచేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తులను జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, రూం నంబర్ 28, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, ప్రకాశం భవనం ఎదురుగా , ఒంగోలు అనే చిరునా మాకు పంపాలని ఆమె కోరారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభ ప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.

మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

డెంగ్యూ విషకోరల్లో పాటిమీదపాలెం

- **రిమ్స్‌లో వైద్యం పొందుతున్న బాధితులు**
- **చేష్టలుడిగి చూస్తున్న యంత్రాంగం**

చీమకుర్తి : పాటిమీద పాలెం దళిత వాడలో విష జ్వరాలు కమ్మేశాయి. డెంగ్యూ తోపాటు గున్యా లాంటి విషజ్వరాల కోరల్లో దళితవాడవాసులు విలవిలాడిపోతున్నారు. వారంరోజుల్లో దాదాపు వంద మందికి పైగా ప్రజలకు విషజర్వరాలు వ్యాపించాయంటే పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతుంది. రిమ్స్‌లో వైద్యం పొంది డెంగ్యూ కోరలనుంచి బయటపడిన వారు కొంత మందైతే ప్రస్తుతం ఆరుగురు ఒంగోలు రిమ్స్‌లో ప్రత్యేక చికిత్స పొందుతున్నారు. మరో పదిమంది వరకు విషజర్వాల వార్డులో చికిత్స పొందుతున్నారు. చీదర్ల రమాదేవి డెంగ్యూ పాజిటివ్‌గా రిమ్స్‌వైద్యులు నిర్ధారించి డెంగ్యూవిభాగంలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. చీదర్ల కోటయ్య, చీదర్ల నిమ్మమ్మ , జిల్లా చినరాములు, జిల్లా నారాయణమ్మ, ఆరెతోటి పున్నమ్మ, మణి, సిహెచ్.ఆదిలక్ష్మిలు రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్నారు. వీరందరూ డెంగ్యూ బాధితులుగా అనుమానిస్తున్నారు. పరీక్షలు నిర్వహించారు. ఫలితం రాలేదన్న నెపంతో సాధారణ జనాల వార్డులో చికిత్స అందజేస్తున్నారు. దీంతో తమకు మెరుగైన చికిత్స కావలని ఫలితం వచ్చేవరకు వేచిచూడకుండా తక్షణమేవైద్య సేవలందించాలని కోరుతున్నారు. సొంగా భానుప్రకాష్, సొంగా ధరణి, దర్నాసి నానిలు డెంగ్యూ జర్వం బానిపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. గ్రామంలో మరోవంద మందికిపైగా విషజ్వరాలు చుట్టుముట్టాయి. వీరందరూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


మురుగుతో నిండిన పాడుబడ్డ బావి


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

పడకేసిన పారిశుధ్యం....

నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్యం పడకేసింది. వెయ్యి మందికి పైగా నివసించే ఈ ప్రాంతంలో డ్రైనేజిలు పూడిక తీతకు నోచుకోలేదు. ఇటీవల గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినా ఇక్కడ మాత్రం పనులు జరిగిన దాఖలలేవు. ఎక్కడ మురుగు అక్కడే స్థంబించిపోయింది. విషజ్వరాలు అలుముకోవడానికి కాలనీ ఆనుకొని ఉన్న పాడుబడిన బావులుగా భావిస్తున్నారు. బావులు మురుగు, చెత్తచెదారంతో నిండిపోయి దోమల ఉత్పత్తికి ప్రధాన హేతువుగామారింది. శుక్రవారం గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వేమా శ్రీని వాసరావు, ప్రజాసంఘనాయకులు పర్యటించి జర్వపీడితులను పరామర్శించారు. మలేరియా, వైద్యాధికారులు సందర్శించారు.

ప్రత్యేక క్యాంపు నిర్వహించాలి

దళిత వాడను విషజ్వరాలు చుట్టుముట్టాయి ప్రజలు విలవిలాడి పోతున్నారు. పాడుబడ్డ బావులు పూడ్చడంతో పాటు గ్రామంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించాలని కోరుతున్నాం



- **ఇస్తర్ల రజని, ఎంపీటీసీ**

డెంగ్యూతో విలవిలాడి పోయాం

డెంగ్యూజ్వరంతో గత పదిరోజులుగా విలవిలాడి పోయాం. ఇప్పుడల్లాపూర్తిస్థాయిలో కోలుకోలేము. ఉపాదినిసైతం కోల్పోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి



- **నాని, డెంగ్యూ బాధితుడు**

సోలార్ పంప్ సెట్ల కేబుల్ చోరీ

అద్దంకి: అద్దంకి పట్టణానికి సమీపంలో ఊరచెరువు ఆయకట్టు లో ఉన్న పాత మాగాణి లో 4 చోట్ల వ్యవసాయ బోర్ల కు ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ల కేబుల్ వైరు చోరికి గురైంది. వీటి విలువ 25 వేల రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. రెండు బోర్ల కు సంబంధించి కేబుల్ వైర్లు ఏడాదిలోనే రెండు సార్లు చోరికి గురయ్యాయి. చోరికి జరిగిన కేబుల్ వైర్లు రైతులు మరలా ఏర్పాటు చేసుకోవాలంటే ఒక్కో దానికి 6 వేల రూపాయలు వెచ్చించాల్సి రావటంతో పాటు సోలార్ వ్యవసాయ పంప్ సెట్ల కు సంబంధించిన కంపెనీ మెకానిక్ లు రావాల్సి రావటంతో ఆలస్యమై నారుమల్లు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉత్తర అద్దంకి కి చెందిన పిల్లిమెట్ల రమేష్, దిడ్డి హనుమంతరావు, శేషగిరి, మద్దా పూర్ణచం ద్రరావు లకు చెందిన సోలార్ వ్యవసాయ బోర్లకు సంబంధించి పంప్‌సెట్ల కేబుల్ వైర్ల ను గురువారం రా త్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దిడ్డి హనుమంతరావు రెండు నెలల క్రితమే వ్యవసాయ బోరు ఏర్పాటు చేసుకొని సోలార్ పంప్ సెట్ ఏర్పాటు చేసుకున్నారు. రైతులందరు ప్రస్తుతం వరి సాగు కు సంబంధించి నారుమళ్ళు పెంచుతున్నారు. ఈ సమయంలో కేబుల్ వైర్లు చోరి జరగటంతో నారు మళ్ళు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


వైరు కోసం పగుల గొట్టిన కేసింగ్ పైప్

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముండ్లమూరు : ముండ్లమూరు భారత్ గ్యాస్ కార్యాలయం ఎదురు తాళ్ళూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన ఎన్.శ్రీను పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. శ్రీను గతంలో వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్యమిత్ర పని చేస్తూ సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో తొలగించారు. భార్య భర్తల మన్సర్థాలు ఏర్పడిన దగ్గర నుంచి తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం ముండ్లమూరు వచ్చి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండడంతో గ్యాస్ గొడౌన్ సిబ్బంది బోడపాటి లక్ష్మణ్‌రావు చూచి వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్ళారు. ప్రధమ చికిత్స అనంతరం 108లో అద్దంకి సీహెచ్‌సీ పంపించారు. శ్రీను భార్య విడిపోయిన దగ్గర నుంచి కోర్టు కేసులు నడుస్తుండడం వల్ల మనస్తాపం చెంది ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు బంధువులు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడి అరెస్టు

ముండ్లమూరు : మండలంలోని సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళను గత నెల 24వ తేదిన అదే గ్రామానికి చెందిన బోగ్యం కోటయ్య ప్రవర్తించిన కేసులో ఎస్ఐ పి.బాలరంగయ్య కోటయ్యను అరెస్టు చేశారు. వీరిని అద్దం కి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరి అరెస్ట్ - కోర్టుకు హాజరు

ముండ్లమూరులో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన తొట్టెంపూడి సురేష్, వెంకటేశ్వర్లును శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.బాలరంగయ్య తెలిపారు. వీరిని అద్దంకి కోర్టులో హాజరు పర్చుగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఈవీఎంల వివరాలు మొబైల్‌లో అప్‌లోడ్

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలో 2006కు ముందు తయారై వినియోగించకుండా ఉన్న ఎం1రకం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) వివరాలను మొబైల్‌ఆఫ్ ద్వారా అప్‌లోడ్ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం గుర్తింపున్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంల వివరాలన్నింటిని న్యూఢిల్లీలోని భారత ఎన్నికల సంఘానికి మొబైల్ అప్‌లోడ్ ద్వారా పంపుతామన్నారు. జిల్లాలో అటువంటి ఈవీఎంలు 69 ఉన్నాయని, వాటిక సంబంధించిన బార్‌కోడ్, మోడల్ యూనిట్ వంటి వివరాలను స్కానింగ్ చేసి మొబైల్ యాప్ ద్వారా ఈనెల 8వ తేదీన ఆర్డీవోల ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈవీఎంల వివరాల నమోదుకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన సాంకేతిక శిక్షణ కలిగిన అధికారుల గుర్తింపు కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. ఈసమావేశంలో ఒంగోలు తహసీల్దార్ శశికుమార్, సీపీఐ నగర కమిటీ అధ్యక్షుడు యు.ప్రకాశరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె లక్ష్మారెడ్డి, వైసీపీ నాయకుడు డిఎస్ క్రాంతికుమార్; బిజెపి నాయకుడు నాగేంద్ర, బిఎస్‌పి నాయకుడు కే. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలు

ఎర్రగొండపాలెం: ఎర్రగొండపాలెం పట్టణం సమీపంలోని ప్రాచీన మిల్లంపల్లి సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలు జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం స్థానిక ఎస్సై శ్రీనువాసరావు ఆలయ ధర్మకర్తలతో వెళ్ళి గుప్త నిధుల కోరకు తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు.ఆలయంలోని ప్రధాన ద్వారం వద్ద 10 అడుగుల లోతు వరకు గత మూడు రోజుల క్రితం తవ్వినట్లు సమాచారం. దీంతో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత 5 సంవత్సరాల్లో ఈ దేవాలయంలో సూమారు 10 సార్లుకు పైగా తవ్వకాలు జరిగిన సంఘటనలున్నాయి.


గ్రామం నుంచి తీసుకొచ్చిన చెత్తాచెదారం

చెత్త నుంచి సంపద

- రూ. 7 లక్షలకు పైగా వ్యయంతో కేంద్రం ఏర్పాటు
- కోనంకి ఎంపీటీసీ సభ్యురాలు కోటపాటి కోమలి కృషికి దక్కిన ఫలితం
- ఉత్తమ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు
- వర్మి కంపోస్టు తయారీ శిక్షణ కేంద్రంగా ఎంపిక
- తయారైన ఎరువు కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్

గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు... రోడ్ల పక్కన చెత్త దిబ్బలు.. పనికి రాని ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు గ్రామం అంతా అపరిశుభ్రమైన వాతావరణం. దీంతో ఎలాగైనా గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చి దిద్దాలి. రోడ్డు పక్కన చెత్త కనిపించకూడదు. స్మార్ట్ విలేజ్‌గా గ్రామం అందరి మన్ననలు పొందాలి. ఇదే చెత్త నుంచి గ్రామ పంచాయతీకి ఆదాయం రావాలి. గ్రామాన్ని సుందరంగా తీర్చి దిద్దాలి. ఈ లక్ష్యంతో మండల ఉపాధ్యక్షురాలు కోటపాటి కోమలి మండలంలోని కోనంకి గ్రామంలో వ్యర్థ పదార్థాల నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించి ఫలితాలు సాధించారు. ప్రస్తుతం కోనంకి గ్రామం జిల్లాలోనే శిక్షణ కేంద్రంగా ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నది.


నాడెప్ తొట్లలో తయారైన వర్మీ కంపోస్టు

మార్టూరు: రెండేళ్ల క్రితం కోనంకి గ్రామంలో కోటపాటి కోమలి తన భర్త, గ్రామ ఉప సర్పంచ్ సురేష్ సహకారంతో గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అందుకు తొలి అడుగుగా చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ప్రారంభించారు. అందుకోసం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడి మండల బూరుగుపూడి గ్రామ వెళ్లి అక్కడ శిక్షణ కేంద్రాన్ని పర్యవేక్షించి వచ్చారు. ఇక గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై సహకారంతో రూ. 7 లక్షలకు పైగా వ్యయంతో షెడ్లు, వర్మి కంపోస్టు తయారు చేసే తొట్లు. నాడెపు కంపోస్టు తయారు చేసే బాక్సులు ఏర్పాటు చేశారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కేంద్రంలో కోమలి పనులను ప్రారంభించారు. మొదట గ్రామంలోని అన్ని వీధులలోని చెత్తా చెదారాన్ని పేడ, ప్లాస్టిక్ వస్తువులు కేంద్రం వద్దకు తీసుకు వచ్చే విధంగా ఒక ట్రాక్టరు, రెండు రిక్షాలను ఏర్పాటు చేశారు. అక్కడ కేంద్రం వద్దకు తీసుకు వచ్చిన చెత్తతో తడి చెత్త, పొడి చెత్తనువేరు చేసేవారు, పొడి చెత్తలో కుళ్లిన కూరగాయలు, పగిలిన ప్లాస్టిక్ వస్తువులు, ఇతరత్రా ఉండేవి. పొడి చెత్త, కూరగాయలను 3 రోజుల తర్వాత పొడి రూపంలోకి మార్చేవారు. పగిలిన ప్లాస్టిక్ వస్తువులను ప్రత్యేక మిషన్ ద్వారా చిన్న ముక్కలుగా మార్చేవారు.

ఇక పొడి చెత్త కోసం ఏర్పాటు చేసిన నాడెపు కంపోస్టు గదులలో 3 రోజులు నానబెడతారు. ఆ తరువాత పేడను ఎండ బెట్టిన కళ్లం నుంచి పేడను పొడి చెత్త, తడిచెత్తను వర్మి కంపోస్టు తయారు చేసే గదులలో వేస్తారు. మొదట గదులలో పొడి చెత్తను 2 అంగుళాలు వరకు , వాటిపైన పేడ, తడి చెత్తల నుంచి వచ్చిన మెత్తటి చూర్ణాన్ని వేస్తారు. ఆ తరువాత వాన పాములు 1 అడుగు మందం మేరా వాటిపై వేస్తారు. 45 రోజులు గడిచిన తర్వాత వర్మీ కంపోస్టు తయారు అవుతుంది.

వానపాముల తయారీ

వర్మి కంపోస్టు తయారీలో వాన పాములు ప్రధాన పాత్ర వహిస్తాయి. అందుకని ఇతరత్రా వాన పాములను కొనుగోలు చేయకుండా, కర్రలతో అల్లిన 8 అడుగులు పొడవు, 2 అడుగుల వెడల్పు కలిగిన బాక్సు ద్వారా నేలపైన రెండు రకాలుగా సొంతంగా వాన పాములను తయారు చేపడతామని కేంద్రం కోఆర్డినేటర్ కోటేశ్వరరావు తెలిపారు.


కుళ్లిపోయిన కూరగాయలను ఎండబెడుతున్న కార్మికులు

మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తున్న వర్మికంపోస్టు

కేంద్రంలో తయారయిన వర్మీ కంపోస్టును కిలో 10 రూపాయలు చొప్పున మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేస్తున్నారు. తయారైన కంపోస్టును 50 కిలోలు బస్తాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికి 10 నుంచి 15 టన్నులు దాకా వర్మీ కంపోస్టు ఈ కేంద్రంలో తయారు చేశారు. ఇక గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 1600 మొక్కలు నాటారు. ఈ మొక్కలకు కూడా వర్మీ కంపోస్టును వినియోగిస్తున్నారు. గ్రామంలోని రైతులు కూడా కూరగాయలు ఇతరత్రా పండ్ల తోటల రైతులు కూడా వర్మి కంపోస్టును వినియోగిస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నది.


రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి లోకేష్ నుంచి అవార్డు అందుకుంటున్న కోమలి (ఫైల్)

క్లీన్ పంచాయతీగా కోనంకి కనిపించాలి

-కోటపాటి కోమలి, మండల ఉపాధ్యక్షురాలు, కోనంకి



గ్రామంలో చెత్తా చెదారం, కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర త్ర ఎక్కడా రోడ్డుపక్కన కనిపించకూడదు. క్లీన్ పంచాయతీగా కోనంకి కనిపించాలి. ఈ చెత్త నుంచి సంపద తయారీ శిక్షణ కేంద్రంగా జిల్లాలోనే కోనంకి గ్రామాన్ని ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ఇప్పటికే గుంటూరు జిల్లా నుంచి పలు గ్రామ పంచాయతీల పాలకవర్గాలు శిక్షణా కేంద్రానికి వచ్చి పరిశీలించి వెళ్లాయి. చెత్త నుంచి సంపద తయారీకి గాను పంచాయతీ రాజ్ మంత్రి లోకేష్ చేతులమీదుగా ఉత్తమ ఎంపీటీసీ సభ్యురాలిగా అవార్డు అందుకోవడం ఇంకా ఆనందంగా ఉంది.

వైభవంగా వరలక్ష్మీవ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా కిటకిటలాడిన ఆలయాలు

వ్రతాలు, ప్రత్యేక పూజలు


కనకదుర్గమ్మ గుడిలో వరలక్ష్మీవ్రతమాచరిస్తున్న మహిళలు


ఒంగోలు నగరంలోని సంతపేట నాగలక్ష్మి ఆలయంలో అమ్మవారి అలంకరణ, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

ఒంగోలు కల్చరల్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత వైభవోపేతంగా జరుపుకున్నారు. అనేక దేవాలయాలు శుక్రవారం మహిళాభక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తాము ప్రత్యేకంగా రూపొందించిన వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమలకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించగా పలు దేవాలయాలలో వరలక్ష్మీ అలంకరణలో అమ్మవారిని ఉంచి మహిళలచే వ్రతాన్ని ఆచరింపజేశారు. గంటాపాలెం శ్రీ కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ఉదయాన్నే పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన వ్రతాలలో పలువురు మహిళలు పాల్గొన్నారు. ఆలయకమిటీ అధ్యక్షుడు అళహరి రమణయ్య, కార్యదర్శి వేమా వెంకటేశ్వర రావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంతపేట సాయిబాబా మందిరంలోని నాగలక్ష్మీ దేవస్థానంలో ఏర్పాటు చేసిన వరలక్ష్మీ వ్రతాలలో సైతం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒంగోలు సరస్వతీ జూనియర్ కళాశాలకు చెందిన దాదాపు వందమంది విద్యార్థినులు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు. మంగమూరురోడ్‌లోని అచలానంద ఆశ్రమంలో స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో జరిగిన వరలక్ష్మీ వ్రతాలలో మహిళలు పాల్గొన్నారు. శంకరమఠం శ్రీ కంచికామాక్షి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు వత్సం నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీ భువనేశ్వరి సమేత పశుపతీశ్వర దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన జరిగాయి. లాయరుపేట సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి శుక్రవారం నిర్వహించిన కుంకుమార్చన, వ్రతాలలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని శ్రీ లక్ష్మీప్రసన్న చెన్నకేశవ దేవస్థానం, శ్రీ విజయదుర్గాదేవి దేవస్థానం, శ్రీ మహాలక్ష్మి దేవస్థానం తదితర ఆలయాలలో ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు

ఆదరణ కారాదు నిరాదరణ


కందుకూరులోని వైద్య విధాన పరిషత్ ఏరియా వైద్యశాల

కార్పొరేట్ వైద్యశాలలకు దీటైన వసతులు, సౌకర్యాలతో అత్యుత్తమ వైద్యసేవలతో మూడేళ్లుగా ప్రత్యేక గుర్తింపు పొందిన కందుకూరు ఏరియా ఆసుపత్రిని డాక్టర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఉన్న డాక్టర్ల అంకితభావం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో అధునాతన సౌకర్యాల కల్పనతో జిల్లాలోని మరే వైద్యశాల సాధించని పురోగతి ఈ ఆసుపత్రి సాధించింది. అందుబాటులోకి వచ్చిన పూర్తి స్థాయి వైద్యసేవలతో ప్రజలు కూడా ప్రైవేటు ఆసుపత్రుల వైపు కన్నెత్తి చూడకుండా ఏరియా హాస్పటల్‌కే రావటంతో ఓపీ విభాగం, ఇన్ పేషెంట్ విభాగాలే కాక ప్రత్యేక గదులు, చిన్న పిల్లలు, బాలింతల విభాగాలు కూడా కిటకిటలాడటం ప్రారంభమైంది.

- వసతులలో మేటి కందుకూరు ఏరియా హాస్పటల్
- మూడేళ్లుగా ఉత్తమ వైద్యసేవలతో ముందంజ
- నేడు డాక్టర్ల కొరతతో కునారిల్లుతున్న వైనం
- ఇదే పరిస్థితి కొనసాగితే మళ్లీ పాతకథే...
- ఎన్టీఆర్ వైద్యసేవల హాస్పటల్‌గా గుర్తించినా ప్రయోజనం శూన్యం

కందుకూరు: ఒకప్పుడు రోజుకు పట్టుమని పది మంది కూడా చూయించుకునేందుకు రాని ఏరియా హాస్పటల్ ప్రస్తుతం రోజుకు 400 ఓపిలతో కళకళలాడుతోంది. గత సంవత్సరం ఏరియా హాస్పటల్‌లో 1.32 లక్షల మంది వైద్యపరీక్షలు చేయించుకోగా మెడాల్ , హాస్పటల్ ల్యాబ్‌లలో 70వేల మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించారంటే రోగులు ఎంతగా ఆదరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ దశలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ చొరవతో పలువురు దాతలు ముందుకొచ్చి ప్రత్యేక వసతుల కల్పనకు కూడా పూనుకోవటం, అందుతున్న వైద్యసేవలను గుర్తించిన ప్రభుత్వం ఇక్కడ డయాలసిస్ సెంటర్‌ని మంజూరు చేయటమే గాక ఇటీవల కందుకూరు ఏరియా హాస్పటల్‌ని ఎన్టీఆర్ వైద్యసేవల హాస్పటల్‌గా కూడా ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా హాస్పటల్ బాగా అభివృద్ధి చెందింది మాకు మంచి వైద్యసేవలు అందుతున్నాయని పేద ప్రజలు ఆనందిస్తున్న తరుణంలో డాక్టర్ల కొరత శాపంగా మారింది. డాక్టర్ల కొరతతో మొక్కుబడి వైద్యసేవలు, చిన్న చిన్న పొరపాట్లతో వివాదాలు సర్వసాధారణంగా మారటంతో ఆసుపత్రి వైభవం మసకబారుతుందేమోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. 17 మంది డాక్టర్లు ఉండాల్సిన ఈ హాస్పటల్‌ని ఎన్టీఆర్ వైద్యసేవల హాస్పటల్‌గా ప్రకటించటంతో మరో ముగ్గురు నలుగురు స్పెషలిస్టు డాక్టర్లు పెరుగుతారని ఆశించారు. ఈ తరుణంలో డాక్టర్ల సంఖ్య ఐదుకి పడిపోవటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

డాక్టర్ల కొరతతో వైద్యసేవలకు ఆటంకం

ఏరియా హాస్పటల్‌లో చక్కని వైద్యసేవలు అందుతుండటమే గాక మెడాల్ ద్వారా అత్యాధునిక వైద్య పరీక్షలు చేస్తూ అవసరమైన ఆపరేషన్లు కూడా చేస్తుండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఏరియా హాస్పటల్‌కి రావటం అలవాటు చేసుకున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా డాక్టర్ల కొరత ఏర్పడటం ఉన్న డాక్టర్లు కూడా సెలవులు, డిప్యుటేషన్లపై వెళ్లటంతో హాస్పటల్‌లో వైద్యసేవల పరిస్థితి పాతకథే అన్నట్లుగా మారింది. నిత్యం 400 మంది పేషెంట్లు సరాసరిన వైద్యపరీక్షల కోసం వస్తుండగా వారిని ఉన్న ముగ్గురు నలుగురు డాక్టర్లే చూడాల్సి రావటంతో ఓపీలో పరీక్షలు కూడా మొక్కుబడి తంతుగా మారాయి. వ్యాధి నిర్ధారణ, వైద్యసేవలలోను ప్రజలలో అసంతృప్తి నెలకొంటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరోపక్క చిన్న చిన్న ఆపరేషన్లు, గైనకాలజీ విభాగంలో డాక్టర్ల కొరత వల్ల ఒక్క డాక్టరు మొత్తం పర్యవేక్షించాల్సిన పరిస్థితుల్లో పూర్తిస్థాయి వైద్యసేవలు అందించలేకపోతున్నారు. పని వత్తిడిలో చిన్న చిన్న పొరపాట్లు జరగటం వల్ల వివాదాలు కూడా జరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కందుకూరు ఏరియా హాస్పటల్‌లో 17 మంది డాక్టర్లు ఉండాలి. ఓపి విభాగంలో డ్యూటీ డాక్టర్లతో పాటు వివిధ విభాగాలలో స్పెషలిస్టు డాక్టర్లు ఉండాలి. ఎన్టీఆర్ వైద్యసేవల హాస్పటల్‌గా కూడా ప్రకటించినందున మరికొంతమంది స్పెషలిస్టు డాక్టర్లను కూడా నియమించాల్సి ఉంది. అయితే 9 మంది మాత్రమే ఇక్కడ పనిచేస్తుండగా వారిలో నలుగురు వివిధ కారణాలతో సెలవులు పెట్టి వెళ్లిపోయారు.

ప్రస్తుతం ఐదుగురు డాక్టర్లు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలకు అరకొర వైద్యసేవలు అందుతున్న పరిస్థితి నెలకొంది. ముగ్గురు గైనకాలజిస్టులు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. పెథాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్, సీఎస్ఎస్, జనరల్ సర్జన్, ఆర్థోపెడీషియన్ తదితర పోస్టులతో పాటు మరికొంతమంది స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవటం సమస్యగా మారింది.

నెలకు 80కి పైగా కాన్పులు

కందుకూరు ఏరియా హాస్పటల్‌లో ప్రధానంగా ఇటీవలికాలంలో తల్లీబిడ్డల ఆరోగ్యసేవల విషయంలో మంచి పేరు వచ్చింది. ఆసుపత్రిలో సరాసరిన నెలకు 80కి పైగా కాన్పులు జరుగుతుండగా సాధారణ డెలివరీలతో పాటు అవసరమైతే సిజేరియన్లు కూడా చేసి కాన్పులు జరుపుతుండటం, అనంతరం తల్లీబిడ్డలకు ఉత్తమ ఆరోగ్యసేవలు అందించటంలోను ముందుంటుండటంతో రోగుల సంఖ్య పెరిగిపోయింది. అయితే డాక్టర్ల కొరతతో వారికి తగినవైద్యసేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లకు ఒక్కరే ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, మరోపక్క జనరల్ సర్జన్, ఆర్థోపెడీషియన్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోతుండటంతో చిన్న చిన్న ప్రమాదాల సందర్భాల్లోను ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలుకి రిఫర్ చేస్తున్నారు.



డయాలసిస్ సెంటర్, పోస్ట్ ఆపరేషన్ థియేటర్

కందుకూరు ఏరియా హాస్పటల్‌లో అత్యాధునిక సౌకర్యాలతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయటమే గాక నర్రా పర్వతాలు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పూర్తి స్థాయి ఏసీతో ఏర్పాటు చేసిన పోస్ట్ ఆపరేషన్ థియేటర్ రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. చిన్న పిల్లల కోసం ఉన్న ఏసీ థియేటర్‌కి అనుబంధంగా ఏర్పాటు చేసిన ఈ పోస్ట్ ఆపరేషన్ థియేటర్ సిజేరియన్లు, ఇతర ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఎంతో ఉపయోగకరంగా మారింది. మరో పక్క ఇన్ పేషెంట్ వార్డులను కూడా అభివృద్ధి చేయటంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. హాస్పటల్‌లోని వైద్యసేవలను గుర్తించి ఎన్టీఆర్ వైద్యసేవలకు కూడా అర్హత కల్పించినప్పటికీ డాక్టర్ల కొరతతో పరిస్థితి మొదటికొచ్చిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో మూడు నాలుగు నెలల్లోనే ఏరియా హాస్పటల్ పాత పద్ధతిలో మొక్కుబడి వైద్యసేవలకు నిలయంగా మారుతుందన్న అభిప్రాయం వస్తోంది. కలెక్టరు, ప్రజా ప్రతినిధులు తగినచర్యలు చేపట్టి ఏరియా హాస్పటల్‌లో తక్షణం డాక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు

2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు

5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు

6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు

8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు

9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు

10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు

11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు

12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు

13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు

14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు

15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు

16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు

17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు

18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు

19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు


20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు
కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు



Panditi Meenakshi Pavan
Senior Faculty


Competitive Exams Special

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14

22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?



ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి
23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు

27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D

28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA

29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C

30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C

31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు

32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey


33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు

34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగానూ, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగానూ రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు

35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N


36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P

(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి
37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను

41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1

42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

1) ఎ	7) ఎ	13) ఎ	19) ఎ	27) సి	35) బి
2) సి	8) సి	14) బి	20) సి	28) ఎ	36) సి
3) బి	9) ఎ	15) సి	21) బి	29) సి	37) బి
4) సి	10) బి	16) బి	22) బి	30) ఎ	38) డి
5) ఎ	11) ఎ	17) ఎ	23) డి	31) బి	39) సి
6) సి	12) బి	18) సి	24) సి	32) బి	40) ఎ
			25) బి	33) సి	41) బి
			26) ఎ	34) ఎ	42) డి

ఉద్యోగాలు

ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు : 57
విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1
వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు
అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14
వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)
క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai
కోర్సు ఫీజు: రూ.4,50,000
స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు
అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021
వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు

1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హీవియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియా డి) హీవియా



7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం

8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిటాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ....
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) అబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ....
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతి నామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు



26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 35.9°C
బి) 25°C
సి) 42.9°C డి) 51°C

27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 125°F బి) 84 - 92°F
సి) 100 - 102.5°F డి) 110 - 114°F
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

ఎ) 99.5° - 101.5°F బి) 82° - 85°F
సి) 74.3° - 76.5°F డి) 105° - 107°F
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా



35. 'గుడ్లగూబ' ఒక ....
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) ఆకశేరుకం

36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపోడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) ఆకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువుల్లో రదనికలు, అగ్రచర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డెవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.
1. ఉల్లి ఎ. కొమ్ము
2. బంగాళదుంప బి. లశునం
3. అల్లం సి. దుంపకాండం
డి. కందం
ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?
మొక్క - క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి - 16
2. వరి - 24
3. యాపిల్ - 34
ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

సమాధానాలు

1) ఎ	9) సి	17) డి	27) సి	37) ఎ	47) సి
2) డి	10) ఎ	18) ఎ	28) ఎ	38) డి	48) డి
3) సి	11) బి	19) సి	29) సి	39) బి	49) డి
4) డి	12) బి	20) సి	30) ఎ	40) ఎ	50) ఎ
5) బి	13) బి	21) బి	31) బి	41) బి	51) డి
6) బి	14) బి	22) ఎ	32) డి	42) ఎ	52) బి
7) ఎ	15) ఎ	23) డి	33) బి	43) సి	53) డి
8) బి	16) సి	24) సి	34) సి	44) ఎ	54) ఎ
		25) సి	35) ఎ	45) ఎ	55) సి
		26) ఎ	36) సి	46) సి	



అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
ఎంబీఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)
ప్రవేశం: టీఎస్ఐసెట్-2017 ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11, 2017
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 13, 2017
వెబ్‌సైట్: http://www.ouadmissions.com/

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
వయసు: 17-25 సంవత్సరాలు
దరఖాస్తు: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డీడీని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
పిన్: 500028.

బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
సీట్ల సంఖ్య: 30
అర్హత: 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
వయసు: 26 సంవత్సరాలు
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21, 2017
రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 3, 2017
వెబ్‌సైట్: http://www.barc.gov.in/

జెఎన్‌టీయు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టీయు)-హైదరాబాద్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
సీట్ల సంఖ్య: 20
అర్హత: 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1,000
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
వెబ్‌సైట్: http://jntuh.ac.in/admissions
చిరునామా: డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, జెఎన్‌టీయూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

స్కాలర్‌షిప్

రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన 'మెరిట్ స్కాలర్‌షిప్స్'నకు ప్రకటన విడుదల చేసింది. ఇందుకు ఎంహెచ్ఆర్‌డీ సహకారాన్ని అందిస్తోంది. శాన్‌స్క్రిట్/ పాళీ/ ప్రాకృతంలను మెయిన్/ ఆప్షనల్ సబ్జెక్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహా విద్యాలయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నవారు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవ త్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ (రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బీఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పీహెచ్‌డీ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 30
అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 10
వెబ్‌సైట్: www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

గృహ లబ్ధిదారుల కోసం గ్రామసభలు

త్రిపురాంతకం: ప్రజాసాధికారిత సర్వేలో గృహాలు లేని లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలను నిర్వహిస్తున్నారు. మండలంలోని వెల్లంపల్లి, విశ్వనాధపురం గ్రామాలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి ఎంపికకు వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి. జయపాల్, హౌసింగ్ ఏఈ రాజేశ్వరరావు, విశ్వనాధపురం సర్పంచ్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన బొప్పాయి తోటలు

- పూర్తిగా ఎండిపోయిన వైనం
- వర్షాభావంతో సాగుకు దూరం

పుల్లలచెరువు: మండలంలో బొప్పాయి తోటల పెంపకం పూర్తిగా కనుమరుగవుతుంది. 20 సంవత్సరాల నుంచి పుల్లలచెరువు మండలంతో పాటు ఎర్రగొండపాలెం కేంద్రంగా రైతులు బొప్పాయి సాగు చేసేవారు. అయితే పుల్లలచెరువు మండలంలో గత నాలుగేళ్ల నుంచి కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగులో ఉన్న తోటలు ఎండిపోయాయి. గతంలో ప్రతి సంవత్సరం మండలంలో వెయ్యి హెక్టార్లకు పైగా బొప్పాయి తోటలు సాగులో ఉండేవి.

ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో సాగుకు ఆసక్తి చూపటం లేదు. మండలంలోని మల్లాపాలెం, చాపలమడుగు, కోమరోలు, పుల్లలచెరువు, నరజాముల తండా, యండ్రపల్లిలలో తెటలే అధికంగా సాగు చేస్తారు. విటమిన్ ఎ అధికంగా ఉండే బొప్పాయిలో అనేక పోషకాలు ఉన్నాయి. రైతుల నుంచి పచ్చికాయలను వ్యాపారస్తులు కొనుగోలు చేసి ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేసేవారు. ఇప్పుడు మాత్రం తినేందుకు కూడా కాయలు ఎక్కడా కనిపించని పరిస్థితి నెలకొంది.



తాగునీటి కోసం మహిళల రాస్తారోకో

పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల ముట్టడి

ఎర్రగొండపాలెం: పట్టణంలో తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని శుక్రవారం మహిళలు ప్రధాన సెంటరులో రోడ్డుపై రాస్తారోకో చేశారు. వారంరోజులుగా నడిగడ్డ ప్రాజెక్టులో తాగునీటి ట్యాంకు ఖాళీ అవడంతో సాగర్ జలాలు నిలిచి తాగునీటి సమస్య తీవ్రమైంది. అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ, సమస్యపై దృష్టి సారించలేదు. దాంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహిళలు ఖాళీ బిందెలతో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని, ఆ తరువాత పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అయినా అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఎస్సై శ్రీనువాసరావు జోక్యం చేసుకుని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయిస్తానని హామీ ఇవ్వడంతో విరమించారు. అనంతరం ఎస్సై పోలీస్‌స్టేషన్‌లోని మోటారు ద్వారా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయించారు. ఆందోళనలో బ్రహ్మంగారి వీధి, చైతన్య నగర్, బీసీ కాలనీ, చెంచు పాముల కాలనీ, స్టేట్ బ్యాంకు వీధి, అన్ని వార్డుల మహిళలు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మహిళలు, ట్యాంకర్‌తో నీరు సరఫరా చేయిస్తున్న ఎస్సై

భవిత కేంద్రానికి అవార్డుకు ప్రతిపాదనలు

త్రిపురాంతకం: మండలంలోని భవిత కేంద్రానికి జాతీయ స్థాయి అవార్డుల ఎంపిక కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు సర్వశిక్ష అభియాన్ ఐఈ కో ఆర్డినేటర్ ఎం.శ్యామ్యూల్ తెలిపారు. శుక్రవారం భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు సంబంధించిన కార్యక్రమాలలో సక్రమంగా నిర్వహిస్తున్న జిల్లాలోని ఏడు కేంద్రాలను గుర్తించామన్నారు. త్రిపురాంతకంతో పాటు ఇంకొల్లు, జె.పంగులూరు, దర్శి, పొదిలి భవిత కేంద్రాలను వేటపాలెం ఫిజియోథెరపి కేంద్రాన్ని అవార్డుల కోసం ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆయా కేంద్రాలలో జరుగుతున్న కార్యక్రమాలను వీడియో రికార్డింగ్ చేసినట్లు తెలిపారు. భవిత కేంద్ర పరిధిలో మే నెలలో జరిగిన సర్వేలో 130 మందిని గుర్తించామని వారిలో 40 మందిని ప్రత్యేకంగా తీసుకుని 20 మందికి ఫిజియోథెరపి పరీక్షలు, 20 మందికి స్పెషల్ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శనివారం ఇద్దరు ఐఈఆర్‌టీలు గృహాలకు వెళ్లి భవిత కేంద్రానికి రాని దివ్యాంగులకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 19 భవిత కేంద్రాలు, 37 నాన్ భవిత కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల పరిధిలో మొత్తం 8516 మంది దివ్యాంగులను గుర్తించామని, 12 రకాల వైకల్యాలతో ఉన్నారని, అందరూ బడిఈడు పిల్లలని అన్నారు. వీరిలో 920 మంది భవిత కేంద్రాలలో ఎన్‌రోల్ అయ్యారని అన్నారు. భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద రూ.300లు, పాఠశాలలకు వెళ్లే దివ్యాంగులకు ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.250లు తల్లిదండ్రుల ఖాతాలో వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.టి.మల్లికార్జున్ నాయక్, ఐఈఆర్‌టీ రిసోర్స్ టీచర్ మాలిక్ మొహిద్దీన్, ఐఈఆర్‌టీలు వెంకటేశ్వర్లు, విజయబాల, ఫిజియోథెరపిస్ట్ వి.అంకారావు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఐ.నారాయణరెడ్డి, సీఆర్పీలు చాంద్ వలి, కొండలు పాల్గొన్నారు.


భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిధుల స్వాహా చేసిన నలుగురి సస్పెన్షన్

ఎర్రగొండపాలెం రూరల్: పుల్లలచెరువు మండలంలోని ముటుకుల వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలో గడువు ముగిసిన తరువాత నిధుల స్వాహాకు పాల్పడిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 2వ తేదీన వాటర్ షెడ్ నిధుల స్వాహా అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు విచారణ నిర్వహించి నిధుల స్వాహాకు బాధ్యులుగా గుర్తిస్తూ టెక్నికల్ ఆఫీసర్ నాగరాజు, కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ బాషా, ప్రాజెక్టు ఆఫీసర్ బషరతుల్లాను, ఎర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలో ఇన్‌చార్జిగా వ్యవహరించిన కాలంలో ప్రస్తుతం మార్కాపురం వాటర్ షెడ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామంలో ఓ వ్యక్తి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.మాధవరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా ముటుకుల గ్రామానికి చెందిన గాడికొయ్య దానియేలు వద్ద వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీ దేవి, క్యూలో భక్తులు

వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

త్రిపురాంతకం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు, నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా చిన మస్తాదేవికి ప్రత్యేక పూజలు,బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణంలో క్యూ లైనులో కిటకిటలాడా యి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పాలంక ప్రసాదు శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పుల్లలచెరువు మండలంలో...

శ్రావణ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని పవిత్ర వరలక్ష్మీ వ్రత పూజలను మండలంలో ఘనంగా నిర్వహించారు. పుల్లలచెరువు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలో వేకువజాము నుంచి మహిళలు ప్రత్యేక అలంకరణతో అమ్మవారి పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రత విశిష్టతను వేద పండితులు వివరించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ వీరప్ప నాయుడు, కార్యదర్శి సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల మండలంలో...

వరలక్ష్మీ వ్రత వేడుకల్లో భాగంగా దోర్నాలలోని నీలంపాటి అమ్మవారి ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, తిమ్మాపురంలోని చౌడేశ్వరి దేవాలయంలో భక్తి శ్రద్ధ లతో పూజలు నిర్వహించారు. శ్రావణమాసం కావటంతో పాటు వరలక్ష్మీ వ్రత పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం గ్రామోత్సవం గావించారు.

419 కుటుంబాలకు గృహాల మంజూరు

పుల్లలచెరువు: స్మార్టు పల్స్ సర్వే ఆధారంగా మండలంలోని మల్లాపాలెం, ఐటివరం గ్రామ పంచాయతీల్లో ఇళ్లు లేని 419 కుటుంబాల కు గృహాలు మంజూరు కానున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మాణిక్యరావు తెలిపారు. శుక్రవారం మల్లాపాలెం, యండ్రపల్లి గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపాలెంలో 134 మందికి 126, యండ్రపల్లిలో 300 మందికి 293 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమణమూర్తి, ఎంపీడీవో సూపరింటెండెంట్ గంగాధరరావు, సర్పంచి ఆశీ, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

త్రిపురాంతకం: మండలంలోని వెంగాయపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన పావులూరి శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.టి.మల్లికార్జున్ నాయక్ పాల్గొన్నారు.

లేళ్ళపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

త్రిపురాంతకం: మండలంలోని లేళ్ళపల్లి గ్రామంలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.టి.కెజియ, తల్లులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు సమాజానికి వారధులు

మార్కాపురం వన్‌టౌన్: కిశోర బాలికలు సమాజానికి వారధులని అ ర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు ముఖ్యంగా ముర్రుపాల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టి బొమ్మ దహనం

మార్కాపురం వన్‌టౌన్: సంధ్యాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్షనేత జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ నాయకులు మార్కాపురం పట్టణంలో శుక్రవారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పుర వీధులలో ఈ ప్రదర్శన జరిగింది. అనంతరం రీడింగ్ రూం సెంటరులో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జున్ మాట్లాడుతూ చంద్రబాబు పై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. ప్రతిపక్ష నేత స్థాయిని మరచి విమర్శలు చేయటం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ డి.వి.కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కందుల రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుప్తా ప్రసాదు, జిల్లా నాయకులు తాళ్ళపల్లి సత్యనారాయణ, షేక్ బాదుల్లా, షేక్ షెక్షావలి, కౌన్సిలర్లు చక్కా మధు, ఆంజనేయులు, చిలకపాటి వెంకట చెన్నయ్య, నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, మర్రి కొండలు, హనీఫ్‌ఖాన్, కె.వెంకటేశ్వర్లు, పేరూరి భాస్కర్, కొప్పురపు శ్రీనివాసులు, నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు మండలంలో...

ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డులో కాల్చాలని ప్రతిపక్ష నేత జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కలుజువ్వలపాడు జాతీయ రహదారిపై జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకు లు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా

మార్కాపురం వన్‌టౌన్: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టటం మొదటి టీకా అని రూరల్ సీడీపీవో షేక్ రమిజాభాను అన్నారు. నికరంపల్లి, నాగులవరంలోని గల అంగన్ వాడీ కేంద్రాలలో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే 24 గంటల లోపు జీరో డోస్ టీకా వేయించాలన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు రుబెల్లా టీకాను వేయించేలా అంగన్‌వాడీలు ప్రచారం చేయాలన్నారు. నికరంపల్లిలో సామూహిక సీమంతాలు, నాగులవరంలో అన్నప్రాసనలు, సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రభావతి, కృష్ణవేణి, శారద, దీప్తి, సుశీల, ఆయాలు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

మార్కాపురం వన్‌టౌన్: స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తామని, 75 సంవత్సరాలు నిండిన మాజీ సైనికులకు డైమండ్ జూబ్లి పేరిట ఆగస్టు 15న సన్మానిస్తామని సంఘం అధ్యక్షుడు హరినారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

మార్కాపురం వన్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవదానం శుక్రవారం తెలిపారు. రూ.10 చెల్లించి దరఖాస్తు పొందాలని పూర్తి చేసిన వాటిని ఆగస్టు 15 లోపు అందజేయాలని సూచించారు. ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, కోపా ట్రేడ్‌లలో ఖాళీలు ఉన్నాయని, ఈ నెల 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 08596-224545 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి సూచనలు ఇవ్వండి

అధికారులతో సమీక్షలో కందుల


తాగునీటి సమస్యపై చర్చిస్తున్న కందుల

మార్కాపురం: పట్టణంలో నీటి సమస్య నుంచి బయటపడేందుకు అవసరమైన సూచనలు, సలహాలను స్వీకరిస్తామని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. నీటి సమస్యపై చర్చించేందుకు శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాంబర్‌లో అధికారులు, కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. మున్సిపల్ డీఈ, ఏఈలతో పాటు కౌన్సిలర్లను కూడా అడిగి ప్రత్యామ్నాయ మార్గాలను కోరారు. పట్టణ పరిసరాల్లో కొత్తగా డీప్ బోర్లు తవ్వితే నీరు పడే ప్రాంతాలను గుర్తించాలని కొందరు సూచించారు. అధికారులతో పాటు మీడి యా ద్వారా వచ్చే సూచనలను కూడా పరిగణనలోకి తీసుకు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కందుల తెలిపారు. దరిమడుగు వద్ద జర్నలిస్టుల కాలనీ సమీపంలో నీరు పడే అవకాశాలు ఉన్నాయని, అక్కడ నుంచి సరఫరా చేసేందుకు వీలుగా ఉంటుందని చేసిన సూచన మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సర్వేలో గుర్తించిన వారికే పక్కా గృహాలు

పొదిలి : ప్రజా సాధికార సర్వేలో గుర్తించిన లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు అవుతాయని తహసీల్దార్ వి.విద్యాసాగరుడు పేర్కొ న్నారు. శుక్రవారం కంభాలపాడు గ్రామంలో సర్పంచ్ పులిగొర్ల శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పల్స్ సర్వేలో 288 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించినట్లు చెప్పారు. వీరిలో అర్హులను ఎంపిక చేసి గృహనిర్మాణ మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.నరసింహారావు, ఆర్ఐ రవిశంకర్, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, టీడీపీ యువజన నాయకులు ఎ.నాయుడు, వీఆర్వో ఏసుదాసు పాల్గొన్నారు.

రెండురోజుల వర్క్‌షాపు ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్: ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్, మెకానికల్ విద్యార్థులకు ఆటో క్యాడ్, జీఈఎస్ అంశాలపై శుక్రవారం రెండు రోజుల వర్క్‌షాపు ప్రారంభించారు. హైదరాబాదుకు చెందిన ఏసీఎస్ లిమిటెడ్ సీనియర్ ట్రైనర్ మురళీకృష్ణ ఆటో క్యాడ్ బేసిక్స్, ప్రొడ క్షన్స్, ప్యూస్, డ్రాయింగ్ సెట్టింగ్స్, మోడిఫైడ్ టూల్స్, క్రియేషన్ బ్లాక్స్, ఇన్‌సెర్ట్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.నాగశ్రీనివాస్, సివిల్, మెకానికల్ విభాగాధిపతులు డి.త్రిమూర్తినాయక్, వి.పురుషోత్తం, అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు, కేతగుడిపిలో శుక్రవారం ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చంద్రలీల మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజా సాధికారిత సర్వే ప్రకారం కేతగుడిపిలో 266 మందికి, తుమ్మలచెరువులో 150 మందికి గృహాలు లేన్నట్లు సర్వేలో వెల్లడైందన్నారు. గ్రామసభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపితే గృహాలు మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంగిరేకుల చిన్న అంకాలయ్య, హౌసింగ్ ఏఈ పాండు రంగారెడ్డి, వీఆర్వోలు ఇ.శేఖర్‌రెడ్డి, రంగసాయి, రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు వ్యాధులకు ఒకే వ్యాక్సిన్

మార్కాపురం వన్‌టౌన్: తట్టు, పొంగు వ్యాధులకు ఒకే వ్యాక్సిన్ వేయటం ద్వారా నివారించవచ్చని వైద్యుడు హరి అన్నారు. స్థానిక వివేకానంద విద్యాపీఠంలో శుక్రవారం విద్యార్థులకు ఎంఆర్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ హరిప్రసాదు, ఈఎన్‌టీ పద్మిణి, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.కాశయ్య, ప్రధానోపాధ్యాయుడు తోట నరసింహులు పాల్గొన్నారు. మొత్తం 1294 మందికి వ్యాక్సిన్ వేశారు.

బెల్ట్ షాపులను మూయించాలి

మార్కాపురం వన్‌టౌన్: మార్కాపురం డివిజన్‌లో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పి.కిశోర్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో బెల్ట్ షాపుల నివారణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు, వెండి చీర అలంకరణలో వాసవీమాత, ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్: పవిత్ర శ్రావణ మాసంలో వచ్చే శ్రావణ శుక్రవారంను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిశాలలో వాసవీ మాతకు వెండి చీర అలంకారం చేశారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో రమాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండురంగస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. అర్చకులు శ్రీరంగ నరసింహాచార్యులు, పాండు రంగ రుక్మీబాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 150 మంది మహిళలతో వరలక్ష్మీ వ్రతం చేయించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక మల్లికార్జున్ వ్రతాలలో పాల్గొని వాయినాలు అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తాళ్ళపల్లి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

బూత్ స్థాయి కమిటీలను నియమించాలి

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లి, కలుజువ్వలపాడు, మీర్జపేటలో శుక్రవారం బూత్ స్థాయి కమిటీల గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో వెంటనే బూత్ స్థాయి కమిటీని నియమించాలని సూచించారు. ప్రతి 100 మందికి ఒక మెంబరును నియమించాలని కార్యకర్తలను ఆదేశించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పులివేముల ఏసుదాసు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు వేశపోగు జాన్, శాసనాల వీరబ్రహ్మం, మండల పార్టీ ఇన్‌చార్జి కందుల వేణుగోపాల్‌రెడ్డి, కె.అచ్చిరెడ్డి, యక్కంటి శ్రీనివాస రెడ్డి, కొండారెడ్డి, రమేష్, వెంకటరెడ్డి, నంబుల తిరుపతయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

• సినిమాలు


మార్కాపురం

శ్రీనివాస	- జాబ్‌హారీమెట్ సీజల్
రాధాకృష్ణ	- నక్షత్రం
సాయిబాలాజీ	- ఫిదా
విశ్వేశ్వర	- నక్షత్రం
జగదీశ్వరీ	- గౌతమ్‌నంద
విజయా	- దర్శకుడు

పొదిలి

వెంకటేశ్వర	- ఫిదా
హరికృష్ణ	- గౌతమ్‌నంద
రామచంద్ర	- నక్షత్రం

దారి కనుక్కోండి



సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు.. కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall



'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!



ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్



తండ్రి : ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
బన్ను : నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
తండ్రి : !!!!!!!!

=======

టీచర్ : టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
చిన్ను : అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను

తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను

రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను

అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి


1. హాఆరం ▸ ....
2. ధుమరం ▸ ....
3. చాతిమం ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ....
2. FODO ▸ ....
3. RPEO ▸ ....

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.

ఔనా!

స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

జవాబులు

చెప్పగలరా? :
కూతురు

జంతర్‌మంతర్ :
1. ఆహారం
2. మధురం
3. చామంతి

జంబ్లింగ్ వర్డ్స్ :
1.SIDE
2.FOOD
3.ROPE

చుక్కలు కలపండి



షాక్ ఇచ్చిన 'అన్నా'


(మొదటి పేజీ తరువాయి)

టీడీపీలో చేరడం, ఆతర్వాత రాంబాబు ప్రాధాన్యం క్రమేపీ తగ్గిపోయిన విదితమే. అనుచరులతో చర్చించి సంచలన ప్రకటన చేస్తానని ముందుగానే చెప్పిన మేరకు శనివారం రాంబాబు గిద్దలూరులో సమావేశమయ్యారు. తన మద్దతుదారుల్లో కొందరు సీనియర్ నాయకులు మాట్లాడిన తర్వాత రాంబాబు ప్రసంగం ప్రారంభించారు. టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు, ప్రస్తుతం ఏ పార్టీలో చేరబోనని స్పష్టం చేశారు. వచ్చే మార్చి వరకు ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై పోరాటం చేస్తానని ప్రకటించారు. అలా మొదలైన ఆయన ప్రసంగం వివిధ మలుపులు తిరగడంతోపాటు, కొన్ని అంశాల్లో అయోమయంగా కూడా సాగింది. టీడీపీలో ఎదురైన అవమానాలను భరించలేకనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. అధినేత చంద్రబాబుపైన, ఇతర రాష్ట్ర నాయకత్వంపైనా పెద్దగా విమర్శలు చేయలేదు. తనతో ఉన్న పార్టీ శ్రేణులకు న్యాయం జరక్కపోవడమే తన రాజీనామాకు కారణమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి గిద్దలూరు నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన రాంబాబు ఏ పార్టీ తరఫున అన్నది స్పష్టం చేయలేదు. వచ్చే మార్చి తర్వాతనే ఏపార్టీలో చేరాలన్నది ఆలోచిస్తానని చెప్పారు. అదేసమయంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా విస్మయాన్ని కలిగించాయి. కార్యకర్తల కోసం ప్రాణత్యాగం చేస్తానని గతంలో చెప్పిన మాట ప్రకారం ఆత్మహత్య చేసుకుంటే లేనిపోని అపవాధులు సృష్టిస్తారన్న ఉద్దేశంతో వెనక్కి తగ్గినట్లు తెలిపారు. అయితే ఫిరాయింపులపై తాను చేపట్టిన పోరాటం విజయవంతం కాకపోతే కోర్టు ద్వారా అనుమతి తీసుకుని ప్రాణత్యాగం చేస్తానని ప్రకటించారు. ఇలా కొన్ని అంశాలపై అయోమయానికి గురిచేసే విధంగా మాట్లాడారు. అయితే టీడీపీకి రాజీనామా, మార్చి తర్వాత ఇతర పార్టీలో చేరే అంశంపై ఆలోచిస్తానన్న విషయాన్ని మాత్రం స్పష్టంగానే చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా గిద్దలూరు నుంచి పోటీ చేస్తానని కూడా స్పష్టంగా ప్రకటించారు.

నిజానికి నియోజకవర్గంలో ఉన్న రాంబాబు శ్రేయోభిలాషులు, అనుచరుగణం, అభిమానులు రాంబాబు ఈరకమైన నిర్ణయాన్ని తీసుకుంటారని ఊహించలేదు. పార్టీలోనే ఉండి అధిష్ఠానాన్ని కదిలించే కార్యక్రమాలు చేపడతారని ఎక్కువ మంది భావించారు. మరికొందరు వైసీపీలో చేరేందుకు సిద్ధమయ్యారని, అందుకు అనుగుణంగా ప్రకటన చేస్తారని భావించారు. అందుకు విరుద్ధమైన నిర్ణయాన్ని రాంబాబు ప్రకటించడంతోపాటు నియోజకవర్గస్థాయిలో ఇటు ఎమ్మెల్యేపైన, అటు వైసీపీ ఇన్‌చార్జిపైన విమర్శలు చేశారు. దీంతో సమావేశానికి హాజరైన ఆయన అనుచరగణం మొత్తం విస్మయానికి గురయ్యారు. అంతకుముందు మాట్లాడిన అనుచరుల్లో కూడా ఎవ్వరూ టీడీపీకి రాజీనామా చేయాలనో, వైసీపీలో చేరాలనో సూచించలేదు. ఇద్దరు నాయకులు మాత్రం మీమాటే మా బాట అంటూ ప్రకటించారు. అయితే రాంబాబు తన నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత అక్కడ ఉన్న వందలాది మంది నాయకులు, కార్యకర్తల్లో ఒక్కరు కూడా తామూ టీడీపీని వీడుతున్నామని ప్రకటించకపోవడం గమనార్హం. నియోజకవర్గంలోని పలు చోట్ల ఇప్పటికీ రాంబాబుతో ఉన్న గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల్లో కొందరు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. అయితే ఇతరత్రా స్థాయిలో ఉన్న అనుచరుల్లో ముఖ్యులంతా హాజరయ్యారు. వీరిలో కొందరు ప్రజాప్రతినిధులతోపాటు, గ్రూపు రాజకీయాలు నడిపే వారూ ఉన్నారు. అయితే వారిలో ఏ ఒక్కరూ రాంబాబు నిర్ణయానికి అనుగుణంగా తామూ టీడీపీకి రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించలేదు. మరోవైపు నియోజకవర్గం అంతా రాంబాబు నిర్ణయంలోని లాభనష్టాలపై చర్చ కొనసాగుతోంది.

రాంబాబు వర్గీయులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మంతనాలు

తాజా పరిణామాల నేపథ్యంలో రాంబాబుతో ఉన్న నాయకులు, వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అనుచరులు మంతనాలు ప్రారంభించారు. అశోక్‌రెడ్డి కూడా స్వయంగా రాంబాబు అనుచరులతో 'పార్టీలోనే ఉండండి. కలిసి పనిచేద్దాం. మీకు అన్ని విధాలా ప్రాధాన్యం ఇచ్చి చూసుకునే బాధ్యత మాది' అని సంకేతాలు పంపినట్లు తెలిసింది. తదనుగుణంగా శుక్రవారం రాత్రికి కొందరు నాయకులు ఎమ్మెల్యే అశోక్ టచ్‌లోకి వెళ్లినట్లు చెప్తున్నారు.


సమావేశానికి హాజరైన టీడీపీ కార్యకర్తలు

చంద్రబాబుకు చెప్పిన దామచర్ల

అన్నా రాంబాబు వెల్లడించిన నిర్ణయాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలను వివరించినట్లు తెలిసింది. పరిస్థితులన్నింటినీ జాగ్రత్తగా గమనించాలని సూచించిన చంద్రబాబు రెండ్రోజుల్లో ఈ విషయంపై మాట్లాడదామని చెప్పినట్లు సమాచారం. అటు మంత్రి శిద్దా, ఇటు దామచర్లను, అవసరమైతే ఇన్‌చార్జి మంత్రి నారాయణకు కూడా ఒకసారి రాంబాబుతో మాట్లాడని సీఎం సూచించినట్లు చెప్తున్నారు. రాంబాబుతో మాట్లాడేందుకు దామచర్ల జనార్దన్ ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదని అంటున్నారు. దామచర్ల ఫోన్ చేస్తే రాంబాబు లిఫ్ట్ చేయలేదని చెప్తున్నారు ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం రాంబాబు తనను కలిసిన అనుచరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లోనూ, అంతకు ముందు నుంచి టీడీపీ గెలుపు కోసం పనిచేసిన వారికి న్యాయం చేసేందుకు గత్యంతరం లేని పరిస్థితుల్లోనే రాజీనామా చేశానని, కార్యకర్తలను విస్మరించి ఎక్కడికీ వెళ్లనని, తాను చేపట్టే ఉద్యమానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని చెప్తున్నట్లు తెలిసింది. అప్పటి పరిస్థితులకు అనుగుణమైన వచ్చే ఎన్నికోల్లో కచ్చితంగా గిద్దలూరు నుంచి పోటీ చేస్తానని, కొద్దికాలం ఇబ్బందులు ఎదురైనా ఓపిగ్గా ఉండాలని కోరారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజనపై అనుమానాలు రేకెత్తిన నేపథ్యంలోనే రాంబాబు స్పీడ్‌గా నిర్ణయాలు తీకుంటున్నారని, తన వర్గాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగితే అవకాశాలు అవే వస్తాయన్న ఉద్దేశంతో ఆయన ముందడుగు వేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

టీడీపీకి రాంబాబు రాజీనామా

కార్యకర్తలు, అనుచరుల సమావేశంలో ప్రకటన

ఎమ్మెల్యేల పార్టీ ఫిర్యాయింపులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తానని వెల్లడి

అందులో విజయం సాధించకపోతే ప్రాణాలరిస్తానని వ్యాఖ్య

గిద్దలూరు టౌన్ : గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు టీడీపీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. కొంత కాలంగా అధిష్ఠానంపై అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తన అనుచరులతో రాంబాబు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాను పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆవేశపూరితంగా ప్రసంగించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిపై విమర్శలు చేశారు. గత ఏడాది జూన్‌లో టీడీపీలో చేరిన అశోక్‌రెడ్డి అనాదిగా పార్టీలో ఉన్న శ్రేణులను, తన అనుచరులను కలుపుకుపోకుండా అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. పింఛన్‌లు, రేషన్ కార్డులు, పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన తనవర్గ టీడీపీ కార్యకర్తలకు అవి దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. తన కార్యాలయంలో పీఏగా పని చేస్తున్న విశ్రాంత మిలటరీ ఉద్యోగి షేక్ మస్తాన్ వలిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించడం సబబేనా అని ప్రశ్నించారు. 23 వేల మంది కార్యకర్తల నుంచి పార్టీ సభ్యత్వాలను తాను సేకరించి అధిష్ఠానానికి ఇవ్వగా నేటికి వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. వీరిలో ముగ్గురు కార్యకర్తలు మృతి చెందారని, వీరికి పార్టీ నుంచి రావాల్సిన రూ. 2 లక్షల బీమా వచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ ముగ్గురి కుటుంబాలకు తాను వ్యక్తిగతంగా సహాయం చేస్తానని ప్రకటించారు. గ్రామాలకు వెళ్లి తాను సేకరించిన సభ్యత్వాలను కార్యకర్తలకు, నాయకులకు వెనక్కు ఇచ్చి తాను సభ్యత్వం చేయించలేని స్దితిలో ఉన్నానని వారికి తెలిపి క్షమాపణ కోరతానన్నారు. ఎమ్మెల్యే నియంతృత్వ పోకడ వలన పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు జరుగుతున్న కష్టనష్టాలను పలు పర్యాయాలు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరక్కపోవడంతో పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్షంలో ఉండలేక స్వలాభం కోసం అధికార పార్టీలోకి జంప్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తానన్నారు. రాష్ట్రపతిని, ప్రధానిని, చట్ట సభలలోని ముఖ్యులను కలిసి ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల గురించి వివరిస్తానన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తానని చెప్పారు. ఈ పోరాటంలో విజయం కోసం వచ్చే ఏడాది మార్చి 31 వరకూ వేచి చూస్తానన్నారు. ఇందులో విఫలమైతే పాణాలర్పిస్తానని ఆవేశంగా మాట్లాడారు. తాను వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసి ఇప్పుడు మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నానని విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకుడు ఐ.వి. రెడ్డిపై అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. ఆయన ఎన్ని పార్టీలు మారారో అందరికీ తెలుసన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్‌లు నెమిలిదిన్నె చెన్నారెడ్డి, టి. రామ్మోహన్ మాట్లాడుతూ అన్నా రాంబాబు నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఆయన వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కంభం జడ్పీటీసీ సభ్యుడు జాకీర్‌హుస్సేన్, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీను, చెల్లె శ్రీరామిరెడ్డి, కోటా నరసింహులు, కె. మురహరి, సారె వెంకటనాయుడు, పాముల వెంకట రమణ, పూనూరి భూపాల్‌రెడ్డి, బుడతా మధు, ఆవులమంద శ్రీనివాసులు, మేకల భయ్యన్న, ముద్దర్ల శ్రీను, బాదం గోపాల్, శివపురం ఆంజనేయులు, పగడాల శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

సంస్కారం లేని ప్రతిపక్ష నేత జగన్

• మంత్రి శిద్దా రాఘవరావు ధ్వజం



ఒంగోలు కార్పొరేషన్ : ప్రతిపక్ష నేత జగన్‌కు సంస్కారం లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిని ఇష్టం వచ్చినట్లు జగన్ మాట్లాడటాన్ని ప్రజలు ఆసహ్యాహించుకుంటున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో అక్కడి ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెప్తారన్నారు. శుక్రవారం ఒంగోలులోని తన నివాసంలో మంత్రి విలేఖరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా జరిగిన సభలో గౌరవప్రదమైన ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబును కాల్చి చంపినా తప్పులేదు అని జగన్ వాఖ్యానించడాన్ని శిద్దా తప్పుపట్టారు. జగన్ తండ్రి వైఎస్ సీఎంగా ఉన్నపుడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు ఎంతో హుందాగా, గౌరవంగా వ్యవహరించారన్నారు. కానీ జగన్ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తూ ప్రతిపక్ష నేత నేత స్థాయిని తగ్గిస్తున్నారన్నారు. ఈనెల 23న జరిగే నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందన్నారు. ఈ గెలుపుతోనే ప్రజలు జగన్‌కు తగిన బుద్ధి చెప్తారన్నారు.

జగన్‌పై టీడీపీ నేతల ఫైర్

ఒంగోలు, ఆంధ్రజ్యోతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునుద్దేశించి ప్రతిపక్ష నేత జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దహనాలు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అక్కడ జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నడిరోడ్డుపై చంద్రబాబును కాల్చి చంపినా తప్పులేదంటూ మాట్లాడారు. దీనిపై జిల్లాలోని టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. జగన్ వ్యాఖ్యలను మంత్రి శిద్దా రాఘవరావు తప్పుపట్టారు. శుక్రవారం ఒంగోలులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్కారం లేని ప్రతిపక్ష నేత జగన్ అన్నారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు శుక్రవారం సాయంత్రం నిరసన ప్రదర్శనలు, జగన్ దిష్టిబొమ్మల దహనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కొండపిలో ఎమ్మెల్యే డాక్టర్ డి.ఎస్.బి.వి. స్వామి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జగన్ వ్యాఖ్యలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. పర్చూరులోని బొమ్మలసెంటర్‌లో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కనిగిరిలో నగర పంచాయతీ ఛైర్మన్ షేక్ చిన్నమస్తాన్, టీడీపీ సీనియర్ నాయకుడు భేరి పుల్లారెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కారంచేడులో ఏఎంసీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి, నీటి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి అనిల్‌బాబు ఇతర నేతలు సమావేశమై జగన్ వ్యాఖ్యలను ఖండించారు. గిద్దలూరులో స్థానిక టీడీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మార్కాపురం సమీపంలోని తర్లుబాడు మండలం కలుజువ్వలపాడులో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో టీడీపీ శ్రేణులు జాతీయ రహదారిపై జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. దర్శిలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, మార్టూరులో అక్కడి టీడీపీ నేతల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఒంగో లులోని పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు టీడీపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించి, అక్కడ జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నగర టిడిపి అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు, ఇతర ముఖ్యనేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఒంగోలులో జగన్ దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న టీడీపీ నాయకులు

సేవకు సెలవేనా?

- రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తం నిల్
- సిబ్బంది లేరు.. పరికరాలూ పనిచేయవు..
- ఆరేళ్లుగా రెన్యువల్ కాని లైసెన్సు
- పట్టించుకోని అధికారులు

ఒంగోలు నగరం: ఒంగోలులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తిరోగమనానికి చేరుకుంది. పాలకులు, అధికారులు పట్టించుకోపోవడంతో మూతపడే స్థితికి చేరింది. ఈ సొసైటీకి కలెక్టర్ చైర్మన్‌గా, జడ్పీ సీఈవో కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రెడ్‌క్రాస్ నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎంతోకాలంగా అధికారుల పర్యవేక్షణలోని ఈ సేవలు కొనసాగుతున్నాయి. నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ రెడ్‌క్రాస్ గురించి అంతగా పట్టించుకోక పోవటం, జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న వారు కూడా తమది కాదులే అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో గత కొన్ని నెలలుగా రెడ్‌క్రాస్‌లో సేవలు తగ్గుతూ వస్తున్నాయి.



సేవా కార్యక్రమాల నిర్వహణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఎన్నో అవార్డులూ సొంతం. అయితే ఒంగోలులోని రెడ్‌క్రాస్ సొసైటీ నేడు నిరుపయోగంగా మారింది. సేవలకు పూర్తిగా స్వస్తి పలికే స్థితికి దిగజారింది. రక్తపునిల్వలు నిండుకున్నాయి. గత ఆరు నెలలుగా ఎలాంటి సేవలు లేకుండా దాదాపు మూతపడే స్థాయికి చేరుకుంది. ఇందుకు కారణం అధికారులే కావటం గమనార్హం.

మూతపడిన పరీక్షల మిషన్

రెడ్‌క్రాస్ సొసైటీలోని రక్త పరీక్షలు నిర్వహించే ఎలిషీ యంత్రం ఆరునెలలుగా రిపేరుకు నోచుకోలేదు. రెడ్‌క్రాస్ సొసైటీలో ఉన్న బ్లడ్ బ్యాంకు పనిచేయాలంటే ఈ మిషన్ ఎంతో అవసరం. దానం చేసిన రక్తాన్ని పరీక్షలు నిర్వహించిన అనంతరం ఇతరులకు అందజేయాల్సి ఉంది. రక్తంలో హెచ్ఐవీ, ఇతర వ్యాధుల పరీక్షలు నిర్వహించిన అనంతరమే ఆ రక్తాన్ని ఇతరులకు ఇస్తారు. అయితే ఆయా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఎలిషీ పరీక్ష యంత్రం గత ఆరు నెలలుగా పని చేయడం లేదు. దానికి మరమ్మతులు నిర్వహించటంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా రక్తం ఇతరులకు ఇచ్చేందుకు వీలులేకుండా పోయింది. ప్రస్తుతం రెడ్ క్రాస్‌కు వస్తున్న దాతల నుంచి సేకరించిన రక్తాన్ని స్థానిక రిమ్స్ వైద్యశాలలోని రక్తనిధి కేంద్రానికి పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెడ్‌క్రాస్‌లో రక్తనిధి కేంద్రానికి కొత్త ఎలిషీ మిషన్ కొనుగోలు చేసినా రూ.1.50 లక్షలు మాత్రమే ఉంటుంది. పాత దానికి మరమ్మతులు చేయిస్తే ఇంకా తక్కువలోనే ఖర్చు అవుతుంది. అయితే దీన్ని పట్టించుకునే నాథుడే లేకపోవటం విషాదకరం.

సిబ్బంది ఏరీ..

ఒంగోలులోని రెడ్‌క్రాస్ సొసైటీ నేడు ఎవరూ లేక బోసిపోయి కనిపిస్తోంది. బ్లడ్‌బ్యాంకులో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ ఉండాలి. కాని ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగం మానేసి ఇతర ప్రాంతానికి వెళ్లి పోయారు. బ్లడ్‌బ్యాంకులో పనిచేయాలంటే గతంలో ఎద్దైనా బ్లడ్‌బ్యాంకులో పనిచేసిన రెండేళ్ల అనుభవం తప్పనిసరి. అలాంటి సీనియర్ టెక్నీషియన్‌ను ఆర్నెల్లుగా ఇక్కడ నియమించలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు కూడా తగినంత అనుభవం లేకపోవటంతో సేవలు అందించలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు కూడా ఇటీవలే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లి పోయారు. దీంతో రక్త సేకరణ కూడా నిలిచిపోయింది.

తూతూమంత్రంగానే సేవలు

రెడ్‌క్రాస్ గతం చూసుకుంటే రక్త నిల్వలు వందల కొలది యూనిట్లు అందుబాటులో ఉండేవి. అన్ని వేళలా రక్తం అవసరమైన వారికి అందజేసేవారు. అలాంటి రెడ్‌క్రాస్‌లో ఇప్పుడు రక్త నిల్వలే లేకుండా పోయాయి. అరకొర నిల్వలు కూడా ఒకరిద్దరికి ఇచ్చేసి తర్వాత వచ్చిన వారికి లేవని చెప్పేస్తున్నారు. దాతలు ఇచ్చిన రక్తాన్ని పరీక్షలు చేసే వీలు లేక పోవటంతో ఇతర ప్రాంతాలకు పంపించేస్తున్నారు. దీంతో రక్తం కోసం రెడ్‌క్రాస్ పైన కొండంత ఆశతో వస్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది.

లైసెన్స్‌కు రెన్యువల్ కూడా లేదు..

ఒంగోలులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్లడ్ బ్యాంకు నిబంధనలకవు విరుద్దంగానే నడుస్తుందని చెప్పాలి. ప్రభుత్వం నిర్వహించే బ్లడ్‌బ్యాంకు అయినా, ప్రైవేటు బ్లడ్‌బ్యాంకు అయినా డ్రగ్ కంట్రోల్‌శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలో లైసెన్సును రెన్యువల్ చేయించాలి. అయితే రెడ్ క్రాస్‌సొసైటీ రెన్యువల్ గడువు ముగిసి ఆరేళ్లవుతున్నా రెన్యువల్ చేయించలేదు. అయినా బ్లడ్‌బ్యాంకును నిర్వహిస్తూనే ఉన్నారు. ఇలా అధికారులే ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెన్యువల్ చేయించాలంటే ప్రభుత్వం నిర్ధేసించిన మేరకు బ్లడ్‌బ్యాంకులో సౌకర్యాలు, సిబ్బందిని చూపించాలి. అయితే ఈ బ్లడ్‌బ్యాంకులో అలాంటి పరిస్థితి లేకపోవడంతో రెన్యువల్ జోలికి వెళ్లలేదని తెలుస్తోంది. అసలు ఈ రెడ్‌క్రాస్‌పైన అధికారులు దృష్టి పెట్టకపోవటమే ఈ దుస్థితికి కారణం. రెడ్‌క్రాస్ పరిస్థితి ఇలా మారటంతో అనేక మంది రక్తం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ లేని గ్రూపుల రక్తాన్ని కూడా ఇతర ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుల నుంచి తెప్పించి ఇచ్చేవారు. సేవలకు ఇంత ప్రాధాన్యం ఇచ్చే రెడ్‌క్రాస్ నేడు ఒంటరిగా మిగిలింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తొలి ఇన్నింగ్స్‌లో 'ప్రకాశం'

209 పరుగులకు ఆలౌట్

- అనంతపురం జట్టుకు స్వల్ప ఆధిక్యత
- రెండో ఇన్సింగ్స్‌లో 54/4
- చెలరేగిన ప్రకాశం బౌలర్లు



బ్యాటింగ్ చేస్తున్న అనంతపురం బ్యాట్స్‌మెన్

ఒంగోలు కార్పొరేషన్: ఒంగోలు సీఎస్ఆర్ శర్మాకళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-16 గ్రూప్ బి అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌ల్లో ప్రకాశం, అనంతపురం జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం 68.4 ఓవర్లకు 211 పరుగులకు ఆలౌట్ కాగా, ప్రకాశం జట్టు 95 ఓవర్లు ఆడి 209 పరుగులకే అన్నీ వికెట్లు నష్టపోయింది. జట్టులోని రోహిత్ 41, కిరణ్ 49 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు శరత్‌కుమార్ 3, గణేష్, వెంకటరమణ చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం రెండు పరుగుల అధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌ను అనంతపురం చేపట్టింది. రెండోరోజు శుక్రవారం సాయంత్రం ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లకు 54 పరుగులు చేసి 4 వికెట్లను కోల్పోయింది. టి.మహేంద్రరెడ్డి డకౌట్ కాగా, దత్తరెడ్డి 1, జి.శ్రేయాస్ 6, జి.గురురాఘవేంద్ర 28 పరుగులకు అవుటయ్యారు. బి.యోగానంద్ 26, ఎన్.హరినాద్ 8 పరుగులతో క్రిజ్‌లో ఉన్నారు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ప్రకాశం పట్టు బిగించేందుకు కృషి చేసింది. ఇప్పటికే 4 వికెట్లు సాధించడం పట్ల ఆశలు చిగురిస్తున్నాయి. ప్రకాశం జట్టుకు చెందిన బౌలర్ శివకుమార్ 3 వికెట్లు సాధించగా, పి.నవీన్ ఒక వికెట్ కైవసం చేసుకున్నారు. శనివారం జరిగే మ్యాచ్ ఇరుజట్లకు కీలకం కానుంది.

వారంలో బకాయిలు చెల్లింపు

ఉద్యోగులకు ఒంగోలు డెయిరీ చైర్మన్ చల్లా హామీ ● ఆందోళన తాత్కాలికంగా వాయిదా
సంస్థ మనుగడను ప్రశ్నించిన ఉద్యోగ సంఘ ప్రతినిధులు ● తాజా పరిస్థితిపై పాలకమండలి చర్చ

ఒంగోలు,ఆంధ్రజ్యోతి : పాడి రైతులకు, ఉద్యోగులకు ఉన్న బకాయిలను వారం రోజుల్లో సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని, అప్పటి వరకు ఆందోళన విరమించాలని డెయిరీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు కోరారు. దీంతో డెయిరీ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన తాత్కాలికంగా వాయిదా పడింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉండి పాడిరైతులకు, ఉద్యోగులకు కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయాయి. ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆ బకాయిలు చెల్లింపు కోరుతూ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఒంగోలులో డెయిరీ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నుంచి రిలే నిరాహారదీక్షలకు పిలుపునిచ్చారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులతో డెయిరీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, ఇతర పాలక మండలి సభ్యులు శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. దాదాపు నాలుగు గంటలకు పైగా చర్చ సాగింది. ఒక వైపు ఉద్యోగులు, మరో వైపు పాలక మండలిలోని డైరెక్టర్లు బకాయిలతో పాటు డెయిరీ మనుగడపైనా స్పష్టత ఇవ్వాలని చైర్మన్ చల్లాను, అలాగే ఇన్‌చార్జి ఎండీ డాక్టర్ ప్రసాద్‌లను డిమాండ్ చేశారు. అసలు ఎంత అప్పు ఉన్నది, ఎందుకు అంత అయ్యిందనే అంశాలను వివరించి భవిష్యత్ సంస్థ మనుగడపై భరోసా ఇవ్వాలని ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులు గట్టిగా డిమాండ్ చేయగా, పాడి రైతులకు కోట్ల రూపాయాల్లో పేరుకు పోయిన బకాయిల వ్యవహారంపై పలువురు డైరెక్టర్లు వారిని గట్టిగా నిలదీసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సుదీర్ఘంగా సమావేశం కొనసాగగా చివరకు బకాయిల చెల్లింపులకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ నెల 10నాటికి ఉద్యోగుల వేతనాలు, పాడిరైతుల బకాయిలు కూడా చెల్లిస్తామని చైర్మన్ చల్లా హామీ ఇచ్చారు. అప్పటి వరకు ఆందోళన విరమించాలని ఉద్యోగ సంఘాల నేతలను కోరారు. అయితే ఈనెల 15లోగా బకాయిలు చెల్లింపుతో పాటు డెయిరీ అప్పులు, సంస్థ భవిష్యత్ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని, అప్పటి వరకు ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగ సంఘ నాయకులు ప్రకటించారు. దీంతో డెయిరీలో రేగిన అలజడి తాత్కాలికంగా సర్దుమణిగింది. ఇదిలా ఉండగా పెద్ద మొత్తంలో పాడిరైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉండటం అందుకోసం రైతుల నుంచి వత్తిడి వస్తున్న విషయాలపై పలువురు డైరెక్టర్లు, ఇటు చైర్మన్, అటు ఇన్‌చార్జీ ఎండీలను నిలదీసినట్లు సమాచారం. అయితే ఆ బకాయిలను కూడా 10 నాటికి చెల్లించే ప్రయత్నం చేస్తున్నామని చైర్మన్ వారికి వివరించే ప్రయత్నం చేశారు. తమకు నమ్మకం కలగడం లేదని, ఆలోపు బకాయిలు చెల్లించకపోతే సంస్థపై రైతుల్లో పూర్తిగా వ్యతిరేకత వచ్చి అసలుకే ఇబ్బంది కలుగుతుందన్న భావన డైరెక్టర్లు వ్యక్తం చేశారు. అధికారికంగా బోర్డు సమావేశం కానప్పటికి బకాయిలు పేరుకుపోయి రైతులు వత్తిడి చేస్తున్న నేపథ్యంలో డైరెక్టర్లందరూ చైర్మన్‌ను కలిసి చర్చించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు వారి మధ్య చర్చ సాగినట్లు తెలుస్తోంది.

రేపు త్రోవగుంటలో హ్యాపీ సండే

ఒంగోలు కార్పొరేషన్ : ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని రేపు త్రోవగుంటలో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యాలు, గ్రామీణ క్రీడలు, ఆట, పాటలతో వీనుల విందుతో ఆనందాల ఆదివారంగా గడపాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

ఒంగోలు కార్పొరేషన్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా టీడీపీ నేతలు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీగా విచ్చేసి, స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగన్ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన జగన్ కుటుంబం స్థాయి మరచి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా పర్వాలేదని మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంస్కార హీనంగా వ్యవహరిస్తూ, చంద్రబాబు నాయుడు రాజకీయ అనుభవం అంత వయస్సు ఉన్న జగన్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.అరుణ, ఆర్ల వెంకటరత్నంతోపాటు నగర అధ్యక్షుడు



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

కొఠారి నాగేశ్వరరావు, కార్యదర్శి దాయినేని ధర్మ, నేతలు షేక్ కపిల్‌బాషా, కె. రవిచంద్ర, బొల్లినేని వాసుకృష్ణ, కమ్మ వెంకటేశ్వర్లు, కామేపల్లి శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- 9న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్ : అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాలా అంజయ్య, కంకణాల ఆంజనేయులులు ఆరోపించారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఈనెల 9వ తేదీన జరగనున్న చలో పార్లమెంట్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జి. వెంకటేశ్వర్లు, ఎం. ఆంజనేయులు, దగ్గుబాటి సోమయ్య, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

నైతికవిలువలు పెంపొందించేందుకే శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్ : రోజురోజుకూ పడిపోతున్న నైతిక విలువలను విద్యార్థుల్లో పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు ట్రైనర్ డాక్టర్ పి.ఎస్. శర్మ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్ జిల్లా గవర్నర్ నామినేని మోహన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు ప్రపంచ వ్యాప్తంగా ఈ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కో ఆర్డినేటర్ వీవీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఎలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొమ్మల శ్రీనివాసరావు, మురళీమోహన్‌రావు, వీఆర్వో ప్రకాష్, నోబుల్ బెరియన్, కోశాధికారి ఏడుకొండలు, సి.బి. మైఖేల్, శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలి

ఒంగోలు క్రైం : జిల్లాలో నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు ఈ నెల ఆరున జిల్లా పోలీసు కార్యాలయంలో హాజరు కావాలని ఎస్పీ బి.సత్య ఏసుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కానిస్టేబుళ్లు తమ లగేజీ తీసుకొని ఉదయం ఆరు గంటలకు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే అక్కడ నుంచి వారికి కేటాయించిన శిక్షణ కళాశాలకు పంపిస్తామని తెలిపారు.

రేపు నరసం నాయకులకు సన్మానం

ఒంగోలు కల్చరల్ : ఆంధ్రప్రదేశ్‌లోని రచయిత్రులతో నూతనంగా ఏర్పడిన నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) నాయకులకు 6వ తేదీ ఉదయం 10 గంటలకు ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబులు తెలిపారు. ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయిలను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చందు డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎన్.సీతా రామమూర్తి రచించిన కృష్ణవేణి చరితం నృత్యరూపక ప్రదర్శన ఉంటుందని, సాహితీవేత్తలు, కళాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

చర్చిలో డబ్బులు దొంగిలించిన వారిని అరెస్టు చేయాలి

ఒంగోలు కార్పొరేషన్ : స్థానిక జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో భక్తులు కానుకలుగా సమర్పించే నగదును దొంగతనం చేసి కార్యదర్శిగా చెప్పుకుంటున్న జయకుమారిని అరెస్టు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఎంసీపీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కార్యదర్శి పి. పద్మా జోషి, పి. రాజ్‌విమల్, ఛైర్మన్ కొడమల ఆల్విన్, కోశాధికారి స్వరూప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చిలో కానుకలను దొంగిలించినట్లు సీసీ పుటేజ్‌లో స్పష్టంగా ఉందన్నారు. సాక్ష్యాధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, టూటౌన్ సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డబ్బులు దొంగిలించిన వారికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ దోషులను అరెస్టు చేయకుండా ఉండటంపై సంఘంలో ప్రతి వారం వచ్చే కానుకలకు భద్రత కరువైపోతుందన్నారు. అదేవిధంగా మాజీ కార్యదర్శి తేళ్ల ఇమ్మానుయేలు చర్చి సెక్షన్ సాల్మన్‌కు ఫోన్ చేసి బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోతే ధర్నాకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో నాగరాజు, విక్రమ్, టి.జె. కృపాదానం, దైవాదీనం, సత్యరాజ్, ఏసుపాదం, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

ఆ జీవోను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్ : మునిసిపల్ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ నగర కమిటీ అధ్యక్షుడు దామా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె సామ్రాజ్యం మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అనేక పర్యాయాలు జీవోలను రద్దు చేయాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం దారుణంగా ఉందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికుల ఉపాధిని దెబ్బతీసే జీవోలను రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దామా శ్రీనివాసరావు, రాగి రాములు, సిహెచ్. అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ వరకు గడువు పొడగింపు

ఒంగోలు కలెక్టరేట్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం-2017 పురస్కరించుకొని వివిధ ఇతివృత్తాలలో మూడు కేటగిరిలలో రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ ఫొటోలను ఈనెల 10వ తేదీ వరకు పొడిగిస్తామని సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేటగిరీలలో ఫొటోలు పంపాలని పేర్కొన్నారు. పోలవరం/పట్టిసీమ ప్రాజెక్టు, పొలం పిలుస్తోంది, ఆంధ్రప్రదేశ్‌లో సంప్రదాయ పండగలు, కేటగిరి-2 కింద స్వచ్ఛాంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ గృహ నిర్మాణం, చంద్రన్న చేయూత, కేటగిరి-3లో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ వార్తా చిత్రాలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. ఎంట్రీ కలర్‌లో (8ఇంటు12) లేదా(10ఇంటు12) సైజ్‌లో ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు శ్రీరామ్ 9849076758, ఎస్. రమేష్ 8977353470 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దేవరపల్లి చెరువు భూమిని పూడ్చి దళితులకు అప్పగించాలి

ఒంగోలు కలెక్టరేట్ : పర్చూరు మండలం దేవరపల్లి దళితుల భూముల్లో తవ్విన కుంటను పూడ్చి దళితులకు వెంటనే అప్పగించాలని సీపీఎం జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలోని అంశాలను సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు వెల్లడించారు. దేవరపల్లి దళితుల భూ సమస్యపై రెండు నెలల పాటు సుదీర్ఘ పోరాటం జరిగిందన్నారు. ఈ విషయంపై సీఎంతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. దళితులకు భూమి ఇవ్వడంతో పాటు తగిన ఆర్థిక సహాయం చేయాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘీభావంగా నిధి ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.98,060 నిధి వసూలు చేశామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.వి.కొండారెడ్డి, ఎస్‌డి. హుస్సేన్, పెంట్యాల హనుమంతరావు, చీకటి శ్రీనివాసరావు, ఎస్‌కె. మాబు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఒంగోలు క్రైం : తన భర్త అదృశ్యమయ్యాడని ఆయన భార్య కఠారి లక్ష్మీరాధ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిరియాలపాలెంలో నివాసం ఉండే శైలేష్ బాబు గత నెల 13వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివారు కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

- మురుగునీరు నిల్వ ఉన్న తొలగించకపోవడం దారుణం

- వైసీపీ నగర అధ్యక్షుడు సింగరాజు

ఒంగోలు కలెక్టరేట్ : నగర పాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీల్లో ప్రజానీకం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వైసీపీ నగర కమిటీ అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు ఆరోపించారు. వైసీపీ నగర కమిటీ నేతలు శుక్రవారం 45వ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అవుతున్నాయని, పలు పర్యాయాలు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వైసీపీ నేతల వద్ద ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై స్పందించిన సింగరాజు మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఆర్భాటపు ప్రచారం చేస్తున్నా టీడీపీ నాయకులు ఇక్కడ నిల్వ ఉన్న మురికినీరు కనిపించదా అని ప్రశ్నించారు. నీటి సమస్య కూడా వేదిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యూత్ అధ్యక్షుడు గంటా రామానాయుడు, నగర యువజన అధ్యక్షుడు కాకుమాను సునీల్, దార్ల యశ్వంత్ వర్మ, 45వ డివిజన్ అధ్యక్షుడు



ప్రజలతో మాట్లాడుతున్న సింగరాజు

రవీంద్రనాథ్ రెడ్డి, బాలిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏడుకొండలు, చిలకల బాలిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేచే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

సంతమాగులూరు : సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేస్తారని ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన 3 సీసీరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించడంతో పాటు కొత్తగా నిర్మించనున్న మరో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తారని ఎంపీపీ ఏడుకొండలు తెలియజేశారు.

ఆక్రమణల తొలగింపునకు అడ్డంకులు

ఆదర్శంగా ఉండాల్సిన కౌన్సిలర్లే అడ్డంకిగా మారిన వైనం ● మరికొన్ని చోట్ల వ్యాపారులకు అండగా ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు ● ఇబ్బందిపడుతున్న ప్రజలు



తొలగించకుండా ఉన్న రెండు భవనాల ముందు పోర్టికోలు

అద్దంకి: అద్దంకిలోని మెయిన్‌రోడ్డులో ఆక్రమణల తొలగింపులకు ప్రజాప్రతినిధుల నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆదర్శంగా ఉండాల్సిన వారే తమ విషయానికి వచ్చేసరికి మాత్రం సహకరించడం లేదు. దీంతో మెయిన్‌రోడ్డుతోపాటు భవానీ సెంటర్‌లోని దూదేకుల పాలెంలో ఆక్రమణల తొలగింపు కష్టతరంగా మారుతోంది. దీనికి తోడు రెండుమూడు షాపుల ఆక్రమణల తొలగింపు విషయంలో నగర పంచాయతీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం మరింత విమర్శలకు తావిస్తోంది. మెయిన్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు పూర్తయ్యి పది రోజులు గడిచినా ఆ మూడు భవనాల వద్ద మాత్రం యథాతథ స్థితి కొనసాగుతున్నది. రెండు భవనాల వద్ద పోర్టికోలు ముందుకు వచ్చాయి. మరో రెండు మూడు చోట్ల సైడ్‌డ్రైన్‌లపై పైఅంతస్తులకు ఏర్పాటు చేసిన మెట్ల తొలగింపు జరగలేదు. పోలీస్‌స్టేషన్ ఎదురు మెట్లు తొలగించాల్సిన ప్రాంతం కౌన్సిలర్ నివాసం కావడంతో అధికారులు కూడా మీనమేషాలు లెక్కిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఆక్రమణల తొలగింపు విషయంలో అధికారులు ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్న తరుణంలో ఆ మూడు నాలుగు చోట్ల తొలగింపు విషయంలో వెనుకడుగు వేయడంతో విమర్శలకు ఆస్కారం ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షానికి భవానీ సెంటర్ ప్రాంతంలోని దూదేకుల పాలెంలో మురుగు నీరు ముందుకు కదలక పలు ఇళ్లల్లోకి చేరింది. ఈనేపథ్యంలో నగర పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపతికన సైడ్ డ్రైన్‌ల పూడిక తీత, ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అక్కడ కూడా రెండు మూడు చోట్ల ఆక్రమణలకు అడ్డంకులు ఏర్పడ్డాయి.



పోలీస్‌స్టేషన్ ఎదురు తొలగించకుండా వదలివేసిన కౌన్సిలర్‌కు చెందిన ఇంటి మెట్లు



దూదేకులపాలెంలో కౌన్సిలర్ ఇంటిముందు తొలగించని మెట్లు

కుదరని సయోధ్య

మెయిన్‌రోడ్డులో ఆక్రమణల తొలగింపు పూర్తయ్యి కాలువల పూడిక తీత కూడా చేపట్టారు. అ యితే కొన్ని ప్రాంతాల్లో అ సలు సైడ్ డ్రైన్ లేకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో పాత సైడ్ డ్రైన్ తొలగించాల్సి రావడం జరిగింది. దీంతో వెను వెంటనే సైడ్ డ్రైన్‌ల నిర్మాణంతో పాటు ఆ క్రమణలు తొలగించిన ప్రాంతంలో సీసీరోడ్డు నిర్మాణం చేపడతారని స్థానికులు భావించారు. కాని ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడటంతో పనులు వెను వెంటనేచేపట్టే అవకాశం లేనట్లు తెలుస్తున్నది. అభివృద్ధి పనులు చేపట్టే విషయమై మెయిన్ రోడ్డు ప్రాంతంలోని ముగ్గురు కౌన్సిలర్ల అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందజేయాలని నగర పంచాయతీ అధికారులు కోరగా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీనికితోడు ఆక్రమణల తొలగింపు విషయం తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, తమ సిఫార్సులకు స్పందించలదేని గు ర్రుతో ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో నిధుల కేటాయింపు విషయంలో కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్య సరైన అవగాహన కూడా లేనట్లు తెలుస్తున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే రోడ్డు విస్తరణ చేపట్టడం వల్ల ఇబ్బందులు పెరగడం తప్ప ఆశించిన ఫలితం ఉండదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీర్ఘకాలంగా సైడ్‌డ్రైన్‌లు నిర్మాణం చేపట్టకపోతే వ్యాపారాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని ఆయా షాపుల నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న శ్రీశైలనాథన్ అయ్యంగారు



సంతమాగులూరులో పార్వతిదేవి

పంగులూరు: కొండమంజులూరు గ్రామంలో పోలేరమ్మతల్లి వి గ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రముఖ వేద పండితులులు శ్రీశైలనాథన్ అయ్యంగార్ నేతృత్వంలో ఎనమండ్ల శేషగిరి శర్మ, వారి రుత్విక బృందం మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహంచారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం కూడా కావడంతో వందల సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారి అనుగ్రహం పొందేందుకు తరలివచ్చారు. నిర్వాహక కమిటి ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. శ్రీశైలనాథన్ అయ్యంగారి దంపతులను నిర్వాహక కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. రాత్రి పూట హరిశ్చం ద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

సంతమాగులూరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా సంతమాగులూరు మండలంలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు వరలక్ష్మి వ్రతాలు నోచుకున్నారు. సంతమాగులూరులో గల పరసువేదేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బల్లికురవ: బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో మల్లేశ్వరి

నంబూరివారిపాలెం(అద్దంకి టౌన్): తల్లిపాలతోనే బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని సీడీపీవో మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం నంబూరివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను గురించి చిన్నారుల తల్లులకు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలోని మక్కెనవారి పాలెం, పరిటాలవారిపాలెం గ్రామాల్లో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలను నిరన్వహించారు. తల్లిపాలే పిల్లలకు అమృతమని, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని, వారు తీసుకునే ఆహారం పైనే బిడ్డల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశిదేవి, సంతోషకుమారి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

10లోపు మరుగుదొడ్లు ప్రారంభించాలి

బల్లికురవ: మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఈ నెల 10వ తేదీ లోపు ప్రారంభించాలని మండల ప్రత్యేకాధికారి కాంతారావు కోరారు. శుక్రవారం ఆయన బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్లపై సమీక్షించారు. నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అధికారులంతా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అద్దంకిలో ప్రారంభమైన గ్రామ పొంగళ్లు



డప్పు విన్యాసాలతో వెళ్తున్న రైతులు

అద్దంకి టౌన్: వర్షం కోసం రైతులు చేసే గ్రామ పొంగళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలోని దక్షణి అద్దంకి, కొంగపాడు, వేలమూరిపాడు గ్రామాలకు చెందిన రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలతో నీళ్లను ర్యాలీగా డప్పు విన్యాసాలతో స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పులగాపన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ వేడుకలు జరుగుతాయని, వర్షాలు పడి పంటలు పండి అందరూ బాగుండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతులు తెలిపారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

సంతమాగులూరు : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని తహసీల్దార్ కాంతారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పుట్టావారిపాలెం, కామేపల్లి గ్రామాల్లో ప్రజాసాధికార సర్వేపై గ్రామసభలు నిర్వహంచారు. నివేశన స్థలాలు, పక్కా గృహాలు లేని వారిని గుర్తించి వాటిని మంజూరు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, బాదినేని చిన్న తిరుపతయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - ఫిదా
శ్రీరామ - నక్షత్రం
మినీ విఎన్ఎస్ - గౌతమ్‌నంద

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - నక్షత్రం

వాడరేవులో జెట్టీ నిర్మాణం జరిగేనా?

● పరిశీలనకే పరిమితం ● మత్స్యకారులకు తప్పని తిప్పలు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

చీరాల : వాడరేవు సముద్రతీరం సమీపంలో జెట్టీ ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు ప్రకటించి సంవత్సరాలు గడుస్తోంది. పాలకులు మారుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని జెట్టీ నిర్మాణం జరగటం లేదు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తమ బోట్లను తీరంలో నిలిపేందుకు అనువుగా జెట్టీ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. లేదంటే విపత్తుల సమయంలో గుంటూరు జిల్లా నిజాంపట్నం తీరానికి వెళ్లి లంగర్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో మత్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీనమహోత్సవం కార్యక్రమం చీరాల మండలం వాడరేవు తీరంలో జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మత్స్యకారుల విన్నపం మేరకు జెట్టీ ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చారు. ఆ తరువాత జెట్టీకి సంబంధించి బెంగళూరుకు చెందిన అధికారుల బృందం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైయ్యాక జెట్టీ నిర్మాణానికి సంబంధించి పరిస్థితులను అధ్యయనం చేసింది. సముద్రంలో కొంతమేర ప్రయాణం చేశారు. ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను అధ్యయనం చేశారు. ఇది జరిగి కూడా సంవత్సరం గడుస్తోంది. అయితే జెట్టీ నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు, తుఫాన్లు సమయం కావడంతో వేట సాగదు. ఆ సమయంలో బోట్లు లంగర్లు వేసేందుకు జెట్టీ ఉంటే ఎంతో ఉపయోగం. అయితే జెట్టీ లేకపోవటంతో పక్కనున్న మురుగుకాలువకు లేదా నిజాంపట్నం తీరానికి వెళ్లి లంగర్లు వేస్తున్నారు. వర్షాలకు ముందు జెట్టీ నిర్మాణం జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్న గంగపుత్రుల కల కలగానే మిగులుతోంది. జెట్టీ ఏర్పాటు జరిగితే కేవలం బోట్లు లంగర్లు వేసేందుకు మాత్రమే కాక మత్స్యసంపద విక్రయాలకు గిరాకీ పెరుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తుంటారు. పోటీ పెరుగుతుంది. దీంతో వేటాడిన మత్స్యసంపదకు దళారులు, వ్యాపారులు సిండికేట్ అయి ధరలను నియంత్రించే పరిస్థితికి చెక్ పడుతుంది. వాడరేవు తీరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తీరం వెంట వేసిన తారురోడ్డుతో పర్యాటకుల రాకపోకలకు అనుకూలంగా మారింది. అతిథిగృహాలు కూడా పెరిగాయి. ఈ క్రమంలో జెట్టీ లేదా మినీ హార్బర్ ఏర్పాటు జరిగితే అటు మత్స్యకారులకే కాక పంచాయతీకి ఆదాయం కూడా పెరుగుతోంది. ఇప్పటికే వాడరేవు రోడ్డులోని కీర్తివారిపాలెం వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. వాహనాల నుంచి వసూలు చేసిన రుసుంతో తీరం, పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. జెట్టీ అనేది మత్యకారుల దీర్ఘకాల కల. ఆ కల సాకారం చేయమని కడలి పుత్రులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.



తీరంలో నిలిపిన బోట్లు

నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆమంచి

చీరాల : నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ చురుగ్గా పని చేస్తున్నారు. శుక్రవారం మంత్రి ఆదినారాయణ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆమంచి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం పనిచేస్తున్నారని ఆమంచి ప్రజలకు తెలియజేశారు. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో చీరాల నుంచి వెళ్లిన ఎమ్మెల్యే ఆమంచి అనుచరులు పాల్గొన్నారు.



మంత్రి ఆదినారాయణరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆమంచి

ఖాళీ కొబ్బరిబోండాలను నాలుగు ముక్కలుగా చీల్చాలి : కమిషనర్

చీరాల : "డెంగ్యూలాంటి జ్వరాలు దోమపోటు ద్వారా వ్యాపిస్తాయి. ఆ దోమలు ఎక్కువగా ఖాళీ కొబ్బరిబోండాలు, టైరు ముక్కలు లాంటి వాటిలో నిల్వ ఉన్న నీటిలో ఉత్పత్తి అవుతాయి. అందువల్ల ఖాళీ కొబ్బరిబోండాలను నాలుగు ముక్కలుగా చీల్చాలి" అని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం కొబ్బరిబోండాల విక్రయదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా కొబ్బరిబోండాలు చీల్చకుండా ఉండటం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. నిబంధనలు పాటించని విక్రయదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలిథిన్ కవర్లు, ఇతర వ్యర్థాలకు సంబంధించిన వారితో సమావేశం నిర్వహించి వారికి కూడా తగిన సూచనలు చేసి పారిశుధ్యం మెరుగుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో -279ను వెంటనే రద్దు చేయాలి

చీరాల : కార్మికుల హక్కులు, భద్రతను కాలరాసే విధంగా ఉన్న జీవో నెం 279ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎన్.బాబూరావు డిమాండ్ చేశారు. శుక్రవారం చీరాల మున్సిపల్ కార్యాలయ కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మానవహారంగా ఏర్పడ్డారు. జీవో నెం.279ను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు ఆర్.రామిరెడ్డి, మున్సిపల్ కార్మికసంఘాల ప్రతినిధులు అరుణ్‌కుమార్, సింగయ్య, ఇజ్రాయేల్, మోషే, వంశీ, పద్మ, మార్తమ్మ, విజయమ్మ, సంధ్య, మతీషా తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా మున్సిపల్ కార్మికులు

మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ

చీరాలరూరల్ : బుర్లవారిపాలెం గ్రామానికి చెందిన డక్కుమళ్ళ రమేష్ కుటుంబసభ్యులకు రూ.5వేల చెక్కును చీరాల ఎంపీడీవో కార్యాలయంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో రమేష్ మృతి చెందగా అతని కుటుంబసభ్యురాలు మాధవికి చంద్రన్నభీమా పథకం ద్వారా నగదు అందజేశారు. ఈ సందర్భంగా వెలుగు అధికారి వెంకటస్వామి మాట్లాడుతూ ఏదైనా కారణం చేత మరణం సంభవిస్తే ఏడు రోజులలోపు మరణ ధృవీకరణపత్రం అందించటం వల్ల బీమా మొత్తం త్వరగా అందజేయగలుగుతామని అన్నారు. కార్యక్రమంలో నాగరత్నం పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వెంకటస్వామి

ఎయిడెడ్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్సీ యండపల్లి

చీరాలరూరల్ : ఎయిడెడ్ పాఠశాలల్లోని పలు సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం చీరాలలోని సాయికృష్ణా రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. అన్ని జిల్లాల్లో బదిలీలు సక్రమంగా జరుగుతున్నాయని కేవలం ఒక్క ప్రకాశం జిల్లాలో మాత్రం ఛైర్మన్‌కు అనుకూలంగా ఉన్న వారికే మేలు జరుగుతోందని ఆయన విమర్శించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ యాక్ట్‌లో అనేక అవకతవకలున్నాయని, వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్నభోజన పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని, విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్న ప్రభుత్వ తీరు మారాలని, లేకుంటే ఉద్యమాలు జరుగుతాయని యండవల్లి హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాచిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీఈవో పనితీరు సరిగా లేదన్నారు. రూల్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలన్నారు. ఈ విధానం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్ళలేరని, కేవలం కార్పొరేట్ విద్యా సంస్థలకు మాత్రమే ఉపయోగం చేకూర్చేలా ఉందని విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలు కొనసాగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు డి.వీరాంజనేయులు, కుర్రా రామారావు, కుర్రా శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ కె.వీరాంజనేయులు, సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యండపల్లి

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	- ఫిదా
సంగం	- గౌతమ్‌నందా
సాయిప్యాలెస్	- నక్షత్రం
శాంతి	- దర్శకుడు

చేపలవేటలో మత్స్యకారుల మధ్య ఘర్షణ

చీరాలటౌన్ : చేపలవేటలో తలెత్తిన వివాదం మత్స్యకారుల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన వాడరేవులో గురువారం రాత్రి జరిగింది. చీరాలరూరల్ పోలీసుల కథనం ప్రకారం కొండా కాశీరావు మరికొందరు చేపలవేటకు బోటులో సముద్రంలోకి వెళ్లి తిరిగి రాత్రి 10.30గంటల సమయంలో బయటకు వచ్చారు. అయితే చేపలు తక్కువగా పడటంతో కొండా కాశీరావు అసంతృప్తి వ్యక్తం చేశాడు. దీంతో వాగ్వాదం జరిగింది. మూకుమ్మడిగా మిగిలిన వారంతా కాశీరావుపైదాడికి దిగారు. బండరాయితో తలపై మోది విచక్షణరహితంగా కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు బిక్కి కాశీరావు, కనకారావు, నాగేశ్వరరావు, మంగ, నర్సి, సత్తి తదితరులపై కేసు నమోదు చేశారు.

కారు,ఆటో ఢీ

చీరాల టౌన్ : కారు, ఆటో ఢీకొన్న సంఘటన చీరాల మండలం ఓడరేవు మార్గంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వాహనదారులు ఇరువురు చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

చీరాలరూరల్ : ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలందించిన గవిని నాగేశ్వరరావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం చీరాల అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సన్మానసభకు పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అత్యున్నత శిఖరాలు అందిపుచ్చుకోవడం నాగేశ్వరరావుకే సొంతం అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ విద్యనేర్పడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చడంలో నాగేశ్వరరావు ముందుండేవారన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, పి.రమణారెడ్డి, డి.వీరాంజనేయులు, వీరారెడ్డి, చెంచయ్య, భవనం శ్రీనివాసరెడ్డి, అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యండపల్లి

అమ్మవారికి ప్రత్యేకపూజలు



జలబిందెలతో ప్రదిక్షణలు చేస్తున్న భక్తులు

చీరాలరూరల్ : విఠల్‌నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాళీమాతా వేషధారణలో చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ఆలయప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వరలక్ష్మీపూజలతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కమిటీ సభ్యులు తన్నీరు అంకమ్మ, మర్రిపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉమామహేశ్వర అగ్రహారం (ముండ్లమూరు) : మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో పారిశుధ్య పనులను ఈవోఆర్డీ బి.చూడామణి శుక్రవారం పరిశీలించారు. వీధుల్లో మురికి నిలబడి ఉందని, దీని వల్ల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉండటంతో ముందు జాగ్రత్తగా చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి పంచాయతీలో ఇంటిని జియోట్యాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆమె వెంట కార్యదర్శులు రమేష్, చంద్రశేఖరరావు ఉన్నారు.

అబ్దుల్ ఖలీల్‌కు నివాళులు

దొనకొండ : రైల్వే విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తూ గురువారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి మృతిచెందిన షేక్.అబ్దుల్‌ఖలీల్‌కు పలువురు నివాళులు అర్పించారు. స్వగృహంలో ఉన్న ఆయన మృతదేహాన్ని శుక్రవారం ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ, శివకోటేశ్వరరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మగ్బూల్ అహమ్మద్, మాజీ జడ్పీటీసీ పులిమి రమణాయాదవ్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ముసామియా పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సి సహకారాన్ని త్వరంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- 108 వాహనానికి నోచుకోని దొనకొండ మండలం
- సకాలంలో వైద్యం అందక క్షతగాత్రుల అవస్థలు
- గ్రామీణ ప్రజలకూ తప్పని ఇబ్బందులు
- మంత్రి శిద్దా సిఫారసు చేసినా స్పందించని అధికారులు

దొనకొండ : మండలానికి 108 వాహనం కేటాయించకపోవడంతో అత్యవసర వైద్యం అందడం లేదు. గ్రామాల్లోని ప్రజలకు సకాలంలో చికిత్స గగనంలా మారింది.

జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు 108 వాహనాల ఉన్నాయి. దొనకొండ మండలం మాత్రం కొన్ని ఏళ్లుగా వాహనానికి నోచుకోవడం లేదు. 108ని ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదనే ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలో 108 వాహనం ఏర్పాటు కోసం రెండేళ్లుగా ప్రజలు మంత్రి శిద్దా రాఘవరావు ద్వారా అధికారులకు తెలియజేసినా ఎటువంటి ప్రయోజనం రాలేదు.

మండలంలోని 18 గ్రామ పంచాయతీల ప్రజలు ప్రమాద బారిన పడిన సమయాల్లో సకాలంలో వైద్యశాలలకు చేరుకోలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రధానంగా దొనకొండ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగే ప్రమాదాల్లో.. రైళ్లల్లో వెళుతూ గుండెపోటుకు గురైన ప్రయాణికులను ఆస్పత్రికి చేర్చేందుకు కురిచేడు, దర్శి, కొనకనమిట్ల తదితర ప్రాంతాల నుంచి 108 వాహనం వచ్చేలోపు వైద్యం అందక తనువు చాలిస్తున్నారు. దీంతో వచ్చిన వాహనాలు వెనుదిరిగిన సందర్భాలు ఎన్నో.

ఇప్పటికైనా అధికారులు దొనకొండలో 108 వాహనం అవస రాన్ని గుర్తించి, ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్వ్యూ

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ఎస్.సత్యం ఇంచార్జి ఎంపీడీవో, తాళ్లూరు

ప్రశ్న : మండలంలోని మరుగుదొడ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: అన్ని గ్రామాలను గ్రీన్ చానల్‌లో పెట్టడం జరిగింది. నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రామభద్రాపురంలో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లోనూ పూర్తి చేసేందుకు దృష్టిపెట్టాం.

ప్ర: పారిశుధ్యం కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు.

జ: కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి శనివారం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించి దోమలను నివారిస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందిగా?

జ: భూగర్భ జలాలు అడుగంటినందున బోర్లు వేసినా నీరు పడటం లేదు. పాడైన బోర్లను రిపేర్లు చేయిస్తున్నాం. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. సమస్యలను తెలియజేస్తే వెంటనే చర్యలు చేపడతాం.

ప్ర: ఉపాధి పనులు నత్తనడకన జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి?

జ: ఉపాధి సిబ్బంది కొరత వల్ల పనులు సక్రమంగా నిర్వహించలేక పోతున్న మాట వాస్తవం. గ్రామాల్లో 100 రోజుల పూర్తయిన కూలీలకు పనులు కల్పించలేకపోతున్నాం. త్వరలో సిబ్బంది నియామకాలు జరుగుతాయి. కూలీలందరికీ పనులు కేటాయిస్తాం.

– తాళ్లూరు

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

● డీవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పిచ్చయ్య



కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ నాయకులు

దర్శి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా పాలకులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని డీవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ పిచ్చయ్య విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోనికి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించినందుకు నిరసనగా ఈ ఆందోళన చేపట్టినట్టు వివరించారు. దర్శి నియోజకవర్గ నుంచి అధికసంఖ్యలో నిరుద్యోగులు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్.జేస్ పాల్, సందు సాయివెన్నెల, సందు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గృహ కల్పనే ప్రభుత్వ ధ్యేయం

● డీఈ బాలకృష్ణ

తాళ్లూరు : నిరుపేదలకు గృహాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని గృహ నిర్మాణశాఖ డీఈ పి.బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం తాళ్లూరులోని శిద్దా రాఘవరావు నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎన్టీఆర్ ఎస్సీ కాలనీలోని గృహ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ నిర్మాణానికి రూ. 95 వేలు రాష్ట్ర ప్రభుత్వం, రూ. 55 వేలు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. మంత్రి శిద్దా రాఘవరావు తాళ్లూరు ఎస్సీ కాలనీ వాసులపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచి, 60 మందికి నివేశనస్థలాలతో పాటు గృహాలు మంజూరుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం 24 మందికి గృహాలు మంజూరయ్యాయని, మిగిలిన వారికి త్వరలో కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. లేఅవుట్ కాలనీగా గుర్తించిన గృహ నిర్మాణాలతో పాటు ప్రత్యేక వసతులకు నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత గృహాలు నిర్మిస్తున్నదన్నారు. మంత్రి శిద్దా ఎస్సీలపై ప్రత్యేక శ్రద్ధచుపుతున్నారని, రానున్న కాలంలో టీడీపీ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ సూర్యప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ హనుమంతరావు, టీడీపీ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, అనపర్తి సుబ్బారావు, ఆదామ్,లక్ష్మయ్య పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న హౌసింగ్ డీఈ బాలకృష్ణ

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి



ఎంఆర్ వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ సరళాదేవి

దర్శి : పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ సరళాదేవి సూచించారు. శుక్రవారం పట్టణంలోని కిజిఐ పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాలు లోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయాలన్నారు. రూబెల్లా, మీజిల్స్ సోకకుండా ఈ వ్యాక్సిన్ దోహదపడుతుందన్నారు. మండలంలో 94 శాతం మంది విద్యార్థులకు వ్యాక్సిన్ అందించినట్లు స్థానిక వైద్యాధికారులు ఆమెకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్, ఎంపీహెచ్ఈవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కురిచేడులో చిరుజల్లులు

కురిచేడు : కురిచేడులో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి పిడుగు పడే అవకాశం ఉందని స్థానికులకు సెల్‌ఫోన్‌లో మేసేజ్ వచ్చాయి. దీంతో అంతా అప్రమత్తమయ్యారు.

సామూహిక సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో ఫణిరాజకుమారి

తాళ్లూరు : మండలంలోని లక్కవరం, తుకపాలెం గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కేవీ ఫణిరాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. పుట్టగానే బిడ్డకు ముర్రుపాలు పట్టడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పికపుడు ఆరోగ్య జాగ్రత్తలపై బాలింతలకు, గర్భిణులకు అవగాహనకల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణాదేవి , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ దేవాలయానికి శిద్దా విరాళం

రమణారెడ్డిపాలెం (ముండ్లమూరు) : మండలంలోని వేముల గ్రామ పంచాయతీలోని రమణారెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రతిష్ట మహోత్సవం జరుగనున్న సందర్భంగా అన్నదానానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక మంత్రి శిద్దా రాఘవరావు రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. నగదును శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు మాజీ ఎంపీపీ నూకతోటి కోటయ్యకు అందజేశారు. అన్నదానానికి సహకరించిన మంత్రి శిద్దాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.నాగమల్లీశ్వరి ఏడుకొండలరెడ్డి, భాస్కరరావు, కూడలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

ఆహ్వాన పత్రికల పంపిణీ



ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కురిచేడు : రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు షష్టిపూర్తి కార్యక్రమం ఈ నెల 11న జరుగనుంది. అందుకు సంబంధించి ఆహ్వాన పత్రికలను శుక్రవారం టీడీపీ మండల నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఎంపీపీ గడ్డం వెంకటరత్నమ్మ కోరారు. బయ్యావరం గ్రామంలోనూ పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.బాలయ్య, నాగిరెడ్డి, దాదా సాహెబ్, ఎన్.పెద్దిరెడ్డి, బొల్లేపల్లి ఆదినారాయణ, కాశీ, జి.గురునాథం, కిలారి కొండయ్య, అంకయ్య, మోషే, చంద్రారెడ్డి, బాదం సుబ్బారెడ్డి, ఎ.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

దర్శి : పట్టణ సమీపంలోని శ్రీ షిర్డి సాయిబాబా సేవా ఆశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం దర్శి పట్టణానికి చెందిన ఒగ్గు ఆదినారాయణ, లక్ష్మీప్రసన్న కుమారి దంపతులు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. లక్ష్మీప్రసన్న కుమారి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టా రు. ఆశ్రమ నిర్వాహకులు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

దర్శి

వెంకటేశ్వర	- పిదా
శ్రీనివాస	- దండుపాళ్యం-2
శివశంకర్	- గౌతమ్‌నంద
భాస్కర్	- డిజె

ముండ్లమూరులో మోస్తరు వర్షం

ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోత ఉంది. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై పదును వర్షం పడింది. మండల కేంద్రం ముండ్లమూరుతో పాటు పసుపుగల్లు, ఉల్లగల్లు, వేముల, ఈదర, బొప్పూడివారిపాలెం, పూరిమెట్ల అగ్రహారం, సింగనపాలెం, పోలవరం, శంకరాపురం గ్రామాల్లో వర్షం పడింది. ఇది పెసర, కంది, సజ్జ పంటలకు ఉపకరిస్తుంది.

రెస్టారెంట్లలో మద్యం సరఫరా చేస్తే కఠినచర్యలు



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్సై సుబ్రమణ్యం

దర్శి : రెస్టారెంట్లలో నిబంధనలు అతిక్రమించి మద్యం సరఫరా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.సుబ్రమణ్యం హెచ్చరించారు. పట్టణంలోని రెస్టారెంట్లను శుక్రవారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. కొద్దిరోజుల క్రితం ఓ రెస్టారెంట్‌లో మద్యం బాటిల్స్ పట్టుపడడంతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం బెల్ట్‌షాపులను, అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నివారించాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్సై తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారం చేసే వారిపై, సరఫరా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతి లేని రెస్టారెంట్లలో మద్యం సరఫరా చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విత్తనోత్పత్తి పథకాన్ని వినియోగించుకోవాలి

నూజిళ్ళపల్లి (ముండ్లమూరు) : గ్రామీణ విత్తనోత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌టీసీ ఏడీఏ పి.పూర్ణచంద్రరావు కోరారు. శుక్రవారం మండలంలోని నూజిళ్ళపల్లిలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారం కోసం పచ్చిరొట్టె పైర్లు అయిన జిలుగ, జనుము, పిల్లిపెసర పెంచుకోవాలని సూచించారు. ప్రతి రైతూ ఈ-క్రాప్ బుకింగ్‌లో పంట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందచ్చన్నారు. సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో జెడ్.శ్రీధర్, విస్తరణాధికారి కిషోర్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి మార్కింగ్

తాళ్లూరు : తాళ్లూరులో ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నిధులతో నిర్మించనున్న బస్ షెల్టర్‌కు శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. తాళ్లూరులో బస్ షెల్టర్ నిర్మించాలని జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి ఎంపీని కోరగా రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. మండల కాంప్లెక్స్ ప్రహరీ గోడకు ఆను కుని బస్‌షెల్టర్‌కు స్థలాన్ని కేటాయించేందుకు పంచాయతీ తీర్మానించింది. దీంతో నిర్మాణాకి ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.మోషే, జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, కో ఆప్సన్ సభ్యుడు కాలేషావళి, ఐ.వెంకటేశ్వరరెడ్డి, మండల ఏఈ ఆర్‌వీ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే ఆందోళన ఉధృతం

దర్శి : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి పురుషోత్తంరాజు హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 4వ రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్నప్పటికీ పాలకులు నిర్లక్ష్యవైఖరి అవలంబించడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పార్లమెంట్‌లో బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నూనె గాంధీ, రాష్ట్ర ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ సభ్యుడు టి.ఆల్‌ఫ్రెడ్, జిల్లా కోశాధికారి టి.శేషయ్య, ఎమ్మార్పీఎస్ దర్శి మండల శాఖ అధ్యక్షుడు గండి మోషే, గర్నిపూడి యోబు, మల్లెల ప్రభాకర్, కె.మార్కు, ఆర్.పేతురు, ఆర్. ఏసుదాసు పాల్గొన్నారు.

జగన్ వీధిరౌడీలా వ్యవహరిస్తున్నారు

- సీఎంపై అనుచిత వ్యాఖ్యలు శోచనీయం
- నంద్యాలలో టీడీపీ ఘన విజయం సాధిస్తుంది
- మాజీ ఎమ్మెల్యే పాపారావు



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి : ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వీధిరౌడీలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ నారపుశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కాల్చి చంపినా తప్పులేదని అనిపిస్తుందని నంద్యాల బహిరంగ సభలో జగన్ మాట్లాడటం ఆయన నేర ప్రవృత్తికి అద్దం పడుతుందన్నారు. లక్షల కోట్ల అవినీతికి పాల్పడి, కోర్టులు చుట్టూ తిరుగుతున్న వ్యక్తి నీతులు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ భాష, వ్యవహార శైలి మార్చుకోవాలని సూచించారు. దివంగత నేత భూమా నాగిరెడ్డి టీడీపీలో చేరిన తరువాత ప్రా రంభమైన అభివృద్ధి కార్యక్రమాలు దశల వారీగా జరుగుతున్నాయని చెప్పారు. వైసీపీ నంద్యాల ఎన్నికల్లో పోటీ పెట్టడడం వల్లే అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పడం హ్యాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వ ర్గాల అభ్యున్నతి జరిగిందన్నారు. రాష్ట్రం రూ.16వేల కోట్ల అప్పులో ఉన్నప్పటికీ ప్రతి నియోజకవర్గంలో వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చై ర్మన్ సూరె చినసుబ్బారావు, దర్శి సర్పంచ్ జీసీ గురవ య్య, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సంగా తిరుపతిరావు, రా ష్ట్ర కనీస వేతన సవరణ సంఘం డైరెక్టర్ శోభారాణి, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య, మాజీ అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మారెళ్ళ వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

- పలు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు
- అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు
- మొక్కులు చెల్లించి, నోములు నోచుకున్న మహిళలు



దొనకొండలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



పెదఉల్లగల్లు వెంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న దృశ్యం

దొనకొండ : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గల ఆనంద ఆశ్రమంలో ధర్మ కర్త భైరవ ఆనందస్వామి నేతృత్వంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీదేవి అమ్మవారుకు పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పుష్పపూజ, లలితా సహస్రనామ పూజ, కుంకుమార్చన, విశేషపూజలు చేపట్టారు. గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త అమ్మవారి నైవేద్యం, తీర్థప్రసాదాలను అందజేశారు. వినుకొండకు చెందిన కడియాల ఆంజనేయశాస్త్రి, విశ్వహిందు పరిషత్ సభ్యుడు నల్లా వెంకటరెడ్డి వత్రం గురించి వివరించారు.

భైరవ ఆనందస్వామిగా నామకరణం..

ఆనంద ఆశ్రమం, బ్రహ్మేంద్రస్వామి దేవాలయాల ధర్మకర్త కాకర్ల అంజిరెడ్డి స్వామికి భైరవ ఆనందస్వామిగా నామకరణం జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా ఒంగోలు అచితానంద ఆశ్రమంలో పరిపూర్ణ శిద్దానందస్వామి నేతృత్వంలో నామకరణంలో మార్పు చేశామని, ఇకపై భైరవ ఆనంద స్వామిగా కొనసాగనున్నట్లు ఆలయ నిర్వాహకులు వివరించారు.

ముండ్లమూరులో

ముండ్లమూరు : మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఉత్సాహంగా జరిగాయి. పెద ఉల్లగల్లు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెద ఎత్తున్న మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారు. మారెళ్ళ, ఈదర, పసుపుగల్లు, ముండ్లమూరులోని దేవాలయాల్లో వ్రతాలు నిర్వహించారు. శివాలయాల్లో ఉన్న భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

దర్శిలో..

దర్శి : దర్శిలో వరలక్ష్మీ వ్రతం వేడుకులు శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని కనకదుర్గమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో మహిళలు వ్రతాలు చేశారు. పరస్పర తాంబూళాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

నాగంబొట్లపాలెంను సందర్శించిన ఎంపీడీవో

తాళ్లూరు : మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో సానికొమ్ము సత్యం, ఈవోఆర్డీ ఎం.నాగభూషణరావు శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. రోడ్డు వెంబడి పేడ దిబ్బలు, నీరు నిల్ల ఉండటాన్ని గమనించిన ఎంపీడీవో వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. వీధుల్లో బ్లీచింగ్, ఫినాల్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యసిబ్బందికి సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఈవోఆర్డీ

ఎంఆర్ టీకా తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణి డాక్టర్ సరళాదేవి

ముండ్లమూరు : తట్టు, రూబెల్లా వ్యాధులు రాకుండా ఉండేందుకు ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణి కె.సరళాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఆర్ టీకా రిజిష్టర్‌ను పరిశీలించారు. లక్ష్యాన్ని నూరుశాతం పూర్తిచేయాలని వైద్యాధికారి కమలను ఆదేశించారు. సిబ్బంది ప్రతీ పాఠశాలకు వెళ్లి వ్యాక్సిన్ వేయాలన్నారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. మండలం లో 8041 మంది లక్ష్యం కాగా ఇప్పటికి 2221 మందిరి వ్యాక్సిన్ వేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.బాలస్వామి, సీహెచ్‌వో నరసింహారావు, ఫార్మసిస్ట్ యుగంధర్, స్టాప్ నర్సు ఉషారాణి పాల్గొన్నారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రధానోపాధ్యాయుల సమావేశం జరుగునని ఇన్‌ఛార్జ్ ఎంఈఓ టిఎల్ కాంతారావు తెలిపారు. ఆ సమావేశానికి హాజరయ్యే ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, విద్యార్థుల నమోదు వివరాలు తప్పనిసరిగా తీసుకొని రావాలని ఆయన తెలియజేశారు.

రెగ్యులర్ మ్యాట్రిన్ లేక విద్యార్థినుల ఇక్కట్లు

లింగసముద్రం: లింగసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహానికి రెగ్యులర్ మ్యాట్రిన్ లేకపోవడంతో విద్యార్థినులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ వసతి గృహానికి మ్యాట్రిన్‌గా విధులు నిర్వహిస్తున్న టి.ఈశ్వరమ్మను గత నెలలో అధికారులు కందుకూ రులోని బాలికల వసతిగృహానికి బదిలీ చేసి ఆమెనే లింగసముద్రం బాలికల వసతి గృహానికి ఇన్‌ఛార్జ్ మ్యాట్రిన్‌గా నియమించారు. దీంతో ఇన్‌ఛార్జ్ మ్యాట్రిన్‌గా ఉన్న ఈశ్వరమ్మ వారానికి రెండు మూడు రోజులు పగలు సమయాల్లో వసతి గృహానికి వచ్చి వెళుతోంది. దీంతో రాత్రి వేళల్లో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో వసతి గృహంలోని విద్యార్థినులు కొందరు దగ్గరలోని తమ ఇళ్లకు రాత్రి సమయంలో వెళ్ళి మరుసటి రోజు ఉదయం వసతి గృహానికి వస్తున్నట్లు తెలిసింది. అలాగే మరికొందరు విద్యార్థినులు తమ ఊర్లకు వెళ్ళి మూడునాలుగు రోజులపాటు ఇళ్ళవద్దే ఉంటున్నారు. దీంతో హస్టల్‌లో ఉండే విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉంటుందని తెలుస్తోంది. వసతి గృహంలో ప్రస్తుతం విద్యార్థినుల సంఖ్య 100కు పైగా ఉందని సిబ్బంది చెబుతుండగా అక్కడ ఉండే విద్యార్థినుల హాజరు తక్కువగా ఉంది. రెగ్యులర్ మ్యాట్రిన్ లేకపోవడంతో విద్యార్థినులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఇళ్ళకు వెళుతున్నారు. దీనికి తోడు వసతి గృహంలో వంట మనిషి పోస్టు గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ఖాళీగా ఉంది. దీంతో అటెండరు, వాచ్‌ఉమెన్‌లు వంటలు వండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

గత ఏడాది విద్యార్థినులు 70 మంది లేరనే కారణంతో బాలికల వసతి గృహాన్ని మూసివేయాలని ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు తగిన చొరవ చూపి ప్రభుత్వంలోని పెద్దలను కలిసి వసతి గృహం మూసివేతకు గురైతే బాలికలు ఇబ్బందులకు గురౌ తారని వివరించి వసతి గృహాన్ని మూసివేయకుండా కృషి చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెగ్యులర్ మ్యాట్రిన్‌ను నియమించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



లింగసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహం

10న విద్యాసంస్థల బంద్‌ని జయప్రదం చేయండి

కందుకూరు : విద్యారంగ సమస్యల పరిష్కారం, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించతలపెట్టిన బంద్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్ కోరారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం కందుకూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో వినోద్ పాల్గొని మాట్లాడుతూ విద్యారంగంలో అనేక సమస్యలున్నా, వాటిని పరిష్కరించాలని అనేక ఆందోళనలు చేసినా ప్రభుత్వం కనీసం స్పందించటం లేదని విమర్శించారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్. ఓబుల్ రెడ్డి, నాయకులు బ్రహ్మారూప్, అనిల్, జక్రయ్య, ప్రేమ్‌స్వరూప్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుడ్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలామృతం పథకం అందరూ సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు అన్నారు. మండలంలోని చెమిడితపాడులో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. కేంద్రాలలో ఏర్పాటు చేసిన అన్నప్రసన్నం, సీమంతాలు కార్యక్రమాలను ఎమ్మెల్యే తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలా అమృతం పథకం ద్వారా లభించే పాలు, కోడిగుడ్లను అర్హులైన గర్భవతులు, బాలింత మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాళ్ళపాడులోకి కొద్దిగా చేరిన నీరు

● **పథకానికి నెలరోజులపాటు సరిపోయే అవకాశం**

లింగసముద్రం: గడిచిన నాలుగైదు రో జుల నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షా లకు రాళ్ళపాడు ప్రాజెక్టులోకి కొద్దిగా నీరు చేరింది. ఈ వర్షానికి ప్రాజెక్టు లోని గుంతలు నిండి గేట్ల సమీపానికి నీరు వచ్చింది. ఈ నీరు ఒక అడుగు మేర ఉండవచ్చని ప్రాజెక్టు అధికారులు తెలియజేస్తు న్నారు. ఇటీవల వర్షాలు లేక ప్రాజెక్టులో నీరు అడుగంటిపోవడంతో రాళ్ళపాడు-రోళ్ళపాడు మం చినీటి పథకానికి కూడా నీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రాజెక్టులోకి చేరిన నీరు సుమారు నెలరోజుల పాటు రాళ్ళపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి సరిపోయే అవకాశముందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలియజేస్తున్నారు.

రేపు బీసీ సంఘం ఆధ్వర్యంలో శిక్షణ

కందుకూరు : బీసీ సంఘం ఆధ్వర్యంలో సామాజిక న్యాయం అనే అంశంపై ఈనెల 6న స్థానిక శ్రీవిద్య హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం కన్వీనర్ ఇ. రాజేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. బిసిలు సామాజిక న్యాయం అనే అంశంపై ఉ. సాంబశివరావు శిక్షణ నిస్తారని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు జరిగే ఈ కార్యక్రమంలో బిసి మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొద్దిపాటి వర్షానికే మెయిన్‌బజార్ బురదమయం

గుడ్లూరు: కొద్దిపాటి నుకులకే గుడ్లూరు మెయిన్ బజారు బురదమయంగా మారింది. వాననీటితోటి మురుగునీరు కూడా కలిసి రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. మండలంలోని ప్రధాన రహదారి గాంధీబొమ్మ సెంటర్‌లో గ్రంధాలయం వీధి రెడ్డిపాలెం దగ్గర మురుగునీరు ప్రవహిస్తుంది. దీని వలన పాదాచారులు, వాహనదారులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. సైడు కాలువలలో మురుగునీరు పేరుకొనిపోయి నిల్వ ఉండడం వల్ల దోమలు విపరీతంగా పెరిగాయి. రోడ్డుమీద వాన నీరు మురుగునీరు ప్రవహించడంతో సైడు కాలువల్లో ఉన్న పూడిక వలన అధ్వాన్నంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పోతుల దృష్టికి తాగునీటి సమస్య

గుడ్లూరు: మండలంలోని చెమిడితపాడులో తాగునీరు, సాగునీరు సమస్యను పరిష్కారం చేయాలని చేవూరులో తాగునీరు సరఫరా చేయాలని కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు దృష్టికి గ్రామస్థులు తీసుకొచ్చారు. మండలంలోని చేవూరు, చెమిడితపాడు, పాజర్ల గ్రామాలలో ఎమ్మెల్యే పోతుల రామారావు శుక్రవారం పర్యటించారు. చెమిడితపాడు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే దృష్టికి వివిధ సమస్యల గురించి తెలియజేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఎలికేరు వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి గ్రామంలో ఉన్న దూలాల చెరువుకి సాగునీరు నింపాలని, రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామంలో అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసేందుకు నూతనంగా బోరుబావిని మంజూరు చేయాలని సర్పంచ్ చిట్టారి న్నమ్మాయి ఆమె భర్త మల్లిఖా ర్జున ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు నూత నంగా ప్రభుత్వ భవనాలు నిర్మిం చాలని వారు ఈ సందర్భంగా కోరారు. చేవూరులో ఏడాది కాలం పాటు పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్యకి శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. పాజర్లలో స్థానిక సమస్యలపై అర్జీలు ఎమ్మెల్యేకు సమర్పించారు. పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, సహకార సొసైటీ అధ్యక్షులు పూసపాటి సుబ్బరాజు, ఎంపిడిఓ శ్రీనివాసులు, పిఆర్‌జెఈ జయ రావు, ఇరిగేషన్ ఏఈ రమేష్, విద్యుత్ ఏఈ ఎస్‌కె రఫి, వెలుగు ఏపిఎం కృష్ణారావు, వ్యవ సాయ శాఖ ఏవో గీతాప్ర కాష్, సర్పంచ్ గద్దె సుందర్‌రావు, మాజీ సర్పంచ్ మేకపోతుల రాఘవులు, పువ్వాడి వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం ఉపాధి హామీ కార్యాలయం ముందు శనివారం ఉపాధిహామీ ప్రజావేదిక జరగనున్నట్లు ఏపిఓ సమీర్‌బాషా తెలిపారు. ఆ ప్రజావేదికలో గ్రామాలలో సామాజిక తనిఖీ అధికారులు ఉపాధిహామీ పనులపై చేసిన విచారణ వివరాలను వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ ప్రజావేదిక కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చునని తెలిపారు.

మన్నేరు, ఉప్పుటేరుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

● **తహసీల్దార్ వెంకటేశ్వరరావు**

లింగసముద్రం: మండలంలోని రాళ్ళపాడు మన్నేరు, పెదపవని ఉప్పుటేరుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ టి వెంకటేశ్వరరావు చెప్పారు. కందుకూరు ఆర్డీఓ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఎంపిడిఓ మహలక్ష్మి, ఎస్ఐ కె.కమలాకర్ అధికారులు, విఆర్‌ఓలతో ఇసుకపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు చేపట్టేందుకు తాను ఛైర్మన్‌గా ఎంపిడిఓ మహలక్ష్మి, కె.కమలాకర్ సభ్యులుగా ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మన్నేరు, ఉప్పుటేరు పరివాహక గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటీసి, జడ్పీటీసి, డ్వాక్రాగ్రూపులు తదితరులతో స్థానిక కమిటీలను నియమించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు దొరికితే జరిమానా విధించ డమే గాకుండా పోలీస్‌స్టేషన్‌కు స్వాధీనం చేసి కేసు నమోదు చేయించి కోర్టులో పెట్టడం జరుగుతుందన్నారు. రాత్రి వేళల్లో ఎట్టి పరిస్థితులలో మన్నేరులోకి వాహనాలు అనుమ తించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీని యర్ సహాయకులు పి.మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

వలేటివారిపాలెం: వలేటివారిపాలెంలోని పోస్టాఫీ స్ సెంటరు సమీపంలో ఈ నెల 1న మోటారుబైకు తగిలి ఒంగోలు ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొం దుతున్న రంతుసాహెబ్ శుక్రవారం మృతి చెందారు. రంతుసాహెబ్ మృతదేహాన్ని వలేటివారిపాలెం ఎస్ఐ వావిలాల సుబ్బా రావు సందర్శించి పోస్టుమార్టం ని మిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశా లకు తరలించి కేసు నమోదు చేశారు.

జగన్ పద్ధతి మార్చుకోవాలి

వలేటివారిపాలెం: రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రోడ్డుమీద కాల్చి చంపినా తప్పులేదని ప్రతిపక్షనేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభలో మాట్లాడడం మంచి పద్దతి కాదని మండలంలోని శింగమనేనిపల్లి సర్పంచ్ గరికపాటి సురేంద్ర మోహన్‌చౌదరి ఒక ప్రకటనలో ఖండించారు. జగన్ మాటలను వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. అలా మాట్లాడితే ప్రజలు కూడా క్షమించరని పేర్కొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కందుకూరు : పట్టణంలోని జనార్ధన కాలనీలోని ఎస్‌టి కాలనీ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు అమ్మ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజరు బివి రమణ నోటు పుస్తకాలను పంపిణీ చేయగా ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బివి రమణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థినీ విద్యార్థులకు వివిధ సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● సినిమాలు

కందుకూరు

రాజ్	- డీజే..దువ్వాడ జగన్నాధం
యువరాజ్	- నిన్నుకోరి
ప్రశాంతి	- నక్షత్రం
కోటేశ్వర	- దర్శకుడు
రాఘవ స్క్రీన్-1	- ఫిదా
రాఘవ స్క్రీన్-2	- గౌతమ్‌నంద

నేడు గుడ్లూరు మండలంలో ఎమ్మెల్యే పోతుల పర్యటన

గుడ్లూరు: మండలంలోని కొత్తపేట, స్వర్ణాజిపురం, గుండ్లపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే పోతుల రామారావు శనివారం పర్యటిస్తారని ఎంపిడిఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయా గ్రామాలలో సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడటం. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే చర్చిస్తారని ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులంతా సంబంధిత పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

మూడు రోజులలో నీటి సరఫరాకు చర్యలు

లింగసముద్రం:రాళ్ళపాడు రోళ్ళపాడు మంచినీటి పథకం ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు రెండు మూడు రోజులలో ప్రాజెక్టు లోతట్టు భాగంలో ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేస్తున్నట్లు కందుకూరు ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ వేణుగోపాల్‌రావు చెప్పారు. శుక్రవారం ఆయన మన్నేరులోని రాళ్ళపాడు-రోళ్ళపాడు మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రాళ్ళపాడు ప్రాజెక్టులోని ప్రస్తుత నీటిమట్టాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రాజెక్టులోని నీరు ఆయిల్ ఇంజన్లకు అందకపోతుండడంతో ఇంజన్లు తొలగించినట్లు చెప్పారు. నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలకు ప్రాజెక్టులోకి అడుగు మేర నీరు చేరిందని తెలిపారు. ఈ నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా మంచినీటి పథకం బావి వద్దకు తరలించేందుకు జిల్లా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోనున్నట్లు చెప్పారు. వాక మళ్ళవారిపాలెం ఆనకట్ట ఎదురుగా ఉన్న రాళ్ళపాడు- రోళ్ళ పాడు మంచినీటి పథకం పైపుల పనులను ఆయన పరిశీలించారు. డీఈ వెంట ఏఈ రవిచంద్రకుమార్, మంచినీటి పథకం నిర్వాహకులు కిలారి మాధవరావు ఉన్నారు.

నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

లింగసముద్రం: మండలంలో అన్ని గ్రామాలలో ఈ నెలాఖరు లోపు మరుగుదొడ్లు నూరుశాతం నిర్మించుకునేలా ఉపాధిహామీ సిబ్బంది కృషి చేయాలని ఎంపిడిఓ వై మహలక్ష్మి చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలాన్ని బహిరంగ మలవిసర్జన లేని మండలంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఉపాధిహామీ కూలీలకు ప్రతిరోజూ 155 రూపాయలు కూలీ వచ్చేలా పనులు చేయించాలని ఏపిఓ నాగరాజుకు సూచించారు. గృహనిర్మాణాల లబ్దిదారులు కూడా తప్పనిసరిగా తమకు మం జూరైన ఇళ్ళను నిర్మించుకోవాలన్నారు.

జనార్ధనస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

కందుకూరు : స్కంధపురి జనార్ధన స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇఓ ఎన్.నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆ లయ పూజారి శ్రీనివాస దీక్షితులు, ఇతర పూజారులు సాంప్రదాయంగా శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి రాజ్యలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ


సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


రాజ్యలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం

మాసంలో పవిత్రమైన సోమవారం సం దర్భంగా ఈనెల 7న జనార్ధన స్వామి ఆలయంలో సుదర్శన హోమం కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తామని, ఈనెల 15న శ్రీకృష్ణాష్టమి పండుగ వేడుకలను ఆలయంలో ఘనంగా నిర్వహిస్తామని, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇఓ నారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వలేటివారిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతం పండుగను ఎంతో వైభవంగా జరుపుకున్నారు. మహిళలు వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానాలు చేసి కొత్తబట్టలు ధరించి అమ్మవార్ల దేవాలయానికి వెళ్లి ఎంతో భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. వరలక్ష్మివ్రతం రోజు అమ్మవార్ల దేవాలయాలకు వెళ్ళి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని మహిళా భక్తుల నమ్మకం. అంతేగాక వరలక్ష్మి వ్రతం రోజు మహిళలు బంగారు వస్తువులు కొని తమ మంగళసూత్రంలో వేసుకుంటే తమ భార్యపిల్లలతో కలిసి సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని మహిళా భక్తుల విశ్వాసం

లింగసముద్రం: మండలంలో వరలక్ష్మివ్రతం భక్తిశ్రద్దలతో నిర్వహించారు. లింగసముద్రంతో పాటు పలు గ్రామాలలో మహిళలు దేవాలయాలను సందర్శించి తమ కుటుంబాలు, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి అమ్మవారు తమను చల్లగా చూడాలని ఆకాంక్షించారు.

కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ముప్పాళ్ల

కందుకూరు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. కందుకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సిపిఐ ప్రకాశం జిల్లా శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ కార్యక్రమం ఆపార్టీ జిల్లా కార్యదర్శి కె.అరుణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆర్.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. గో రక్షణ పేరుతో ఆర్ఎస్ఎస్, బిజెపి, భజరంగదళ్ శక్తులు మతోన్మాదులుగా మారి దళితులపై దాడులు చేస్తు న్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఈ దాడులలో 28 మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఏకపక్షంగా నియంతలాగా వ్యవహరిస్తున్నారని ప్రజాభిప్రాయానికి ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. అరుణ, ఆపార్టీ నాయకులు ఎస్.రావమ్మ, వలేటి రాఘవులు, కుర్రా వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ గృహ నిర్మాణ పథకం పెద్ద కుంభకోణం

కందుకూరు : ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పేరుతో పట్టణాలలో పేదలకు ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన జి ప్లస్ 3 గృహ సముదాయాల పథకం పెద్ద కుంభకోణమని, ఈ పథకంలో లబ్దిదారులకు తీరని నష్టం జరుగుతుందని కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తూమాటి మాధవరావు విమర్శించారు. శుక్రవారం ఆయన కందుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహాల నిర్మాణానికి అయ్యే వాస్తవ ఖర్చుకి రెట్టింపు అంచనా ప్రభుత్వం చూయిస్తూ కొంత రాయితీ, మిగిలినది బ్యాంకు రుణం అని చెబుతున్నందున లబ్దిదారులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు సమిష్టి కృషి చేయాలి : ఆర్డీఓ


మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లిఖార్జునరావు

కందుకూరు : మన్నేరు, పాలేరుల నుండి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవిన్యూ, పోలీసు, పంచాయితీ అధికారులు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఆర్డీఓ జి.మల్లిఖార్జునరావు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కందుకూరు డిఎస్పి కె. ప్రకాశరావుతో కలిసి ఆయన శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కందుకూరు, సింగరాయకొండ సర్కిళ్లలోని పోలీసు అధికారులు, రెవిన్యూ అధికారులతో పాటు ఎంపిడిఓలు, ఇఓ ఆర్‌డిలు, ఎక్సైజ్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కందుకూరు ప్రాంతంలో మన్నేరులో దారకానిపాడు, ఉలవపాడు మండలం కె.రాజుపాలెంలో మాత్రమే అధికారిక రీచ్‌లు ఉండగా పాలేరులో కె. బిట్రగుంట వద్ద అధికారిక రీచ్ ఉన్నదని తెలిపారు. ఇక్కడ కాకుండా మరెక్కడా ఇసుక తరలిస్తున్నా, ఎక్స్‌కవేటర్లు, ఇతర యంత్రాల సహాయంతో ఇసుక తవ్వుతున్నా, లారీలలో ఇసుకను తరలిస్తున్నా అటువంటి వారిపై సమిష్టిగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. కందుకూరు ప్రాంతంలో బెల్ట్‌షాపుల నిరోధానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కందుకూరు, సింగరాయకొండ సిఐలు కె. నరసింగరావు, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎవేన్ కంపెనీతో 'ప్రకాశం' ఎంఓయూ


సోలార్ పని విధానంపై పరిశీలిస్తున్న విద్యార్థులు

కందుకూరు : సోలార్ తదితర సాంప్రదాయేతర ఇంధన వనరుల కంపెనీ ఎవేన్‌తో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఒప్పందం చేసుకుంది. ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల డిప్లమో,ఇంజనీరింగ్ విద్యార్థులకు సాంకేతిక అభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఎవేన్, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీల మధ్య ఒప్పందం కుదిరినట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహి స్తున్న ఎవేన్ తమ కళాశాలలో ఇఇఇ, మెకానికల్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం అనం తరం ఈ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం ఇఇఇ, మెకానికల్ విభాగాలలో కళాశాల డిప్లమో, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎవేన్ కంపెనీ మూడు నెలల సర్టిఫికేషన్ కోర్సు ఇస్తుందని, ఈ కోర్సు అనంతరం కంపెనీ నిర్వహించే నైపుణ్య పరీక్షలో విజేతలుగా నిలిచిన వారికి కోర్సు సర్టిఫికేట్ ఇవ్వటంతో పాటు ఎవేన్‌కి సంబంధించిన సాంప్రదాయేతర ఇంధన వనరుల కం పెనీలలో ఉద్యోగం కల్పిస్తారని చెప్పారు. ఈ ఏడాది ఫైనలియర్ చదువుతున్న విద్యార్థుల లో ఈ ఒప్పందంలో భాగంగా కనీసం వంద మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఎవేన్ ప్రతినిధులు సం సిద్ధత వ్యక్తం చేశారని రామయ్య తెలిపారు. ఎవేన్ ప్రధానంగా తయారుచేసే సోలార్ దీపాల తయారీలో తమ కళాశాల విద్యార్థులను భాగస్వాములను చేస్తారని తెలిపారు. 10వేల రూపాయలు విలువజేసే సోలార్ దీపాల విడిభాగాలను వారు అందజేసి తమ విద్యార్థులు ఆ దీపాలను తయారు చేస్తే 20వేలకు కంపెనీ కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకున్నామని, తద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య, పరిశోధనలో భాగంగా ఆర్జించే అవకాశం కలుగుతుందని వివరించారు.

నేడు రాళ్లపాడు రిజర్వాయరుని సందర్శించనున్న ఐడీసీ జేడీ

కందుకూరు : నెల్లూరు జిల్లా చింతలదేవి వద్ద ఏర్పాటు చేస్తున్న కామధేను ప్రాజెక్టు కోసం రాళ్లపాడు ప్రాజెక్టు నుండి ఎత్తిపోతల పథకం ఏర్పాటుని రాళ్లపాడు ఆయకట్టు రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తరుణంలో ఐడిసి జాయింట్ డైరక్టర్, ఆ శాఖ ఇఇలు శనివారం ప్రాజెక్టుని సందర్శించనున్నారు. గురువారం విజయవాడలో కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు, మాజీఎమ్మెల్యే దివి శివరాంలు ఆయకట్టు కమిటీ ప్రతినిధులతో కలిసి మంత్రి దేవినేని ఉమని కలిసి ఎత్తిపోతల వద్ద రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టుకి, తాగునీటి పథకాలకు జరిగే నష్టాన్ని వివరించి కామధేను ప్రాజెక్టుకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లుకి ఉన్న అవకాశాలపై నివేదిక ఇవ్వాల్సిందిగా మంత్రి ఐడిసి అధికారులను ఆదేశించటంతో వారు పరిశీలనకు వస్తున్నారని రాళ్లపాడు ఆయకట్టు కమిటీ ఛైర్మన్ బబ్బూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఐడిసి అధికారులు పరిశీలన జరిపి రైతుల అభిప్రాయాలు సేకరించనున్నారు.

రేపు మాలపాడులో గడపగడపకు వైసీపీ

పొన్నలూరు: మండలంలోని మాలపాడు గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి గడపగడపకు వైసీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా బ్యాలెట్‌ను నిర్వహిస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరునెలల వయసు వరకు తల్లిపాలు ఇవ్వాలి

టంగుటూరు: బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ అన్నారు. ఐసీడీఎస్ శాఖ వారి టంగుటూరు, కందులూరు సెక్టార్ల తల్లిపాల వారోత్సవం శుక్రవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటకు ముర్రుపాలు తాగించాలన్నారు. ముర్రుపాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డను ఆరోగ్యంగా తీర్చిదిద్ది వారి పెరుగుదలలో తోడ్పాటు నందించాల్సిన బాధ్యత తల్లులదేనన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండే అంగనవాడీ కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలన్నా రు. టంగుటూరు, కందులూరు సెక్టార్ల సూపరవైజర్ వై.సంగీతలక్ష్మి మాట్లాడుతూ తల్లులు ఆరు నెలల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటుగా అదనపు ఆహారం అలవాటు చేయాలన్నారు. ఇంటి వద్దనే తయారు చేసుకునే పోషక విలువలున్న ఆహారాన్ని గుజ్జు రూపంలో అందివ్వాల ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భారతి, టీడీపీ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు



వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య

జరుగుమల్లి: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యుత్ లభిస్తుందని ఎంఈవో నాగేంద్రవదన్ సూచించారు. గురువారం దావగూడూరు గ్రామంలోని జనరల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరయ్య బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చదలవాడ బ్రహ్మేంద్రం, ఎంపీటీసీ వరప్రసాద్, దేవస్థాన ఛైర్మన్ బి.నరశింహారావు, గ్రామ పెద్దలు కొనూరి యానాది, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కె.వీరబ్రహ్మాచారి, గ్రామస్తులు దామచర్ల శ్రీనివాసులు, కంచర్ల రామక్రిష్ణ, బొల్లినేని ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది

పొన్నలూరు: ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి తెలిపారు. పార్లమెంట్ సమావేశాలలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు మాదిగలు చేపట్టిన నిరాహార దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించి వారి న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడానికి సుముఖంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన వెంటనే చర్యలు తీసుకుంటుందన్నారు. 2019లోపు ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెరుకూరి చంద్రశేఖరరావు, మాజీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న కృష్ణారెడ్డి

నేరవేరిన స్వగృహ కల

● 20 ఏళ్ల నిరీక్షణ ఫలించిన వేళ

● గిరిజనులలో ఆనంద హేళ


ఎస్టీ కాలనీలో నిర్మిస్తున్న గృహ సముదాయం

మద్దిపూడి : గిరిజనుల 20 ఏళ్ల నాటి కల ఎట్టకేలకు నేరవేరింది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పుణ్యమా అని ఆ గ్రామానికి కొత్త సొగసు వచ్చింది. సొంతి ఇంటి కల నేరవేరబోతుందన్న ఆనందంలో వారు ఉన్నారు. గార్లపేట పంచాయతీ పరిధిలోని కంచీపురం పొలాల సమీపంలో 20 ఏళ్ల క్రితం 20 గిరిజన కుటుంబాలు పూరిపాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. నివేశన స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్ల నిర్మించాలని కోరుతూ వచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ఎన్నికలకు ముందు గిరిజనులకు పట్టాలు, పక్కాఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావటంతో గత ఏడాది గ్రామాన్ని సందర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యే హామీని గిరిజనులు గుర్తుచేశారు. దీంతో స్పందించిన ఆయన అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు విశేషంగా కృషిచేశారు. అదేకాకుండా రూ.27 లక్షలతో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద నిధులు మంజూరు చేయించారు. దీంతో పూరిపాకలను తొలగించుకుని గిరిజనులు ఒక ఆదర్శ కాలనీ నిర్మాణానికి స్వీకారం చుట్టారు. ఇటీవల ఎమ్మెల్యే కాలనీ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. త్వరలో అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు మండలంలోని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేస్తానని గిరిజనులకు మాట ఇచ్చారు. మొత్తం మీద గిరిజనుల కల నెరవేరింది.



పక్కాగృహాలు నిర్మించుకుంటున్నాం

ఇండ్ల ఆదెమ్మ

20 ఇళ్లుగా పక్కా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నాం. సొంత ఇంటి కల నేరవేరింది. అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి మరువలేనిది. కాలనీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని ఆశిస్తున్నాం.

ఇళ్లు పూర్తయ్యేవరకు పర్యవేక్షించాలి

ఇండ్ల కొండమ్మ



గృహనిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోయేలా లేవు. మరుగుదొడ్డితో నిర్మించుకోవాలంటే అదనంగా రూ.30 వేలు భరించాల్సి ఉంది. అధికారులు, నాయకులు మరుగుదొడ్డితో పక్కా గృహం నిర్మించుకునే వరకు పర్యవేక్షించాలి.

కొణిజేడులో ఎంపీడీవో ఇంటింటి విచారణ

కొణిజేడు(టంగుటూరు): మండలంలోని కొణిజేడులో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి కోసం శుక్రవారం ఎంపీడీవో సిహెచ్.హనుమంతురావు ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికి తిరిగి విచారించారు. కొణిజేడును బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిద్దేందుకు అధికారులు కదిలారు. ఇంటింటి సర్వే చేసి ఇప్పటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోని వారి వివరాలు, అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వారిని గుర్తించారు. ఈ గ్రామానికి అధికారులు 289 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ఇది వరకే మంజూరు ఇచ్చారు. వీటిలో కేవలం 86 మాత్రమే నిర్మించుకున్నారు. సుమారు 50 మరుగుదొడ్లు నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న సుమారు 70 మందికి పైగా మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి విచారించిన ఎంపీడీవో సుమారు 225 మంది మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించారు. వివిధ దశలో నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, మంజూరై ఉండి కూడా నిర్మాణాలు చేపట్టని వారు త్వరగా నిర్మించుకోవాలని కోరారు. ఆయన వెంట ఏపీవో రాఘవరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.


లబ్ధిదారులను విచారిస్తున్న అధికారులు

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు


ముత్యాల అలంకరణలో చెట్టు మాలక్ష్మమ్మ

సింగరాయకొండ : శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాల సందర్భంగా మండలంలోని ప్రధాన ఆలయాలు శుక్రవారం పండుగ శోభను సంతరించుకున్నాయి. రైల్వే రోడ్డు లోని స్థానిక చెట్టు మాలక్ష్మమ్మ దేవస్థానంలో ఉదయం నుంచే భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి క్షీరఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముత్యాల అలంకరణలతో అమ్మవారు అభయ స్వరూపిణిగా దర్శనమిచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేసి లలితసహస్రనామ స్తోత్రాలను పఠించారు. అనంతరం అర్చకస్వాముల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులచే చేయించారు.

సుందర్‌నగర్‌లోని ప్రసన్న పోలేరమ్మ తల్లి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలతో లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సందర్భంగా అమ్మవారికి భక్తులు పాలతో అభిషేకం నిర్వహించారు.


లక్ష్మీ అవతారంలో పోలేరమ్మ తల్లి

మోటారుసైకిల్ బోల్తా పడి ఒకరికి గాయాలు

కొండపి: చిన్నారిని తప్పించబోయి మోటారుసైకిల్ బోల్తాపడి ఒకరు గాయపడ్డ ఘటన శుక్రవారం శుక్రవారం కొండపి- పెరిదేపి గ్రామాల మధ్యన రామయ్య కుంట సమీపంలో జరిగింది. కొండపి నుంచి ద్విచక్రవాహనంపై చోడవరం వెళుతు న్న చోడవరం గ్రామానికి చెందిన గుంటుపల్లి జయరావు అనే యువకుడు రోడ్డుకు ఒక వైపున ఉన్న తల్లి వద్దకు వెళుతున్న చిన్నారిని తప్పించబోయి ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

జగన్ వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కొండపి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ నాయకులు శుక్రవారం కొండపి బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల వద్ద జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ అందరూ తనలాగే జైలుకు రావాలని కోరుకునే సైకో జగన్ అని విమర్శించారు. అధికారులను జైలుకు పంపుతానని గతంలో జగన్ అన్నారని, ఇప్పుడు చంద్రబాబును జైలుకు పంపుతానని అంటున్నారని, తండ్రిని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డ జగన్ జైలు జీవితానికి అలవాటు పడి అందరూ తన వెంట రావాలని కోరుకుంటున్నారన్నారు. ఇలా కోరుకోవడం సైకో లక్షణమని వైద్యం చేయించుకుంటే జగన్ కోలుకుంటారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా పనికి రాని జగన్ తత్వం బోధపడి వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీని వీడిపోయారని, ఉన్నవారిని వదులుకుని 2019 ఎన్నికల నాటి కి జగన్ ఏకాకి కాక తప్పదన్నారు. గడచిన పదేళ్ల పాలనలో భ్రష్టు పట్టిన వ్యవస్థలను చంద్రబాబు గాడిలో పెడుతున్నాడని అన్నారు.

◗ పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి

జగన్ పిచ్చి మాటలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల నాటికి పార్టీ మూతపడి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షు డు బొడ్డపాటి యల్లమంద నాయుడు, మండల వైస్ ఎంపీపీ రావిపాటి మధుసూదనరావు, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి క్రిష్ణారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య, రావెళ్ల వెంకట రఘునాథ్‌బాబు, కందిమళ్ల రమేష్, దేపూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురై పాములు పట్టే వ్యక్తి మృతి


మృతిచెందిన చిన్నయ్య

సింగరాయకొండ : పాములను పట్టి వాటిని రోడ్లపై ఆడించే వ్యక్తి చివరకు అదే పాము కాటుకు గురై మృతిచెందిన ఘటన స్థానిక కందుకూరు రోడ్డు కూడలి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన నాగలూరి చిన్నయ్య (55) రోజు వారి పాములు పట్టుకుని వాటిని రోడ్డ వెంబడి ఆడిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవలే కందుకూరు ప్రాంతంలో ఓ నాగుపామును పట్టుకుని దానిని సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు వద్ద ఆడించేందుకు స్థానికులకు చూపించబోతుండగా కాటు వేసింది. దాంతో చిన్నయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో మృతుడు మద్యం సేవించి ఉన్నాడు. స్థానికులు 108కి సమాచారం అందించగా అక్కడకు వచ్చిన సిబ్బంది అప్పటికే మృతిచెందిన ట్లు తెలిపారు. ఎస్సై హజరత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కందుకూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

పేకాట శిబిరంపై మెరుపు దాడులు

- రూ.6.42 లక్షల స్వాధీనం
- ముగ్గురి అరెస్టు

టంగుటూరు: పక్కా సమాచారంతో యరజర్ల- వల్లూరు పొల్లాలో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడులు జరిపారు. ముగ్గురు జూదరులు పట్టుపడగా వీరి వద్ద నుంచి రూ.6.42 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలను సింగరాయకొండ సీఐ భీమానాయక్ వెల్లడించారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులు పరారయ్యారని కూడా చెప్పారు. నగదుతో పాటుగా నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ముగ్గురిని శనివారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్సై సిహెచ్.వెంకటేశ్వర్లు ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలి

సింగరాయకొండ రూరల్: మండలంలోని పాకల తీరంలో శుక్రవారం రామాయపట్నం మెరైన్ ఎస్సై శివకుమార్ మత్స్యకారులకు తగిన సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే ప్రతిఒక్కరూ బయోమెట్రిక్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లేటప్పుడు మద్యం సేవించి వెళ్లకూడదని సముద్రంలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా బోట్లు తిరుగుతున్నా పోలీసులకు తెలియపరచాలన్నారు. పర్యాటకులు వచ్చినపుడు బోట్లు, తెప్పలు సముద్రంలోకి తీసుకెళ్లకూడదని ఒక వేళ్ల తీసుకువెళ్లినా... అనుకోకుండా ప్రమాదం జరిగినా 1093కు ఫోన్ చేసి వెంటనే సమాచారం అందించాలని కోరారు. పాకల బీచ్‌లో కొంతమంది పర్యాటకులు వచ్చిన సందర్భంగా వారిని దృష్టిలో పెట్టుకుని వారికి తగిన సూచనలిచ్చారు. ఎప్పుడూ మెరైన్ సిబ్బంది పర్యాటకులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయన వెంట వెంట మెరైన్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవార పూజలు

● వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించిన మహిళలు

కొండపి: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు విశేష పూజలు, వ్రతాలు నిర్వహించారు. 'శుక్రవారపు పొద్దు సిరిని విడువద్దు, దివ్వెను ఊదగవద్దు, బువ్వ నెట్టవద్దు, తోబుట్టువుల మనసు కష్టపెట్టవద్దు, తొలి సంధ్య మలి సంధ్య నిదుర పోవద్దు, మాతల్లి వరలక్ష్మీ నిను వీడదప్పు డు...ఇల్లాలు కంటతడి పెట్టనింట, కల్లలాడని ఇంట, గోమాత వెంట, ముంగిళ్ల ముగ్గుల్లు, పసుపు గడపల్లో, పూలల్లో, పాలల్లో, ధాన్య రాశుల్లో మాతల్లి వరలక్ష్మీ కొలువై ఉంటుంది...శుక్రవారపు పొద్దు సిరిని విడువద్దు' అంటూ మహిళలు పాటలు పాడి వరలక్ష్మీకి పూజలు చేశారు. కొండపిలోని శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయం, పోలేరమ్మ ఆలయం, శివాలయం, విష్ణాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు శ్రావణ శుక్రవార ప్రత్యేకతలు, వరలక్ష్మీ వ్రత ఫలితాలను భక్తులకు వివరించారు.

గ్యాస్ లీకై చికిత్స పొందుతున్న మహిళ మృతి

సింగరాయకొండ : గ్యాస్ లీకై మంటలు అంటుకుని చికిత్స పొందుతున్న మహిళ గురువారం రాత్రి మృతిచెందింది. గత నెల 9వ తేదీన పట్టణంలోని మేదర వీధిలో ఉంటున్న ఈరగని విజయమ్మ తన ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ పైపు లీకై మంటలు వంటికి అంటుకుని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆమె నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు బంధువులకు సమాచారం అందింది.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

పామూరు : శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని సీతామహాలక్ష్మీ దేవస్థానం, మండలంలోని ఎల్ఎన్‌పురం గ్రామంలోని సాయిబాబా దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆలయాలలో విశేష పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భార్యను రోకలి బండతో హతమార్చిన భర్త అరెస్ట్

సర్వేరెడ్డిపాలెం(టంగుటూరు): రోకలి బండతో భార్య తలపై కొట్టి చేతి మణికట్టును కోసి చిత్రహింసలు పెట్టి హతమార్చిన కేసులో నిందితుడిని శుక్రవారం టంగుటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సింగరాయకొండ సీఐ భీమానాయక్, ఎస్సై సిహెచ్.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. సర్వేరెడ్డిపాలెంకు చెందిన ఉన్నం ఆదినారాయణకు టంగుటూరు మండలం పొందూరుకు చెందిన వేజండ్ల సునీత(36)తో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె పొందూరులోని సునీత కుటుంబసభ్యుల వద్ద ఉంటూ స్కూల్‌కు వెళ్తుండగా, కుమారుడు మేదరమెట్లలోని ప్రైవేట్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. లారీడ్రైవర్‌గా వెళుతున్న ఆదినారాయణ మద్యం, పేకాట లాంటి చెడు వ్యవసనాలకు బానిసై తరచూ భార్యను వేధించేవాడు. గత ఐదేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం సునీతకు డ్వాక్రా గ్రూపు ద్వారా రూ.50 వేలు, గేదెల రుణం రూ.లక్ష వచ్చింది. ఆ డబ్బులు తనకు ఇవ్వమని భార్యను హింసించేవాడు. ఇందుకు అంగీకరించకపోవడంతో గొడవ పడసాగాడు. భర్త ఆగడాలు భరించలేక ఆమె పుట్టింటి కెళ్లింది. ఒంగోలు పీర్లమాన్యంలో నివాసం ఉంటున్న వారి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. నెలరోజుల తర్వాత గత నెల 13న ఆదినారాయణ స్వయంగా వెళ్లి తాను మారిపోయానని నమ్మించి తన భార్యను తీసుకువెళ్లాడు. తిరిగి డబ్బు ఇవ్వాలని హింసిస్తుండగా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు. గత నెల 16న తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో మంచంపై నిద్రపోతున్న ఆమె తలపై రోకలి బండతో బలంగా కొట్టాడు. రెండు చేతుల మణికట్టులను బ్లేడ్‌తో కోసి కత్తితో గాయపరిచాడు. అతను పెట్టిన చిత్రహింసలకు ఆమె కన్నుమూసింది. సంఘటన జరిగినప్పటి నుంచి నిందుతుడు పరారీలో ఉన్నాడు. శుక్రవారం మర్లపాడు పొలాల్లో సీఐ, ఎస్సైలు తమ సిబ్బందితో అతనిని పట్టుకున్నారు. అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.


నిందితుడిని చూయించి వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమానాయక్

ఆంధ్రజ్యోతి
4
కనిగిరి
ప్రకాశం • శనివారం 5 ఆగస్టు 2017
కనిగిరి | హనుమంతునిపాడు | వెలిగండ్ల | సీఎస్‌పురం | పామూరు | పీసీపల్లి

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు

గుమ్మళ్ళకర్ర (కనిగిరి) : వెలిగండ్ల మండలంలోని గుమ్మళ్ళకర్ర గ్రామంలో శుక్రవారం కె.బాలయ్య(33) విద్యుత్ షాక్ గురై తీవ్రగాయాలయ్యాయి. బాలయ్య ఇంట్లోని విద్యుత్ వైరింగ్, స్విచ్‌లు పరిశీలించి, తాత్కాలిక మరమ్మతులు చేస్తూ ఆదరమరిచి ఉండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురైయ్యాడు. గాయాలై కిందపడిపోవటంతో కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేధిస్తున్న వీఆర్వోల కొరత

- పీసీపల్లి మండలంలో మెరుగుపడని రెవెన్యూ ప్రగతి
- 18 పంచాయతీలకు ఏడుగురే కార్యదర్శులు
- తహసీల్దారు కార్యాలయంలోనూ ఖాళీలు


పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయం

పీసీపల్లి : మండలంలో రెవెన్యూ కార్యదర్శుల కొరత పట్టి పీడిస్తుంది. మూలంగా పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు.

మండలంలో 18 రెవెన్యూ గ్రామాలకు కేవలం ఏడుగురు మాత్రమే వీఆర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని రెవెన్యూ ప్రగతి అటకెక్కింది. గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ నుంచి విద్యార్థులకు సర్టిఫికెట్లు, అడంగల్, పహాని, మ్యూటేషన్లు, నెటివిటీ, రెసిడెన్సీ సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడం, పంటల వివరాలు నమోదు తదిదర విధులు నిర్వహించాలి. వీటితో పాటు వివిధ పథకాల్లో వీఆర్వోల అవసరం ఉంటుంది.

అయితే ఈ 18 రెవెన్యూ గ్రామాల్లో గుంటుపల్లి, పెదయిర్లపాడు, పెద అలవలపాడు, తలకొండపాడు, ముద్దపాడు, బట్టుపల్లి, చింతగుంపల్లి గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు ఉన్నప్పటికీ లక్ష్మక్కపల్లి, పీసీపల్లి, నేరేడుపల్లి, పొతవరం, చౌటగోగులపల్లి, పెద అలవలపాడు-2, పొతవరం, తదితర గ్రామాలకు ఉన్న వీఆర్వోలకే ఆదనపు బాధ్యతలు అప్పజెప్పి ఇన్‌చార్జిగా నియమించారు. ఒక్కొక్క వీఆర్వోకు మూడు నుంచి నాలుగు గ్రామాల అదనపు బాధ్యతలు వేయడంతో సకాలంలో సమస్యలు, ప్రజల అవసరాలు తీరడం లేదు. దీంతోపాటు డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్నాయి. వీఆర్వోలు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని మండల స్థాయి ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ పలుమార్లు ఉన్నతాధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది.

వీఆర్వోలకు అదనపు బాధ్యతలు భారం కావటంతో గ్రామాలకు న్యాయ చేయలేకపోతున్నారు. వివిధ పనుల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు వీఆర్వోలు అందుబాటులో లేకపోతుండటంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న వీఆర్వోలు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జి వీఆర్వోలతో పనులు ఆలస్యం..



రెగ్యులర్ వీఆర్వోలు లేకపోవడం కారణంగా పలు రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం లేదు. పనుల కోసం కార్యాలయానికి వస్తే ఇన్‌చార్జి వీఆర్వోలు రెగ్యులర్ రెవెన్యూ గ్రామాల్లో క్యాంపులో ఉన్నట్లు సమాధానం వస్తుంది. వీఆర్వోల నియమకానికి త్వరతగతిన చర్యలు తీసుకోవాలి

- నాగేశ్వరరెడ్డి, వరిమడుగు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఏడుగురు వీఆర్వోలతో 18 రెవెన్యూ గ్రామాలకు సేవలు చేయడం కష్టమే. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. రికూట్రమెంట్ జరగగానే ఖాళీలను భర్తీ చేస్తామని వారు చెబుతున్నారు.

-షేక్ మౌలాసాహెబ్, తహసీల్దార్, పీసీపల్లి

ఇంటర్వ్యూ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



డి.సురేష్‌బాబు, ఎంపీడీవో, పీసీపల్లి

ప్రశ్న: గ్రామాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి?
జవాబు: కొన్ని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పది రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, కాలువల్లో పూడికను తీయిస్తున్నాం. పారిశుధ్యం మెరుగుపాటుతో అన్ని సమస్యలను పరిష్కరించి గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం.
ప్ర: వీధి దీపాలు వెలగడం లేదు?
జ: రెండురోజుల క్రితం కురిసిన గాలి వానకు లైట్లు కాలిపోయాయి. వాటి స్థానాల్లో కొత్తవి వేయిస్తున్నాం.
ప్ర: కార్యదర్శుల కొరతతో పాలన ఎలా నిర్వహిస్తారు?
జ: మండలంలో 18 పంచాయతీలకు నలుగురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. వీరికి మిగిలిన పంచాయతీల్లో అదనంగా బాధ్యతలు అప్పగిస్తున్నాం.
ప్ర: గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందా?
జ: మండలంలో ఓడీఎఫ్ కింద తొలిదశలో వేపగుంపల్లి, బట్టుపల్లి, చౌటగోగులపల్లి గ్రామాలు ఎంపిక చేశాం. 90 శాతం నిర్మాణాలు పూర్తి చేశాం.

- పీసీపల్లి

బధిరుల పాఠశాలకు సహకారం


వస్తువులను అందజేస్తున్న రిలయన్స్ జియో లిమిటేడ్ ప్రతినిధులు

కనిగిరి : పట్టణంలోని ఎస్‌కేఆర్ మానసిక, బధిరుల పాఠశాలకు శుక్రవారం కందుకూరు డివిజన్ రిలయన్స్ జియో లిమిటెడ్ ప్రతినిధులు రూ.30 వేలు విలువ గల వాషింగ్ మిషన్, ప్రొవిజన్స్ అందజేశారు. ఈ సందర్భంగా డి.నిరంజన్, డీసీకే మణిసాయి మాట్లాడుతూ రిలయన్స్ జీయో తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. జీయో డిస్ట్రిబ్యూటరీ మొబైల్స్ యజమాని షేక్ షఫీ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహించడంలో ఆనందం ఉందని, ఇకపై వాటిని మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జె.మీదున్ కుమార్, సాయి బ్రహ్మరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ఎస్.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంపై మంత్రి కామినేని ఆరా

కనిగిరి : కనిగిరి - పొదిలి రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన సంఘటనలో సుమారు 30 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ క్షతగాత్రులకు మెరుగైన వైద్యసహయం అందించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. బస్సు ప్రమాదం సంఘటన పూర్వపరాలు ఆయన తెలుసుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులకు చికిత్సలను అందించారు.

రేపు ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం

కనిగిరి : నిరుపేదలకు బాసటగా నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఉగ్ర క్యాంపు కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్థానిక సెయింట్ జోసప్ స్కూల్ అవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. కంటి పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా గుర్తింపు కార్డు జెరాక్సు,సెల్ ఫోన్ నెంబరు తీసుకొని రావాలన్నారు. వివరాలకు ఉగ్ర క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- ప్రత్యేకాధికారి వేణుగోపాల్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్

పీసీపల్లి : గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది, ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 కల్లా అన్ని గ్రామాల్లో ప్రారంభానికి నోచుకొని మరుగుదొడ్ల నిర్మాణాలను మొదలు పెట్టి, పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ అధికారులు ఇచ్చే ఇళ్ల జాబితాల ఆధారంగా మరుగుదొడ్ల నిర్మించే స్థలాలను జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతంగా చేయాలన్నారు. అత్యధిక శాతం ఫారంఫాండ్స్ తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేతనాలు జమకాలేదని టీఏలు ఆయన దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఏపీడీ భాస్కరరావు, తహసీల్దార్ షేక్ మౌలాసాహెబ్, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ షేక్ అలీ, ఏపీవో అబ్దుల్లా పాల్గొన్నారు.


లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

లబ్ధిదారులు ఎంపిక

హనుమంతునిపాడు : మండలంలోని మిట్టపాలెం, దాసరిపల్లి, కూటగుండ్ల గ్రామాల్లో ఎన్‌టీఆర్ గృహాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట కొండయ్య, వీఆర్వోలు నారేళ్ళ మధుసూదన్‌రావు, ఎస్పీ కాశయ్య, మహమ్మద్ వలి, ఝాన్సీరాణి, సంధ్యారాణి, జన్మభూమి కమిటీ సభ్యుడు శ్యామల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన

కనిగిరి టౌన్ : మండలంలోని పునుగోడు గ్రామంలో రైతు కోసం ప్రాజెక్టులో భాగంగా ఇక్రిశాట్ ఈజీ ప్లాంటర్ (కూరగాయ మొక్కలు నాటు పరికరం)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ పరిశోధనసాంకేతిక నిపుణుడు వేమా రామాంజనేయులు పొలాల్లో మొక్కలు నాటే విధానాన్ని పరికరం ద్వారా రైతులకు వివరించారు. 15 మంది వ్యక్తులకు బదులు ఈ విధానంలో కేవలం ముగ్గురు మాత్రమే పనిచేసి మొక్కలు నాటవచ్చన్నారు. పొలం తయారు చేసిన తర్వాత మల్చింగ్ షీట్ వేసేటప్పుడు పెద్ద రంధ్రం వేయకుండానే మొక్కలు నాటవచ్చని తెలిపారు. తద్వారా రైతులకు సమయం కలిసి రావడమే కాకుండా తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో మొక్కలు నాటి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించి, సాగు చేపడితే మంచి ఫలితాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈపీవో లక్ష్మీప్రసన్న, ప్రొటెక్టు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎలిషా పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి

పీసీపల్లి : బిడ్డకు ముర్రుపాలు పడితే వాధ్య నిరోధక శక్తి పెరుగుతుందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా చేకూరుతుందని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాలు సగిలి ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కమ్మవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అగన్‌వాడీ కార్యకర్తలు అబ్బూరి మల్లేశ్వరీ, సరళ పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న కార్యకర్తలు

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస	- ఫిదా
సుదర్శన్	- గౌతమ్‌నంద

డీజీపేటలో పిచ్చి కుక్క స్వైరవిహారం

డీజీపేట (కనిగిరి) : సీఎస్‌పురం మండలంలోని డీజీపేట గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచింది. పొలంలో ఉన్న నన్నసాని లక్ష్మయ్యను వెంటపడి తీవ్రంగా కరిచింది. సాదు రుత్విక్(6)నూ గాయపరిచింది. పిచ్చికుక్క సైర్వ విహారంతో గ్రామంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

జగన్‌ను ప్రజలే తరిమికొడతారు

● ఎరిక్షన్‌బాబు, దారపనేని ధ్వజం

కనిగిరి : వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు పదవి పిచ్చిపట్టి ఇష్టారీతినా మాట్లాడుతున్నాడని, తన వ్యాఖ్యాలు ఉపసంహరించుకోకపోతే ప్రజలు బుద్ధిచెప్తారని లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ హెచ్చరించారు. సీఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపాలన్నా జగన్‌పై వారు ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి విలేఖరులతో మాట్లాడుతూ జగన్ తాతా తండ్రులకు హింస అలవాటేనని సీఎంనే లక్ష్యంగా చేసుకున్నారంటే ఇక సామాన్యుల పరిస్థితిఏమిటని ప్రజలే ఆలోచించాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన సీఎం చంద్రబాబును జగన్ ఇష్టారాజ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్‌ను తరిమికొడతారని, నంద్యాల ఎన్నికల్లో జగన్ గెలవలేకనే చంద్రబాబును దారుణంగా విమర్శిస్తున్నారు.

కనిగిరి టౌన్ : జగన్ మోహన్‌రెడ్డిని జనం సజీవ సమాధి చేసే రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు బేరి పుల్లారెడ్డి, చిరంజీవి హెచ్చరించారు. నంద్యాల బహిరంగ సభలో సీఎం చంద్రబాబుని నడిరోడ్డుపై కాల్చి చంపాలన్నా జగన్ మాటలకు నిరసనగా శుక్రవారం కనిగిరిలో టీడీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ పుల్లారెడ్డి, చిరంజీవి మాట్లాడుతూ ఎంతో గౌరవ ప్రథమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై పరుషంగా మాట్లాడటం జగన్ ప్యాక్షనిజానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్ష హోదాలో ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన జగన్ పదవీకాంక్షతో కళ్లు బైర్లుకమ్మ మెదడు పనిచేయడం లేదన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ షేక్ చినమస్తాన్, ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఐవీ నారాయణ, కౌన్సిలర్లు ఫయాజ్, రాచమల్ల శ్రీను, జిలాని, నాయకులు గ



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

వదగట్ల మాలకొండయ్య, తిరుపతిరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శ్యామల చిన,పెద వెంకటేశ్వర్లు,ముచ్చుమూరి చెంచిరెడ్డి, అహమ్మద్, కదిరి మారుతి, కొట్టే ప్రసాద్, మస్తాన్‌వలి, ర హీం, నజిముద్దిన్, బడేబాయి,మస్తాన్‌వలి, ముండ్లమూరి కొండలు, బేదంశెట్టి వీరయ్య, ఎల్‌వీఆర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జున

పామూరు : సమస్యలపై వచ్చే దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని కందుకూరు ఆర్డీవో ఎ.మల్లికార్జున హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి, వెలిగండ్ల మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గత నెల 7న కనిగిరిలో జరిగిన ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను ఎందుకు పరిష్కరించలేదని ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగష్టు 15 నాటికి సమస్యలు పరిష్కరించకపోతే వీఆర్వోలకు చార్జీ మెమో ఇస్తానని హెచ్చరించారు.

అందని కూరగాయల ధరలు

● 10 రోజుల వ్యవధిలో సగానికిపైగా పెరిగిన వైనం

● కొనుగోలు చేయలేకపోతున్న సామాన్యులు

పామూరు : కూరగాయల ధరలు తారాజువ్వల్లా దుసూకుపోతుంటే సామాన్యుల బతుకులు పేలని టపాసుల్లా తుస్సుమంటున్నాయి. కడుపార తినలేక అనేక కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. పదిరోజుల్లో పలు రకాల కూరగాయాలు ధరలు సగానికి పైగా పెరిగిపోయాయి. ఎండల తీవ్రత ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వేసవిలో ఉత్పత్తి తగ్గడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానిక కూరగాయల వ్యాపారులు అంటున్నారు. దూర ప్రాంతాలైన బెంగుళూరు, బద్వేలు, రాజంపేట, మార్కాపురం, తదితర దూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవటం వల్ల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం టమోటా కేజీ రూ. 80, పచ్చిమిర్చి రూ. 90, అల్లం రూ. 200, ఉల్లగడ్డ కేజీ రూ. 40, క్యారెట్ కేజీ రూ. 80, బీన్స్ రూ.100, దొండ రూ. 60, బెండ రూ. 50. బీరకాయ రూ. 40, కొత్తమేర కట్ట రూ. 40 వంతున ధరల మండుతున్నాయి. పచ్చిడి చేసుకొని తిందామన్నా టమోటా, మిర్చి ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు.



కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

పశుగ్రాస క్షేత్రాలు మంజూరు

కొమరోలు: మండలంలో 60 పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు వెలుగు డెయిరీ ఏపీవో పి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవా రం కొమరోలులోని వెలుగు కార్యాలయానికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి పశుగ్రాస ఏర్పాటు కు స్థలసేకరణ చేశారు. ఈ సందర్భంగా చం ద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీకి 5 చొప్పున పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తె లిపారు. ప్రకాశం జిల్లాలో 5150 పశుగ్రాస క్షేత్రాలను 5150 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 550 ఎ కరాల్లో పశుగ్రాస క్షేత్రాలను నెలకొల్పామన్నారు. కొమరోలు మండలంలోని 17 మంది రైతుల నుండి 25 ఎకరాలను ఈ క్షేత్రాల కొరకు గుర్తించారన్నారు. ఈక్షేత్రాలను నెలకొల్పడం ద్వారా పశువులకు దాణా కొరత తీరుతుందని, గడ్డి పెంపకం పుష్కలంగా దొరుకుతుందన్నారు. గడ్డి కొనుగోలు, రవా ణా వ్యయం ఖర్చులు తగ్గుముఖం పడతాయన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



అలంకరణలో అమ్మవారు

కనిగిరి : శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా కనిగిరి పట్టణంతో పాటు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మహిళలను ఇళ్లకు పిలిచి వాయినాలు ఇచ్చి, పండ్లు రవికెలు తాంబూలాలు అందజేశారు. పట్టణంలోని దాదాపుగా ప్రతి ఇంట్లో మహిళలు శ్రావణ మాస నోములు నోచుకున్నారు. స్థానిక షిర్డిసాయిబాబా దేవస్థానం, వెంకటేశ్వరస్వామి, వాసవీ కన్యానకాపరమేశ్వరీ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానాల్లో పూజలు చేశారు.

పామూరులో..

పామూరు : మండలంలో వరలక్ష్మి వ్రతాలను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు.పట్టణంలోని సీతామహాలక్ష్మి దేవస్థానం, ఎల్‌ఎన్‌పురం గ్రామంలోని సాయిబాబా దేవస్థానంలో వ్రతాలను చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు

పామూరు : పిల్లల్లో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధులను ధరిచేరకుండా నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఎంఆర్ టీకాలపై తల్లిదండ్రులు అపోహ పడాల్సిన అవసరం లేదని డాక్టర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక అంకాలమ్మవీధిలోని పాఠశాలలో శుక్రవారం ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ టి.అహమ్మద్ ఉస్మాన్, సీహెచ్‌వో మురళికృష్ణ, ఎల్‌టీఎస్‌కేఎం బాషా, కార్యకర్త వాణి, ఆరోగ్యకార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

పామూరు : ఎ న్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరిగతిన ని ర్మాణాలను పూర్తి చేయా లని ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్‌ఎ న్‌పురం గ్రామంలో ఎ న్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి కలను సాకారం చేసేందుకు సీఎం చంద్రబాబు తెల్లకార్డు కలిగిన అర్హులందరికీ గృహాలను మంజూరు చేస్తున్నారన్నారు. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు దేవరపు మాల్యాద్రి, సర్పంచ్ ఏసేబు, హౌసింగ్ సిబ్బంది మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలి

కొమరోలు: ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్‌టీఆర్ గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీపీ కామూరి అమూల్యా కోరారు. మండలంలోని సూరవారిపల్లె గ్రామంలో ఎన్‌టీఆర్ గృహనిర్మాణ అర్హులను ప్రకటించడానికి శుక్రవారం గ్రామసభను ఏర్పాటుచేశారు. సమావేశానికి సూరవారిపల్లె గ్రామసర్పంచ్ బోయిళ్ళ సుమిత్ర అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో నరసయ్య, ఏఈ లబ్ధిదారుల జాబితాలోని 141 మంది పేర్లను చదివి వినిపించారు.

క్షతగాత్రులకు ఆర్డీవో పరామర్శ



క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జున

కనిగిరి టౌన్ : పొదిలి రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన సంఘటనలో సుమారు 30 మందికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కందుకూరు ఆర్డీవో మల్లికార్జున శుక్రవారం పరామర్శించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాద ఘటనకు గల కారణాలను క్షతగాత్రుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కిశోర్‌కుమార్, డీటీ రఫీ, ఆర్ఐ ధర్మతేజ ఉన్నారు.

కాలువల్లో మురుగు తొలగింపు

పామూరు : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ప్రారంభించారు. కనిగిరి, సీఎస్‌పురం, పాత ఎస్‌బీఐ, ఇరువూరు రోడ్లు తదితర ప్రాంతాల్లోని కాలువల్లో ఏళ్లుగా పూడిపోయిన మురుగు తీసివేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ డీవి మనోహర్ మాట్లాడుతూ ఎన్నిసార్లు కాలువలను శుభ్రం చేసినా వ్యర్థాలను వేయడం వల్ల మురుగునీరు పారక దుర్వాసన వెలువడుతూ దోమలకు అవాసాలుగా తయారవుతున్నాయన్నారు. పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ వారే కాకుండా ప్రజలు కూడా బాధ్యత వహించాలన్నారు.



కాలువల్లో మురుగును తొలగిస్తున్న దృశ్యం

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టరు

మార్టూరు: స్థానిక కోణిదెన రోడ్డులో సినిమా హాలు ఎదురుగా శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో మెయిన్‌ సెంటర్‌ నుంచి గొట్టిపాటినగర్‌ వెళ్తున్న ట్రాక్టర్‌ రోడ్డు పక్కన విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో విద్యుత్‌ స్తంభం విరిగి ట్రాక్టర్‌పై పడిపోయింది దీంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కల్గింది. ప్రజలు గమనించి అప్రమత్తం కావడంతో ఎవరికి ప్రాణ నష్టం జరగలేదు. ట్రాక్టర్‌ డ్రైవర్‌ త్రుటిలో తప్పించుకున్నాడు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్‌ అక్కయ్యచౌదరి

కారంచేడుకు కొత్త పింఛన్ల మంజూరు

కారంచేడు(చీరాల) : మండల పరిధిలోని కారంచేడు గ్రామానికి కొత్తగా 195 పింఛన్లు మంజూరు అయ్యాయని, ఎమ్మెల్యే ఏలూరికి కారంచేడుపై ఉన్న ప్రత్యేక శ్రద్ధే ఇందుకు నిదర్శనమని ఏఎంసీ చైర్మన్‌ యార్లగడ్డ అక్కయ్యచౌదరి అన్నారు.స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్‌ బాలిగ శివపార్వతి అధ్యతన జరిగిన కార్యక్రమంలో అక్కయ్య చౌదరి మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యే ఏలూరి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్‌, మండల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి అనిల్‌ బాబు, ఎంపీటీసీ సభ్యులు రజని, వై.రామచంద్రరావు,పీఏసీఎస్‌ ఉపాధ్యక్షుడు బోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు యార్లగడ్డ వెంకట్రావు, ఈఓఆర్డీ వెంకటశివయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తి,శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

కారంచేడు(చీరాల) : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్వర్ణ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎక్కువ మంది దేవాలయాల్లో శాస్త్రోక్తంగా జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

మురళి సేవలు అభినందనీయం

ఇంకొల్లు : గ్రామీణప్రాంతంలో హోమియో వైద్యుడిగా నాలుగుదశాబ్దాల పాటు సేవలందించి అందరి మన్ననలు పొందటం అభినందనీయమని తెలంగాణ విశ్రాంత రీజనల్‌ జాయింట్‌డైరక్టర్‌ ఎం.కృష్ణప్రసాద్‌ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శస్కూల్‌ ఆవరణలో శుక్రవారం రాత్రి జరిగిన డాక్టర్‌ మురళీకృష్ణ ఆత్మీయసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కూల్‌ కరస్పాండెంట్‌ విజయభాస్కర్‌ అధ్యక్షతన జరిగిన సభలో నరసరావుపేట హోమియోవైద్యుడు నాగేశ్వరరావు, ఘంటసాల స్మారకసమితి వ్యవస్థాపకుడు సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మురళీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్‌ మెహర్‌తాజ్‌, సర్పంచ్‌ తాని కొండ వెంకటేశ్వర్లు, గ్రామ రోటరీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మురళీ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సర్వీస్‌ రోడ్డుపై ప్రమాదాలు

పట్టించుకోని హైవే అధికారులు

మార్టూరు: ఇటీవల మార్టూరు పోలీసు స్టేషన్‌ పరిధిలో ద్విచక్రవాహనదారులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలను గురవుతున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది తీవ్ర గాయాలతో బతికి బయట పడ్డారు. అయితే సర్వీసు రోడ్డులో ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే విస్తరణలో భాగంగా మార్టూరు సెంటర్‌ నుంచి రాజుపాలెం, డేగరమూడి, జొన్నతాళి, ఇసుకదర్శి గ్రామాలకు సర్వీసు రోడ్డు ద్వారానే ఎక్కువ మంది ద్విచ క్రవాహనదారులు ప్రయాణిస్తుంటారు. అయితే ఎదురెదురుగా వచ్చే ద్విచ క్రవాహనదారులు ఎక్కువగా రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

సర్వీసు రోడ్డులో వెలగని వీథిలైట్లు

సర్వీసు రోడ్డులో విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేశారు కానీ, వాటికి విద్యుత్‌ కనెక్షన్‌ ఇవ్వలేదు. దీంతో రాత్రిళ్లు లైట్లు వెలగడం లేదు. రా త్రి సమయంలో చీకటిగా ఉండటం, ద్విచక్ర వాహనదారుల లైటింగ్‌ సక్రమంగా లేకపోవడం, ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు రోడ్డు సరిగ్గా కనబడక పోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ, రాంగ్‌ రూట్‌లపైనే ప్రయాణికులు ఎ క్కువగా, ముఖ్యంగా ద్విచక్రవాహన దారులు ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. మార్టూరు సెంటర్‌ నుంచి పోలీసు స్టేషన్‌, కూరగాయల మార్కెట్‌, తహసీల్దార్‌, తదితర కార్యాలయాలకు వెళ్లాలంటే తప్పని సరిగా రాంగ్‌ రూట్‌లలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అండర్‌ పాస్‌లలో ఏర్పాట్లు చేయని లైట్లు

మార్టూరు సెంటర్‌లో రెండు మినీ అండర్‌ పాస్‌లు ఒక పెద్ద అండర్‌ పాస్‌ ఉన్నాయి. స్టేట్‌ బ్యాంకు ఎదురుగా ఉన్న అండర్‌ పాస్‌ ద్వారా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతరత్రా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇక మినీ అండర్‌ పాస్‌లను ద్విచ క్రవాహనదారులు వినియోగిస్తుంటారు. రా త్రి సమయంలో అండర్‌ పాస్‌లలో లైట్లు లేకపోవడంతో మహిళలు భయాందోళనకు గరవుతున్నారు. ఎక్కువగా అండర్‌ పాస్‌లలో తోపుడు బండ్లు, గుర్తు తెలియని వ్యక్తులు ఉండటంతో అండర్‌ పాస్‌ల ద్వారా వెళ్లాలంటే భయపడుతున్నారు.

రాత్రులు మహిళలు భయపడుతున్నారు



-రామినేని శ్రీనివాసరావు, మార్టూరు



మార్టూరులో ప్రమాదానికి కారణంగా ఉన్న సర్వీస్‌రోడ్డు

అండర్‌ పాస్‌లలో లైట్లు వెలగక పోవడంతో రాత్రి సమయాల్లో మహిళలు భయపడుతున్నారు. పగలే చీకటిగా ఉంటుంది. రాత్రి తప్పని సరిగా లైట్లు వేయాలి.

ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంది



-తమ్మలూరి వెంకయ్య, మార్టూరు

అండర్‌ పాస్‌లలో తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపారుల రద్దీతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంది.

త్వరలో లైట్లు ఏర్పాటు చేస్తాం

-శేఖరరెడ్డి, హైవే వర్క్‌ మేనేజర్‌

సర్వీసు రోడ్డులలో స్తంభాలను వేశాం. త్వరలో లైట్లకు విద్యుత్‌ కనెక్షన్‌లు ఇస్తాం. అలాగే అండర్‌ పాస్‌లలో లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

జగన్‌ దిష్టిబొమ్మల దహనం

పర్చూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుపై వైసీపీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పర్చూరు ప్రాంత టీడీపీ నాయకులు వైఎస్‌జగన్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత స్థానిక పార్టీ కార్యాలయం నుంచి డప్పువాయిద్యాలతో జగన్‌ దిష్టిబొమ్మను గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక బొమ్మల సెంటర్‌ కూడలిలో జగన్‌దిష్టిబొమ్మను దహనంచేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా నాయకులు చిట్టినేని రామకృష్ణ, మండలపార్టీ కార్యదర్శి కొల్లా శ్రీనివాసరావు, రేగులగడ్డ పున్నయ్య, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, అగ్గిగుండాల వెంకటకృష్ణారావు, మండల యూత్‌ కార్యదర్శి పఠాన్‌ సమీర్‌, ఎంపీటీసీలు షేక్‌.పంషుద్దీన్‌, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, జన్మభూమి కమిటీ సభ్యులు కొల్లా శివరాంప్రసాద్‌, కోఆప్షన్‌ సభ్యుడు షేక్‌.హస్సేన్‌, ఎస్సీ సెల్‌ నాయకులు రామ్మోహన్‌, ఆర్య వైశ్య సంఘం నాయకులు శ్రీరాం వెంకటసుబ్బారావు, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కోటా బాస్కర్‌, శిరిగిరి శివనాగేశ్వరరావు, నల్లగొర్ల రవి, వెంకటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య, గుడిపాటి సాంబశివరావు, సింగు శ్రీనివాసరావు, కాకాని వీరయ్య, పాలేరు నాగరాజు, దరియా హుస్సేన్‌, షేక్‌.బాజీ తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులో జగన్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎంను చంపుతాననటం దారుణం

ఇంకొల్లు : వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి చేసిన వాఖ్యలు దారుణమని జిల్లా టీడీపీ కార్యదర్శి బోడావుల శ్యాంసుందర్‌ తీవ్రంగా ఖండించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కె. క్రాంతికుమార్‌, గుంజి వెంకట్రావు, వై.ప్రసాద్‌, ఎంపీటీసీ దుర్గారావు తదితరులు తీవ్రంగా ఖండించారు.

సుమోటాగా కేసు నమోదు చేయాలి

కారంచేడు(చీరాల) : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై పోలీసులు సుమోటాగా కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేయాలని, అందుకు గవర్నర్‌ చొరవ చూపాలని టీడీపీ కారంచేడు మండల నాయకులు డిమాండ్‌ చేశారు. స్థానిక కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్‌ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, నాయకులు జాగర్లమూడి అనిల్‌ బాబు, తిరుమల శ్రీహరి, షేక్‌ ఖాశిం తదితరులు మాట్లాడారు.



పర్చూరులో జగన్‌ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

జగన్‌పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలి

-పర్చూరు ఎ మ్మెల్యే ఏలూరి

మార్టూరు: రాష్ట్ర ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలని , అ లాగే క్రిమినల్‌ కేసుతోపాటు అతన్ని అ రెస్టు చేయాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటన కోరారు. శు క్రవారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శి క్యాంపు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

జగన్‌ దిష్టి బొమ్మ దహనం

జగన్‌ చేసిన వ్యాఖ్యలకు మండల టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం మార్టూరు సెంటర్‌లో జగన్‌ దిష్టి బొమ్మను దహనం చేశారు.

నాయిబ్రాహ్మణులను ఆదుకోవాలి

ఇంకొల్లు : నాయీబ్రాహ్మణులను ప్రభుత్వపరంగా బ్యాంకులలో రాయితీపై రుణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటునందించాలని జిల్లా నాయీబ్రాహ్మణ సేవాసంఘం కన్వీనర్‌ మిరియాల రాఘవ డిమాండ్‌ చేశారు. స్థానిక కమ్యూనిటీహాలులో శుక్రవారం పర్చూరునియోజకవర్గ నాయీబ్రాహ్మణుల సమావేశం ముప్పవరపు శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం రాయితీపై పథకాలు అందజేస్తుందని ఊదరగొట్టడం తప్ప అవి ఆచరణలో దరిచేరటం లేదన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణసంఘం నూతన కన్వీనర్‌గా మాచవరపు నటరాజ్‌, కో కన్వీనర్‌గా జి.వెంకటసుబ్బారావులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు

ఇంకొల్లు : అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ప్రతి ఒక్కరికి పింఛను అందేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి తీసుకుని కృషి చేస్తున్నారని ఇంకొల్లు మండల టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి అధ్యక్షతన జరిగిన సభలో కొత్తగా పింఛన్లు మంజూరైన 161 మంది లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధానకార్యదర్శి కె.క్రాంతికుమార్‌, సర్పంచ్‌ తానికొండ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌ కొల్లూరి నాయుడమ్మ, తానికొండ సుబ్బారావు, రఫీ, ఇమ్రాన్‌, వెంకట్రావు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

నాగులుప్పలపాడు : ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ సమీపంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. నాల్గో రోజైన శుక్రవారం దీక్షలో కొమ్మూరి గరటయ్య, విజయకుమార్, ప్రసాద్, రాజేష్, క్రాంతి కుమార్, బి. నిడమానూరు, కండ్లగుంట, ఉప్పుగుండూరు గ్రామాలకు చెందిన సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవాణాశాఖ డీసీ సుబ్బారావు

వాహనాల అతివేగం అనర్థదాయకం

• **రవాణా శాఖ డీసీ సుబ్బారావు**

చీమకుర్తి : అతివేగం అనర్థదాకమని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ సి.హెచ్.వి. కె. సుబ్బారావు అన్నారు. గ్రానైట్ స్క్వారీ వాహనాలు, ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో 97శాతం మానవ తప్పిదాల వల్ల జరుగుతాయని తెలిపారు. వీటిలో 37శాతం అతివేగం, 32శాతం ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమవుతున్నదన్నారు. డ్రైవర్లకు, యజమానులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఓవర్ లోడ్‌తో గ్రానైట్ వాహనాలు వస్తే భారీ జరిమానా విధిస్తామని తెలిపారు. ఒంగోలు డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మురళీకృష్ణ, ఎస్సై జీ.వి. చౌదరి, ఎంవీఐ నాయక్ పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయంలో నిఘా నేత్రాలు

సీసీ కెమెరాల నీడలో ఉద్యోగులు
బయోమెట్రిక్ ద్వారా హాజరు
ఎల్లుండి నుంచి ప్రారంభం


సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ ఆదినారాయణ

చీమకుర్తి: నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల్లో బాధ్యత పెంపొందించేందుకు సాంకేతికను వినియోగించుకుంటున్నారు. అందులో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు బయోమెట్రిక్ హాజరును తప్పని సరి చేశారు. ఈ విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది.

నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఇటీవల విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. కొందరు విధులకు అతిథులుగా మారుతూ ప్రజాసేవ గురించి పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కార్యాలయంలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కమిషనర్ ఆముదాలపల్లి ఆదినారాయణ తన చాంబర్‌లో కూర్చొని సిబ్బంది పనితీరును పరిశీలించే అవకాశం కల్పించారు. దీంతోపాటు బయోమెట్రిక్ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి : చీమకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ దాసరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూరు శాతం మరుగు దొడ్లు నిర్మించాలి

మద్దిపాడు : గ్రామాల్లో వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తయ్యేలా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కృష్ణ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సమాఖ్యలు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులతో చర్చించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవో ఆంజనేయులు, మద్దిపాడు, గుండ్లాపల్లి, వెల్లంపల్లి సర్పంచ్‌లు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, వీరగంధం రఘురామయ్య, వెలంపల్లి రాజు, ఎంపీటీసీ సభ్యులు చినరామయ్య, నరసింహం, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం

రాపర్ల(నాగులుప్పలపాడు): అర్హులైన ప్రతి పేదవానికి పక్కా గృహం మంజూరు చేస్తామని ఈవోఆర్‌డీ బి.వి. సుబ్బారావు తెలిపారు. శుక్రవారం రాపర్ల, చవటపాలెంలో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ గృహ నిర్మాణానికి అర్హులని చెప్పారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఏఈ చలమయ్య, సర్పంచ్‌లు దేవరకొండ యశోదర, మన్నె సీతారావమ్మ, వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రవీణ్, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒమ్మెవరంలో...

ఒమ్మెవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ జి. సుజాత పాల్గొన్నారు. సాధికార సర్వేలో పక్కా గృహాలు లేనట్లు తేలిన వారి జాతాలను చదివి వినిపించారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరుగుతుందని తెలిపారు. సర్పంచ్ అంత్రుంటి సులోచన, ఎంపీటీసీ సభ్యుడు దానియేలు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను పరిశీలించిన పీడీ

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు): కత్తిపూడి - ఒంగోలు నాలుగు వరసల జాతీయ రహదారి పనులను ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీకరెడ్డి శుక్రవారం పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే పరిహారం అందజేస్తామన్నారు. భూ రికార్డుల్లో పేర్లు తప్పులు లేకుండా సరిచేసుకోవాలని రైతులకు సూచించారు. ఉప్పుగుండూరు గ్రామ సమీపంలో పరిహారం అందని రైతుల వివరాలను వీర్వో నాగరాజు ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీడీ ఉదయ భాస్కర్, ఏఈ నాగరాజు ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం


చీమకుర్తిలో పూజల్లో పాల్గొన్న మహిళలు

చీమకుర్తి : వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల వ్రతాలు నిర్వహించారు. పట్టణంలోని హరిహర క్షేత్రం, లక్ష్మీతిరుపమ్మ గోపయ్య దేవాలయ ప్రాంగణం, ఎన్ఎస్పీ కాలనీలోని ఆలయాల్లో జరిగిన పూజల్లో మహిళలు ఎద్దఎత్తున పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నాగులుప్పలపాడు, బి. నిడమానూరు, తిమ్మసముద్రం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

మద్దిపాడులో..

మద్దిపాడు : మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మద్దిపాడు శివాలయంలో ప్రధాన అర్చకుడు పరాంకుశం వరలక్ష్మీ వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కేఎల్

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

• **సిబ్బందికి తహసీల్దార్ కేఎల్ సూచన**

మద్దిపాడు : గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా నిరోధానికి కఠినంగా వ్యవహరించాలని తహసీల్దార్ కె.ఎల్. నరసింహారావు సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారికి రూ. లక్ష జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేయాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూముల్లో ఇసుక తీయకూడదన్నారు. పట్టా భూముల్లోనూ ఇసుక విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌లోనూ సాయంత్రం 5గంటల తర్వాత ఇసుక తీయకూడదన్నారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖలతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు కేఎల్ చెప్పారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రం సందర్శన

మద్దిపాడు : మద్దిపాడులోని సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పశ్చిమగోదావరి జిల్లా బూరుగుపూడి సర్పంచ్ సూర్యచంద్ర, సిబ్బంది శుక్రవారం సందర్శించారు. అక్కడ చెత్తను శుభ్రం చేసి ఎరువు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. వారి అనుమానాలను ఎంపీడీవో కృష్ణ, సర్పంచ్ యు. నాగేశ్వరరావు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొనపాటి రామకృష్ణ, ఇనమనమెళ్లూరు ఎంపీటీసీ సభ్యుడు మందపల్లి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంగిశెట్టి నరసింహారావు, వార్డు సభ్యులు సంగు, మస్తాన్‌రావు, రామకృష్ణ, ఉండవల్లి సుధాకర్‌రావు, నట్టె సుబ్బారావు, మన్నం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి

మద్దిపాడు : పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు తాగించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో భారతి సూచించారు. తల్లిపాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మద్దిపాడులో జరిగిన కార్యక్రమంలో భారతి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె. జ్యోతి, సత్యవతి, సీహెచ్ఈవో దీవెనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు, చుండూరు మృతవీరుల సంస్మరణ సభ నేడు

నాగులుప్పలపాడు : కారంచేడు, చుండూరు మృతవీరుల సంస్మరణ సభ శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు బహుజన రాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి ఎం. మారెప్ప, విశ్రాంత ఐఏఎస్ అధికారి నూతక్కి. రామారావు, లలిత సేన రాష్ట్ర నాయకుడు జె.బి. రాజు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బహుజన నాయకులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

చంద్రన్న బీమా నగదు అందజేత

ఒమ్మెవరం (నాగులుప్పలపాడు): ప్రమాద వశాత్తూ మృతి చెందిన ఒమ్మెవరం గ్రామస్థుడు అత్తింటి జడ్సన్ కుటుంబానికి చంద్రన్న బీమా కింద రూ. 5వేలను అధికారులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ సాల్మన్, బీమా మిత్ర నాగలక్ష్మి పాల్గొన్నారు.



6న 'బత్తిన' సంస్మరణ సభ

ఒంగోలు కలెక్టరేట్ : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు దివంగత బత్తిన నరసింహారావు సంస్మరణ సభ 6వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఏకేవీకే కళాశాలలో సంతాప సభ జరుగుతుందని బీజేపీ నగర కమిటీ అధ్యక్షుడు మల్లిశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగే సభలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

● గౌరమ్మా.. వరమివ్వమ్మా...



మొక్కుతున్న మహిళ

చేతికి కంకణం కడుతున్న ముత్తయిదువు

అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ సతీమణి తదితరులు

అచలానంద ఆశ్రమంలో అమ్మవారు

అమ్మవారి పల్లకి సేవలో మహిళలు

కనులవిందుగా అమ్మవారి అలంకరణలు

జిల్లాలో శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే అమ్మవారి ఆలయాలకు వచ్చి గౌరమ్మకు మొక్కి పూజలు చేశారు. ఈ సందర్భంగా ముత్తయిదువులకు వాయిణాలు ఇచ్చుకున్నారు.

నగరంలో ఈ వారం

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వాలి

ఒంగోలు రూరల్ : పుట్టిన బిడ్డకు తల్లి మురుపాలు ఇవ్వటంతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో విజయలక్ష్మి చెప్పారు. ఒంగోలు మండలం ఉలిచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు అరగంటలోపు పాలు ఇవ్వాలన్నారు. ఈ పాలతోనే బిడ్డకు బతికినంతకాలం వ్యాధి నిరోధకత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ.ఇరమ, సర్పంచ్ అంజమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు వై. అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఒంగోలులో ఐఎంఏ రాష్ట్ర మహాసభలు

ఒంగోలు నగరం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో ఈ మహాసభలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ సభ్యులైన వైద్యులు ఈ సభల్లో పాల్గొననున్నారు. మహాసభల్లో ఐఎంఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. రాష్ట్ర మహాసభల నిర్వహణపై శుక్రవారం సాయంత్రం ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ జయశేఖర్, డాక్టర్ విజయకుమార్‌రాజు తదితరులు మహాసభల నిర్వహణపై చర్చించారు.

జన్మభూమి కమిటీలు పునరుద్ధరిస్తే ఉద్యమం

ఒంగోలు కలెక్టరేట్ : ప్రభుత్వం జన్మభూమి కమిటీలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నామని, అయితే మళ్లీ కమిటీలను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తే ఉద్యమం తప్పదని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి హెచ్చరించారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు జన్మభూమి కమిటీల పనితీరుపై సర్వే జరపాలని, అర్హులను అనర్హులుగా, అనర్హులను అర్హులుగా తీసుకున్న నిర్ణయాలతో పాటు ప్రతి పనికీ ఓ రేటుతో అవినీతి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమి ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్ : సెంటు కూడా భూమి లేని నిరుపేద దళితులకు ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని మాలమహాసభ జిల్లా అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక మహాసభ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి దుగ్గిరాల వంశీవివేక్ అధ్యక్షతవహించారు. సమావేశంలో పి. బాలాజీ, కె. బాబురావు, టి. అనిల్‌కుమార్, కె. రామ్, ఎం. కృపారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే దామచర్ల పిలుపు

ఒంగోలు కలెక్టరేట్ : వివిధ రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తెలుగునాడు ట్రేడ్ యూనియన్ పాటుపడాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కమిటీ బాధ్యులకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా పి. సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉంగరాల శ్రీనివాసరావులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, అవి కార్మికులకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్యదర్శులుగా నియమితులైన కె. ఆశీర్వాదం, ఎ. ఆంజనేయులు, కోశాధికారి సిహెచ్. రాంబాబులతో పాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యేకు పరిచయం చేశారు.



దామచర్లకు బొకే ఇస్తున్న టీడీపీ బీసీ సెల్ నేతలు

ఎమ్మెల్యేకు అభినందనలు

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను నూతనంగా ఎన్నికైన బీసీ సెల్ నగర కమిటీ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడు కఠారి నాగేశ్వరరావు నేతృత్వంలో బీసీ సెల్ నగర అధ్యక్షుడు తక్కెళ్లపాటి శ్రీధర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంచల చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. ఉపాధ్యక్షుడు బెల్లంకొండ అశోక్, అధికార ప్రతినిధి ఎస్‌కె. మౌలాలి, చంబళ్ల శ్రీనివాసరావు, సిహెచ్. సుబ్బారావు, ఎస్‌కె. ఫకీర్, నూతలపాటి ప్రసాద్, దాయినేని ధర్మా, నండూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

థియేటర్ --- సినిమా

సత్యం --- ఫిదా
రత్నమహల్--- జాబ్ హరి మెట్ సీజల్
గోపి --- దర్శకుడు
సాయిసరోజ్ -- వైశాఖం
తులసీరాం --- దండుపాళ్యం-2
జయరాం --- దువ్వాడ జగన్నాథం
గోరంట్ల సినిమాస్ స్ర్కీన్స్‌లలో----
నక్షత్రం, గౌతమ్‌నంద, నిన్నుకోరి,
జాబ్ హరిమెట్ సీజల్

ప్రభుత్వ పథకాలను పేదలు ఉపయోగించుకోవాలి

ఒంగోలు రూరల్ : ప్రభుత్వ పథకాలను పేదలు ఉపయోగించుకోవాలని ఈఓఆర్‌డీ ఎ. బాలచెన్నయ్య చెప్పారు. ఒంగోలు మండలం యరజర్ల, సర్వేరెడ్డిపాలేల్లో శుక్రవారం పక్కా ఇళ్లు అవసరమైన వారి ఎంపిక కోసం గ్రామసభలు జరిగాయి. ఈఓఆర్‌డీ మాట్లాడుతూ గ్రామాల్లో గృహాలు లేనివారు ఏ ఒక్కరూ ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. సర్వేరెడ్డిపాలెంలో ఆర్ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజా సాధికారిక సర్వే ద్వారా 141మంది గృహాలు లేనివారిగా గుర్తించామన్నారు. వీరిలో అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుజాత, సునీల్, గ్రామ రెవెన్యూ కార్యదర్శులు సురేష్, ప్రవీణ్, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ మక్కెన శ్రీనివాసరావు, జన్మభూమి కమిటీ సభ్యులు గుండపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ బాలచెన్నయ్య